
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
18-3-53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



పంచతంత్రం
మిత్రలాభం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
"అవి నా శైశవ దినాలు, - ఆరు నెలలు పసి కూనను - లోకమెల్ల నందనమై, - బ్రతుకు కొంత తీయని కలయై, - మిత్రులతో, - అప్పలతో - పచ్చిక మైదానాల్లో, - యథేచ్ఛగా తిరుగాడే - చిరుప్రాయపు తొలి దినాలు.
ఒకరోజున మేమంతా - మేతకొరకు పోతుంటే - నా కొంత చో పచ్చనైన లేబచ్చిక కనబడినది - జిహ్వా చాపల్యంతో - ఆ పచ్చిక తినబోతూ - యమపాశము బోలిన ఒక - వలలో పడి పోయాను!
నా అరుపులు విని మిత్రులు నన్ను సమీపించినారు; ఏమీ చేయుటకు తోచక కంటనీరు పెట్టినారు.
ఇంతలోన వేటగాడు దరిజేరుట చూచివారు సుడిగాలికి ఎండుటాకు లెగిరినట్లు నల్దెసలకు చెల్లా చెదరయినారు
వేటగాడు నన్ను పట్టి పసిదాన్నని దయతోనో వేరే కారణముతోనో చంపకుండ భద్రముగా చంక కెత్తుకున్నాడు
ఆ నగరపు రాజుగారి కుమారునికి బహుమతిగా అప్పగించినాడు నన్ను.
యువరాజుకు నేనంటే ప్రేమ పెరిగి తన భవనం లోనే ఒక మూల నన్ను కట్టివుంచి పెంచాడు
కొన్నినాళ్ళు గడిపాను
స్వేచ్ఛగ వదిలేశారు.
ఆకతాయి పిల్లవాళ్ల - ఆగడాలు తప్పించుకు - పోవాలని తలచి నేను - దగ్గరగల ప్రమదావన - ప్రాకారపు గోడదూకి - దభేలుమని పడ్డాను.
రాణీవాస రమణీమణు - లా రాతిరి చాల ప్రొద్దు - పోయినాక ఎప్పటికో - నన్ను వదిలిపెట్టినారు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 45
సంచిక 29
18-3-53

Founder : K. NAGESWARA RAO

విజయ చైత్ర శుద్ధ తదియ; బుధవారం



"సరసిజ మనువిద్ధం శైవలేనాపిరమ్యం"

ఫొటో : పి. సి. ఎస్. ఈశ్వరబాబు—మద్రాసు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : "నాజ్"లో
నళినీ జయవంత్

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన పెద్దకవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. అలా పంపేవారికి మాత్రమే వారి రచనలనుగాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియపరచగలము. మొదట స్టాంపులనుచేర్చి పంపక, తరువాత ఉత్తరాలు వ్రాసి స్టాంపులు పంపినట్లయితే, వెతికి పంపడం కష్టమని రచయితలూ, చిత్రకారులూ గుర్తించ ప్రార్థన. ఈ సందర్భములో రచయితలు, చిత్రకారులు మాకు సహకారమివ్వగలరని ఆశిస్తున్నాము.

కాలక్షేపం

"ఇల కందంబులు మూలముల్ మడిసెనో?
యేళ్ళింకెనో కొండలన్?
ఫలముల్ నారలు వృక్షశాఖలయెడం
బాడయ్యెనో? చూడ, గే
కల దుఃఖాప్త మితార్థ గర్వపవన
వ్యావర్తిత భ్రూ లస
త్తల భూపాస్యము లర్థి జూచెదరు
భ్రాంతస్వాంతులై యాచకుల్."

తా॥ ఈ భూమిమీద దుంపలు, చెట్ల వ్రేళ్ళు నాశనమైపోయినవా? కొండలలోని వాగులన్నియు ఎండిపోయినవా? చెట్ల కొమ్మలయందు పండ్లున్నూ, నారయున్నూ అంతరించిపోయినవా? యోచించిచూడగా కేవలము యాతనపడి చేర్చిన మితమైన కొలది ద్రవ్యముండుటవల్ల కలిగిన గర్వమనెడి గాలికి అటు యిటు చలిస్తూ ఉండే టటువంటి కనుబొమలుగల దురహంకార ప్రభువుల (అనగా ముఖవైఖరిని) యాచకులైనవారు ఏవో కొన్ని ఆశలూ, భ్రమలూ మనస్సులో పెట్టుకొని యాచిస్తూ మోచిస్తూ గమనిస్తూ ఉంటారు. ఎందుచేత?

కంద మూలములు తింటూ అడవిలో తపస్సు చేసికొనెడి మహాజ్ఞానికి యీ మాత్రపు ప్రశ్నకు సమాధానం తెలియకుండా ఉంటుందా? అటువంటి చొప్పదంటు ప్రశ్నలు తపస్సంపన్నులైన వారున్నూ తత్వవేత్తలున్నూ వేస్తారంటే నమ్మదగిన విషయంకాదు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములను జయించినవానికి గాని, జయించుటకై జితేంద్రియత్వమును సాధకము చేస్తూ ఉన్నవారికి గాని, కామం లోభం ఎటువంటివో తెలియవంటారా? కామోద్దీపనంచేత తపించే టటువంటియువతులయొక్కయు, యువకులయొక్కయు విరహవేదన బాధ ఏవిధంగా ఉంటుందో తపస్సంపన్నుడైన జ్ఞానికి తెలియదంటారా? మానవప్రకృతియొక్క తత్వపరిశీలన చేయడమే అసలైన ఆత్మజ్ఞానం, కాకపోతే, ఆ తపస్సువల్ల కలిగిన ఫలిత పర్యవసానం ఏమిటి? తపస్సులోనికి దిగకపూర్వము, ఆ యోగిపుంగవుడు కూడా సహజమానవ ప్రకృతికి సంబంధించిన రాగద్వేషాదులు కలవాడై ఆహార నిద్రాది ఇంద్రియ వ్యాపారములు కలవాడై మానవ ప్రకృతికి సంబంధించిన యింద్రియావస్థలను అనుభవించి ఉండాలి. ఆకలిదప్పులంటే ఏమిటో అనుభవించినవాడై ఉండాలి. యోగీశ్వరుడైన పిమ్మట, తన పూర్వాశ్రమములోని అనుభవ విశేషములను మరచిపోతాడా? కామమును జయించినప్పటికీ, కామాతురత ఎటువంటిదో తెలియని అజ్ఞాని అవుతాడా? సహజ మానవ ప్రకృతియొక్క అవస్థలుగాని, లక్షణములుగాని, తెలియనట్లుగా ప్రవర్తించడం జ్ఞానమెట్లా అవుతుంది? భూత, వర్తమాన, భవిష్యత్ జ్ఞానము సంపాదించినటువంటి మహర్షులు తమ పూర్వజన్మ వృత్తాంతములు కూడా వివరించేవారు. అటువంటి సందర్భములో వారికి తమయౌవనంలో తమకు ఉండిన కామక్రోధాదులకు సంబంధించిన అవస్థానుభవలక్షణ విశేషములను కావాలంటే జ్ఞప్తికి తెచ్చుకోలేరా? పరకాయ ప్రవేశం కూడా చేయగల్గిన సిద్ధులు యితరుల మనస్సులలో ఉండే ఆ వేదనలు, తాపత్రయాలు ఎటువంటివో తెలిసికొనలేరా? వారికి ఆ మాత్రపు పరేంగిత జ్ఞానము లేకుండా ఉంటుందా? ప్రభువులవద్దకు వెళ్ళి భుక్తికై వారిని ఎందుకు ఆశ్రయించడం సంభవిస్తున్నదో యోగిపుంగవుడైనవాడు గ్రహించగలడు.

శ్రీనాథునివంటి మహాకవి. "దినవెచ్చమేరాజు దీర్పగలడు?" అని ఆ వేదనపడ్డాడు. కాని, యీవిధంగా యీ మహావిద్వాంసుడు రెడ్డిరాజులను, ఒడ్డెరాజులను ఆశ్రయించి, ఆశ్రయించి, వారిచుట్టూ ప్రదక్షిణాలు చేసి చిట్టచివరకు ఏ రేవుకు చేరుకున్నాడు? "కలియుగంబున నిక నుండ కష్టమనుచు యరుగుచున్నాడు శ్రీనాథు డమరపురికి" అని జీవితాశ్వాసం ముగించాడు.

"Had I but served God with half the zeal I served the king, He would not have deserted me in my grey hairs."

(రాజునకు ఎంత భక్తి తాత్పర్యంతో సేవ చేశానో, దానిలో సగం భక్తి తాత్పర్యంతో నేను భగవంతుణ్ని సేవించినట్లయితే, యీ తలనెరసిన ముసలివయస్సులో భగవంతుడు నన్ను నిరాధారుణ్ని చేసేవాడు కాడు) అని ఇంగ్లాండులో ఒకప్పుడు కార్డినల్ వుల్సే అను ప్రభుసేవాపరాయణు డన్నాడు. ఇంగ్లండు దేశచరిత్ర గ్రంథములలో అతడు పల్కిన ఆ వాక్యం ఒక గొప్ప ధర్మోపదేశంగా తరతరములుగా అన్ని తరగతుల పిల్లలకూ నేటికిని పాఠము చెప్పుచున్నారు.

కాలం మారినా, దేశం మారినా, వారి అనుభవజ్ఞానం అనేది ఆకాశవాణి లాగున, అంతర్వాణిలాగున ఒకటే బాణీలో ఉంది. "సత్కవుల్ హాలికులైన నేమి, గహనాంతర సీమల కందమూల గౌద్దాలికులైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై?" అని బమ్మెర పోతరాజు గారు ఒక సవాలు చేశారు. అయితే ఆయనకూడా కొంత వరకు రాజులను ఆశ్రయించి చూచాడు. రాజుగారి ఉంపుడుకత్తెనుగూర్చి "భోగినీ దండకము" చెప్పినతర్వాతనే, "మనసా హరి పాదములాశ్రయింపుమా!" అని మనస్సును తిప్పుకొని, తానుచేసినది తప్పు అని ఒప్పుకొన్నారు. "స్వానుభవమిదిదెల్పితి - సత్యముగను - సానియింట్లకు బోకుడీ! సరసులార!" అని చింతామణికి సలాముచేసిన సుబ్బిశెట్టికూడా అనుభవజ్ఞాన పరిపక్వం పొంది ప్రబోధప్రచారం చేశాడు.

అయితే ప్రభువుల చెంతజేరి వారిని ఆశ్రయించిన మహాకవులుగాని, పండితులుగాని, వారిని ఆశ్రయించడంవల్లనూ, వారి సహవాస సాహచార్య దోషంవల్లనూ బాగుపడినారా? భ్రష్టులైనారా?

"కృష్ణరాయలతోడ దివి కేగలేక బ్రతికియున్నాడ జీవచ్ఛవంబ నగుచు" అని అల్లసాని పెద్దనగారు కంట తడిపెట్టి ఆకృష్ణదేవరాయలకు తన జీవితం కృష్ణార్పణం అన్నాడు. "హా! కృష్ణా! హంపీవాసా!" అని అల్లసాని పెద్దనగారు ఆవిధంగా తపించడానికి కారణం ఏమిటి? అందుకు కారణాలు పెద్దన్నగారే వివరించారు. పెద్దన్నగారు నడివీధిలో ఎదురైతే, కృష్ణదేవరాయలు తన ఏనుగుమీదనుంచి దిగి పెద్దన్నగారిని కూడా తన అంబారీలో ఎక్కించుకొనేవాడు. ఆ ప్రభువు స్వయంగా ఆ పెద్దన్నగారి పాదం పట్టుకొని, గండపెండేరము అనే బహుమాన కంకణమును ఆయన కాలికి నిండుసభలో తొడిగి గౌరవించాడు. పెద్దన్నగారికి అనేక అగ్రహారాలు అనుభవించడానికి అడిగిన చోట యిచ్చాడు. ఆయనకు అష్టయిశ్వర్యములు కల్పించి ఇంద్రభోగం అనుభవించేటట్లుగా చేశాడు. ఇంత గౌరవంగా, ఇంత గారాబంగా, అల్లసాని పెద్దన్నగారిని అల్లారుముద్దుగా పెంచిన ప్రభువుమీద ప్రేమ ఉన్నదంటే, భక్తి విశ్వాసం ఉన్నదంటే అందులో ఉన్న అంతరార్థం విశదమవుతూనే ఉంది. ఆ ప్రభువువల్ల అంత అయిశ్వర్యం, అంత అయిహికానందం లభించిన కారణంచేత ఆ ప్రభువును ప్రేమించినట్లయింది. ఆ ప్రభువువల్ల అవి లభించక పోయినట్లయితే బహుశః ఆయనకూడా ఒక వేణుగోపాల శతకం చెప్పి, ప్రభువుల కందరికీ శాపములు పెట్టేవాడేమో. ఆయన గొప్ప పండితుడు. కనుక కవి చౌడప్పకంటె అనేక రెట్లు ఎక్కువ కవియని కుందవరపు చౌడప్పగారే అంగీకరించారు. పెద్దనవలె గృతిసెప్పినవానినే కవులలో పెద్ద అని చెప్పవలెను అని చౌడప్ప ఘంటాపథంగా అన్నాడు ఈ కుందవరపు చౌడప్పకూడా గొప్పకవి కాదనుటకు వీలు లేదు. ఇతనికి ప్రభువులవల్ల తగినమర్యాద గాని గౌరవాదరణగాని లేకపోవుటవల్లనే ప్రభువులమీద తిరుగబడి "ఇంక్విలాబ్ జిందాబాద్" (విప్లవం వర్ధిల్లుగాక!) అని సారస్వతరంగంలో జమీందారీల ఆధిపత్యం అంతరించాలని రణభేరీ మ్రోగించాడు, యీ అభ్యుదయకవి. ఈ "కర్ణాట కిరాతకీచకుల కమ్మనటంచు త్రిశుద్ధిగ నమ్మ భారతీ" అని బమ్మెరపోతన్నగారు మొట్టమొదట యీ ఆంధ్ర సాహిత్య విప్లవం బాహాటంగా ప్రారంభించారు.

ప్రభువులతో గురించిన ప్రసక్తి అటువంటిదే. వారి అయిశ్వర్యాన్ని ఆశించి వారిని ఆశ్రయించి ఆస్థానపండితు లవుతారు. అట్టి సందర్భంలో ఈ పండితులు ఆశ్రయించిన దెవరిని? ఆ ప్రభువులనుకాదు. వారివద్ద ఉన్న అయిశ్వర్యాన్ని.

పూర్వమొక యిల్లాలు బంధువుల యింటిలో పెండ్లికి పిలిస్తే పెళ్ళి సాధారణమైన చెంగావి చీర ఉతికి ఆరవేసిన దొకటి కట్టుకొని విందు భోజనమునకు సిద్ధమైనది. ఆడంబరంగా ఆభరణములుకూడా ఏమీ పెట్టుకోలేదు. విందు భోజనానికి వచ్చిన ఆడవాళ్ళలో చాలామంది హెచ్చు ఖరీదుగల సిల్కు చీరెలు, సువర్ణాభరణాలు, కెంపులు పుష్యరాగాలు చెక్కిన కంఠాభరణాలు పెట్టుకొని రవ్వలరాణులు లాగున వచ్చారు. అట్టివారందరికి పెద్ద పీటలువేసి ముందు పంక్తిలో కూర్చుండబెట్టి చాలా చాలా మర్యాదచేసి, వారి కందరికీ భోజన సమయంలో విసనకర్రలతో విసురుతూ పెండ్లికుమార్తె తల్లి స్వయంగా సపర్యలు చేసింది. చెంగావిచీర కట్టిన యిల్లాలు ఆ పెండ్లికుమార్తె తల్లికి చాలా దగ్గరబంధువురాలే— అయినప్పటికీ, ఆమెను వెనుక పంక్తిలో చివరి పీటమీద కూర్చో మన్నారు. ఆమె యీ గౌరవ వ్యత్యాసం గ్రహించింది. మరునాడు విందు భోజనానికి తనకున్న జరీ పట్టుచీర కట్టుకొని, ఒంటినిండా నగలు పెట్టుకొని వెళ్ళింది. ఆమె పందిరిలోనికి రాగానే పరమాదరణతో స్వాగత మిచ్చి పెద్దపీట వేసి, పెరుగు వడ్డించి వెంట తిరిగి తియ్యని మాటలతో వెయ్యివిధాల మర్యాద చేశారు. మూడోనాడు విందుకు ఆమె తిరిగి సిల్కుచీర కట్టుకొని నిండు వేషంతోనే విందుకు వెళ్ళింది. మరునాడుకూడా ఆమెకు పెద్దపీట వేశారు. ముందు పంక్తిలో కూర్చోమన్నారు. ఈసారి తన నగలన్నీ తీసి ఆ పీటమీద విడిగాపెట్టి "మీరు చేసే మర్యాదలన్నీ యీ నగలకే గనుక వాటి కొరకే పెద్దపీట వేశారు గనుక, వాటిని ఆ పీటమీద పెట్టినాను. నేను కూర్చుండుటకు కాదు ఈ పెద్ద పీట" అన్నది.

ఎద్దూ బరువునగలు
దిద్దీయుంటేనే గాని
పెద్దాపీటా నీకు
—వెయ్యారోయి!!

నిజమే-అయిశ్వర్యం ఉన్నది గనుకనే ఆ గౌరవం - ఆ స్థానం - ఆస్థానపండితుడు ప్రభువుల నాశ్రయించడం కూడా ఆ స్థానంలో "శ్రీ" ఉండడం చేతనే గాని మరొక కారణంచేతగాదు-"మహా రాజశ్రీ" లో చివరఉన్న "శ్రీ" లేకపోతే, పాళీలేని పార్కరు ఫౌంటెన్ పెన్‌కు ఉన్న విలువయే మహారాజుకూ ఉంటుంది.

మహారాజుకు "శ్రీ" ఉన్నట్లయితే, "అతని కతండె సాటి చతురబ్ధి పరీత మహీతలంబునన్" అని కవులఘంటం ఘంటాపథంగా వ్రాస్తుంది. ఆస్థాన పండితులు ఆశ్రయించినది రాజులను కాదు. వారి అయిశ్వర్యాన్ని—

అయితే, ప్రభువులు అయిశ్వర్యం చేత అధికులమనేగర్వంతో ప్రవర్తిస్తారని వారిని నిరసించడంలో అర్థంలేదు. అటువంటి ధనవంతుని చుట్టూచేరి "నీ అంతవాడు భూనభోంతరాళముల మధ్యలేడు రాజా! నీకీర్తి తెల్లగా ప్రకాశించి వ్యాపించడంవల్లనే పరరాజులందరూ మీకంటే తెల్ల మొగములు వేసి తెల్లజెండా ఎత్తి తమ రాజ్యాల ఎల్లలుదాటి మీకీర్తిని మరింత వ్యాపింపజేస్తున్నారు" అని యీ మహాకవులు, వందిమాగధులు, ఆ రాజులచుట్టూ చేరి స్తోత్ర పాఠాలు చదువుతూ ఉంటే, ఆరాజులకు తల తిరిగి కైపెక్కి వారు గర్వం

★ కాలక్షేపం ★

అనే పర్వతం ఎక్కి దాని శిఖరంమీద కూర్చుంటారు. "ప్రబల గర్వ విదూషితుల్ ప్రభువు లెన్న" అని ఆస్థానంలో స్థానం లభించని పండితులే మరొక దండకం సాగిస్తారు. "ఈ రాజులు రాజులే, భువిత రాజులు గాక" అని పద్యాలు ప్రారంభిస్తాడు. నమస్కారాలు తిరస్కారాలు అవుతాయి.

దీనినిబట్టి చూస్తే, కొంతవరకు యీ పండితులవల్లనే ప్రభువులు భ్రష్టులైనారని తీర్పుచెప్పవలసివస్తుంది. వాళ్ళ గర్వానికి పీళ్ళ కొరకు లనవలసివస్తుంది. ప్రభువులు నిరంకుశులని నిందించాము. కాని, కవులు కూడా నిరంకుశులనే చెప్పవచ్చు. ఎవ్వరినీ లెక్కచేయకుండా భగవంతునకే నా కావ్యం అంకితం చేస్తాను అని సవాలు చెయడంకూడా ఒకవిధమైన నిరంకుశాధికారమే.

"నేను అడివిలో కూర్చుంటాను. కంద మూల ఫలాలు తింటాను. నాకు యీ రాజుతోగాని, నాకు యీ లోకులతోగాని పని ఏమిటి?" అని ధిక్కరించడంకూడా అహంకార స్వరూపమే. నాకు లోకంతో పనిలేదనే వానితో లోకానికి కూడా పని లేదు.

లోకంతో నాకు పనిలేదు అనేవాడు పరమయోగి యనిన్నీ మహాజ్ఞాని అనిన్నీ తలంచడమే అజ్ఞానం. భగవంతుడుకూడా తనకి లోకంతో పనిలేదని ఎన్నడూ అనడు. మీదు మిక్కిలి "సంభవామి యుగేయుగే" అన్నాడు భగవద్గీతలో. ఎప్పుడైతే యీ ప్రపంచంలో అధర్మం ఎక్కువైపోతుందో అప్పుడు యీ లోకాన్ని సరియైన రస్తా మీద కెక్కించి ధర్మమార్గంలోనికి త్రిప్ప డానికి భగవంతుడు పని కల్పించుకొని వస్తానన్నాడు. ఎప్పుడో ఒకసారి భగవంతుడనేవాడు తనిఖీకివచ్చిన యినస్పెక్టరు లాగున రాడు. ఈలోకాన్ని ఒక కంటితో ఎప్పుడూ కనిపెట్టుతూ మెలకువగా ఉంటాడు. హెడ్మాస్టరుగారు తన గదిలో ఏదైనా పనిచూచుకుంటూ, ఉన్నప్పుడు ప్రక్క గదియందున్న క్లాసులోని పిల్లలను అల్లరి చెయ్యకుండా ఎవరి పాఠాలు వాళ్ళు నిశ్శబ్దంగా చదువుకుంటూ ఉండవలెనని ముందుగానే హెచ్చరిస్తాడు. క్లాసులో ఎవరైనా విధవలు అల్లరి చేసినట్లుగా ఆయనకు చెవినిపడినట్లయితే, "సిరికిం జెప్పడు" అన్నట్లుగా క్లాసురూములోకి వచ్చి అల్లరి చేసినవాళ్ళ భరతం పట్టిస్తానని ముందుగానే హెచ్చరిక చేసిపెట్టాడు. దీని పేరే "సంభవామి యుగే యుగే." కాబట్టి, భగవంతుడనేవాడు యీ లోకంతో నిమిత్తం లేకుండా "అల వైకుంఠ పురంబులో నగరిలో ఆ మూల సౌధంబు దాపల మందార వనాంతరములో" నిశ్చింతగా కాఫీత్రాగి సోఫాలమీద పరుండడు. లేదా పాలసముద్రంలో శేషశయనం మీద టింగు రంగా అని పరుండి లక్ష్మీదేవి పాద సంవాహనం చేస్తూఉంటే యోగనిద్రలో గాని ధ్యానముద్రలో గాని లీనమై ఉండడు. భగవంతుని సన్నిధానం కావాలని తపస్సు చేసేవారుగాని, ఆ భగవంతుని సాన్నిధ్య, సామీప్య, సారూప్య, సాలోక్యములను పొందవలెనని సాధకము చేసేవారున్నూ భగవంతునియొక్క లక్ష్య లక్షణములను గ్రహించినవారున్నూ యీ లోకంతో తమకు పనిలేదని, యీ సంసార యాతనలతో అవస్థపడే మానవసంఘంతో జోక్యం లేకుండా ముక్కుమూసికొని మూల కూర్చుండుటకు వీలులేదు. అయితే ఎవరికి వారు ఆత్మవికాసం కోసం, ఆత్మ బలంకోసం భగవద్ధ్యానంగాని యోగసాధన గాని నిశ్చలంగా ఒకచోట కూర్చుండి చేస్తూఉండవలసిందే. కాని తాను చేసే సాధకం అంతా పరలోక సంబంధమైన ముక్తికోసమనిన్నీ, యిహలోకవిషయం తనకు అక్కర లేదనిన్నీ ఏదో సంబంధం విడగొట్టుకున్నట్టుగా, మడి కట్టుకున్నట్టుగా ప్రవర్తించడం పరిభ్రమించడం గాని కేవలం నేల విడిచి సాము చేయడమే అవుతుంది. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే సామెత యిహానికి పరానికి కూడా వర్తిస్తుంది. ఇహంతో సంబంధంలేని పరం ఉండదు. తండ్రి లేని తనయుడునూ ఉండడు.

ప్రభువులు "ప్రబల గర్వవిదూషితుల్" కావచ్చు. అంతమాత్రంచేత ఈ ప్రభువులు ఏమైతే మా కెందుకు అనేటటువంటి యోగులు యోగ్యులా? అయోగ్యులా? అదే పై పద్యంలో ఉన్న అభిప్రాయసారాంశానికి మూలకందమైన ధర్మ సందేహం. "నమ్మ నిర్వ్యాజత జూడవేని యను రాగము నాకును లేదు నీయెడన్" అని నృపతితో యతి ధిక్కారంగా మాట్లాడవచ్చు. కారణం ఏమంటే, అతను రాజు. ఇతడు యతిరాజు - లేదా, కనీసం కవి రాజు. రాజుకు అర్థబలం ఉంది. దాని మూలంగా సేనలు వగైరా అంగబలం ఉంది. కాని, యతిరాజుకున్నూ, కవిరాజుకున్నూ ప్రజాహృదయాన్ని ఆకర్షించేశక్తి ఉంది. అందువల్ల ప్రజలహృదయాన్ని ఆకర్షించి ప్రజాహృదయ పీఠంలో తనఅధికారమును ప్రతిష్ఠించి రాజుమాటకూడా చెలామణీకాకుండా చేయగలడు. అటువంటి మనోధైర్యం నిజంగా ఉన్నట్లయితే, కవిరాజుగాని యతిరాజుగాని ప్రజాపక్షంలో చేరిన వాళ్ళవుతారు. తాము ప్రభుత్వాధికార పీఠమును ఊగించి గజగజ లాడించి ఊడిపోయేటట్లు చేయగలమనే ఆత్మ విశ్వాసం వారికి ఉంది.

ఇటువంటి ప్రతికూలపక్షం అనేది ఒకటి ఉంటేనే ప్రభువుల ప్రభుత్వం అనేది, సక్రమంగా సలక్షణముగా సాగుతుంది. లేకపోతే అది గుడ్డి దర్బారుగానే నడుస్తుంది. "ఏమి మంత్రివర్యా! మన రాజ్యంబున ప్రజలందరూ సుఖంబుగా నున్నవారా?" అని మహారాజుగారు మంత్రిని అడుగుతూఉంటారు. మంత్రిగారు ఆ ప్రశ్నకు సమాధానంగా మూడు మాసాలకొకసారి రిపోర్టు వ్రాసిపంపిస్తూ ఉంటారు. "అవును మహారాజా! మన ఏలుబడిక్రింద ప్రజలందరూ సుఖంబుగా నున్నారు." "ఏమి మంత్రివర్యా! నెలకు మూడు వానలు కురియుచున్నవా?" "అవును మహారాజా! నెలకు మూడువానలు కురియుచున్నవి" ఈవిధంగా రాజుగారిచుట్టూ భజన చేస్తూ ఆయన ఉప్పు తిని ఉన్నతోద్యోగ పదవులను అలంకరించే టటువంటి సిబ్బందీ అంతా ప్రభుత్వానుకూల పక్షంగానే ప్రవర్తిస్తూ ప్రక్క తాళం వేస్తూఉంటుంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వవిధానంలో కూడా అంతే - ప్రభుత్వపక్షాన్ని ఆశ్రయించకుండా ఎదిరించి మాట్లాడగల ప్రభుత్వప్రతికూలపక్షం అనేది ఒకటిఉంటేనే ప్రజాస్వాతంత్ర్యప్రభుత్వ విధానము సార్థకమవుతుంది. ప్రభుత్వపక్షం అనేది ఒక్కటే రాజ్యమంతటను పెద్ద మఱ్ఱి చెట్టు లాగున విస్తరించి ఆ మఱ్ఱి చెట్టు నీడ క్రింద మరొకచెట్టును పెరగనివ్వదన్నట్టుగా మరొకపార్టీని తలయెత్తుకో నివ్వకుండా అణచివేసినట్లయితే, ఆ రాజ్యంలో ప్రజలకు 'ఆత్మస్వాతంత్ర్యం' పూజ్యం అని గ్రహించాలి. ఆ రాజ్యం రష్యా రాజ్యం అంతటి బ్రహ్మాండమైన రాజ్యమైనప్పుడు, ఆ రాజ్యం అంతటను కమ్యూనిస్టు పార్టీ తప్ప మరొక పార్టీ లేనప్పుడు, ఆ కమ్యూనిస్టు రాజ్యానికి ఆధిపత్యం ఎవరు వహిస్తారో, అట్టి అధిపతి అవక్రపరాక్రమ డవుతాడు. అతడు చెప్పినమాటకు ఎదురు చెప్పే పార్టీ ఇంకొకటిలేదుగనుక, విన్నన్న చెప్పింది వేదం అవుతుంది. అతడు చెక్కు చెదరని, మొక్కవోవని, ఉక్కు ముక్క

(56-వ పేజీ చూడండి)



నీటమునిగిన తాబేలు

చిత్రకారుడు:— శ్రీ బాపు, మద్రాసు.

[illegible]

1

చైత్ర శుద్ధపాడ్యమి. సంజవేళ. నాగమిల్లిలో రామకోవెలవద్ద గుమిగూడారు పెద్దలు. సంవత్సరాదికి పంచాంగశ్రవణం కానిస్తున్నాడు పురోహితుడు. గున్నలు చూపించుకుంటున్నారు రైతులు. నూతన సంవత్సరఫలాన్ని గూర్చి పంచలనం సాగుతూనే వుంది. పశుపాలకుడు కృష్ణమూర్తి. పంచం ఆర్నెల్ల దాకా కుర్రబాపనయ్య చేతిలో వుంటుందట. సంక్రాంతి పురుషుడు నువ్వులు బొట్టెట్టుకున్నాట్ట.

బీళ్ళకు వెళ్ళిన దూడలు మళ్ళి ముఖం పట్టాయి. వీధులన్నీ దుమ్ముమ, ధూళితో ముక్కా జల్లుకుంటున్నాయి.

దూరాన్నుంచి నర్సయ్య రావడం కనిపెట్టారు కాపులు. "రావోయ్. రా - ఇంత సేపూ యెక్కడున్నావ్ ? సంవత్సరాది నాడూ నీకు పనేనా? ఇవాళ పనిచేస్తూంటే ఈ యేడల్లా యిలా పని వుంటూనే వుంటుంది" నవ్వుతూ వ్యాఖ్యానిస్తున్నారు.

బంగారిగాడు కుట్టిన కొత్త కిర్రుచెప్పుల జోడు రామకోవెల పిట్టఅరుగు వారన విడచాడు నర్సయ్య. నవ్వుతూ సగం కాల్చిన చుట్టను స్తంభానికి జేర్చి వొక మూల వుంచాడు. కొత్తమల్లు కమీజుతో పూర్తిగా కప్పబడ్డ చేతులు రెండూ పైకెత్తి "దణ్ణాలండి" అన్నాడు శాస్త్రులుగారిని తిలకిస్తూ. "ఏమండో పంతులుగారూ! మా నర్సయ్యకు బాగా చూడాలండి కున్నలెన్నో - పాడిపంటలూ." అంటూ ఎగతాళి ప్రారంభించారు సన్నకారు రైతు యువకులు.

"ఏం ఏశాకోళాలోయ్? ఈ రోజుల్లో పతి కుర్రోడికీ ఎగతాళే - బయల్దేరా రెలాగైతే నోటమీది లకలు" మాట్లాడితే చాటువు లేనిదే సాగదు నర్సయ్య నోటికి. పురోహితుడివైపు జరిగాడు. బొడ్డున ముడిచిన రాగికాణీ విప్పుతున్నాడు.

"నర్సయ్యా! కాస్త చుట్ట చేతులు కడుక్కొద్దూ. కానీ తర్వాత విప్పుదువులే" అన్న వెంటనే "చిత్తం - చిత్తం" అంటూ నలభయ్యోపడిలో వున్నా కుర్రవాడివలె చెంగున కోవెల అరుగు దూకి యెదుటనే వున్న కోమటి వీరిశెట్టి యింట్లో కొంచెం నీళ్ళిప్పించమని చేతులూ కాళ్ళూ కడుక్కొని క్షణంలో శాస్త్రిగారి సమక్షంలో కూర్చున్నాడు. పురోహితుడు యెగాదిగా నాలుగుసార్లు పరకాయించాడు పంచాగాన్ని. ఏం చెబుతాడో విందామని ఉబలాటంతో ఎదురుచూస్తున్నారు గ్రామీణులంతా.

"ఓహో - దివ్యంగా వుంది నర్సయ్యగారికీ యేడు. ఆదాయం ఆరు పంతులు, ఖర్చు రెండు పాళ్ళు: ఇహనేం - బుట్టలతో వెళ్ళిన విత్తనాలు బళ్ళతో వస్తాయి. ఎర్ర ధాన్యాలు, చమురుగింజలు లాభిస్తాయి" అంటూ చెయ్యి లీలగా యెగరేస్తూ భక్తిగా వ్యాఖ్యానిస్తున్నారు శాస్త్రిగారు. పకపకలూ వికవికలూ ఎక్కువౌతున్నాయి రైతుల మధ్య. "మీ దయవల్ల జరగాలి. అనుకోవాలి" అన్నాడు ముసిముసినవ్వులు నవ్వుతూ నర్సయ్య.

కాస్సేపటికి ప్రొద్దు గ్రుంకింది. శాస్త్రిగారు డబ్బులు లెఖ్ఖచూసుకుని యెడఖాల నరా అంగవస్త్రాన్ని ముడేసుకుని శివాలయానికి వెళ్ళి శ్రీ చంద్రశేఖరస్వామివారి దర్శనం చేసుకునియింటికి చేరుకున్నాడు. ఉగాదినాటి పెద్ద సంభావనలు రెండే. వొకటి వీరయ్యశ్రేష్ఠిగారిది. పెద్దరూపాయి. యీయన్నే పూర్లో అంతా వీరిశెట్టి అంటారు. 'యీరిశెట్టిగోరు' అంటారు అలగాజనం. రెండోది పెద్దకాపుగారిది. వారి కుటుంబం నలుగు రన్నదమ్ముల మింజుమల యెనిమిదణాలు. అంటే అర్ధరూపాయబిళ్ళ. తతిమావన్నీ రాగిడబ్బులే. ముప్పాతిక ముప్వీసం చిల్లుకానులు.

పంతులు చెప్పిన ఫలితం తలచుకుంటూ యిల్లుచేరుకున్నాడు నర్సయ్య. ఊళ్ళో పేరుమోసినకుటుంబాలలో వాళ్ళదివొకటి. తండ్రిబాగా వున్నప్పుడు పండెకరాల దాకా వ్యవసాయం చేసేవాడు. మహావ్వజాయమానంగావుండేది కమతం. మూడు పుంజీల అరకలు రేవడిపాలం దున్నుతుంటే చిన్నతనంలో తానుకావిడెత్తుకుని ముంతలు మోయలేకపోయేవాడు. అలాంటి రైతు యిప్పుడు నాలుగరకల సాగుదారు. తమ్ముడూ తనూ చెరో నలభయ్యేకరాలూ పంచుకున్నారు. దంపతక్కువ. క్రొత్త వరకట్టూ పాబంపూ చేరిపదెకరాలుంటుంది. రేవడి పాతికెకరాలు. గరువు దాదాపు పదెకరాలు. ఆరాత్రే నిశ్చయించుకున్నాడు, పంచాంగంలో ఇమిడివున్న భవితవ్యానికి మెట్లువెయ్యడం.

భోంచేసి లంకపుగాకు చుట్టకాలుస్తూ ఆలోచిస్తున్నాడు. పరమటాడి రేవడి పదెకరాలూ రోహిణిలో వేరుశనగ పెట్టాలి, కందికలిపి. మృగశిరరావడంతోనే మొదటి వానకే ఖల్లిచేను అయిదెకరాలూ పత్తి బుడమ జల్లించాలి. మిగతా పేరాయచేలో ఐదెకరాలు తొలకరినుంచీ దుక్కి బాగా దున్నించి మిరపతో వెయ్యాలి. ఇంక పోతే మిగతా కొండ్రా బుడమ చేను కోయించేసిన ముక్కా మొత్తం పదెకరాలూ జొన్న చేనే ఉలవకలిపి, గరువులో కత్తిరికినువ్వుచల్లెయ్యాలి. ఎండచిలుత్రంగా ఏర్పడ్డాయి పంతులు చెప్పినజ్యోశ్యానికి! నువ్వులూ వేరుశనగలూ చమురేగదా, పోతే కందులు, బుడమలు ఉలవ జొన్న యెర్రగింజలు. దేవుడు మేలుచేసి సకాలంలో వానపడిందా, దంపంతా ముదర ఊడ్పు అవుతుంది. అరడజను గరిసెలు అక్కళ్ళ పంటకిలోటుండదు. ఈ యేటంతో వీరిశెట్టి అప్పు వెయ్యిమీద అయిదొందలు ఎగిరి చక్కాపోతుంది. స్వప్నంలో గూడా అదేఫలితం తాండవించింది. ధాన్యలక్ష్మి తనకు తానే అతన్ని వరించినట్లుంది.

చేరళ్ల అమావాస్యరాగానే పాలేళ్లను మార్చేశాడు. మూడేళ్లు కవులికి పుచ్చుకున్న కరణాల బీడులో కాడి సుగాల కోడెలినీ, పెద్దయెడ్లజతనీ, రెండుగేదలనీ, చూడియావు పెయ్యనీ అప్పగించాడు పైలకుర్రాడికి. ఖంజాయింపుగా మేపుకు రావలసిందని ఆజ్ఞాపించి నెలకి పదిగుంచాలు జీతం యేర్పాటుచేశాడు. మాలల్లో మంచి దిట్ట జియ్యిగాణ్ని కుదిర్చాడు పెద్దపాలికాపుగా, గరిసెధాన్యం యిచ్చే పరతు మీద. ఇదిగాక కళ్ళం, కట్టా వేరుగానే మాట్లాడుకుంది జియ్యడి పెళ్ళాం మాలి.

మంచిముహూర్తాన ఇదివరకే యేరువాక సాగించాడు.

2

వాగానే తొలకరించిందనుకొన్న కత్తెరలోనే గాలివానవచ్చింది కొంచెం విద్దూరంగానే వున్నా తలకట్టు సంవత్సరాలు వచ్చేవి నాలుగూనూ. కొట్టకొనికి పేరుపడ్డ ఖర దాటిపోయిందిగదా అనుకున్నారు. నాగమిల్లి మెరక గ్రామం అవడంవల్ల గాలి తాకిడి లేనేలేదు మూడు నాళ్ళు ముసాబుచేసింది అప్పటికే వేసంగి దుక్కులు ప్రారంభించిన రైతులు చక్కగా చాలుదోలి నువ్వులు చల్లేశారు నర్సయ్య ముందుగానే మేల్కొన్నాడు నువుచేను పూర్తిచేసి వచ్చే కార్తెల వ్యవసాయాలకు దుక్కులుసిద్ధంచేశాడు తెల్లవారు ఝామున చుక్కపొడవకుండా లేస్తారు పాలేరులు అరకగట్టిమధ్యాహ్నం వేళ ఉరిగేదాకా నడుం వంచకుండా దుక్కి సాగిస్తారు

కృత్తిక మొదటిపాదం అవగానే పట్టెంపు లేనివాళ్లు గోడకట్లు ప్రారంభించుకున్నారు మంగళవారాలు మినహాయించి తాటాకు యిళ్లవాళ్ళు ఆకు కొట్టించుకుని దట్టంగా యిళ్ళు నేయించుకుంటున్నారు క్రమంగా కత్తెరవెళ్ళి రోహిణి ప్రవేశించింది ఎండలు మెండైనాయి నిగనిగలాడుతూ లేవడి నేలను లేచిన నువ్వు మొక్కలు మధ్యాహ్నానికి వాడుమొగం వెట్టుకొని సంజవేళ చల్లగాలి మళ్ళగానే తిరగబడుతున్నాయి

ఊళ్ళోకివస్తే కారపుగొట్టు వీధుల్లో గూడా విహారిస్తోంది. ఎవరి చెట్టుకాయ అవకాయకి బావుంటుందా - ఈ యేడు మాగాయెంత పెట్టుకోవాలి, అనుకొంటూ ఆలోచిస్తున్నారు గృహస్థులు. ఏటేటా వచ్చే కాబూలు సాయెబులు అప్పుడే నాగమల్లి రెండుసార్లు తడిమిపోయారు, బంగినపల్లి యేమన్నా దొరుకుతుందేమో అని యెగుమతికి రాత్రిళ్లు సగం మళ్ళీవడకు గాలి చల్లబడడంలేదు మంచాలు వాకిళ్ళలో వేసుకుని వాటిక్రింద తడిగుడ్డలు చుట్టిన మట్టిచెంబులూ కూజాలూ పెట్టుకొని శయనిస్తున్నారు స్థూలకాయుల చేతులు తెగలాక్కొస్తున్నాయి, విసనకర్రలతో విసురుకోలేక

రోహిణీ రోళ్ళు బ్రద్దలుగొడుతూనే రెండువానలు కురిసింది పూరీలోకి తొలిసారిగా వేరుశెనగ జల్లిన రైతు నర్సయ్యే ఆకుమళ్ళకు అప్పుడే రెండుసార్లు మంద గట్టించి దుక్కి మశాగత్తు పూర్తిచేసుకున్నాడు. గ్రీష్మఋతువు వడి తగ్గింది వానలతో వూళ్ళో వూరగాయలు పెట్టడం జోరుగా సాగుతోంది వడగాడ్పులు మందగించాయి మామిడిపళ్ళు ముగ్గేరోజులు. కొట్టవాళ్ళు కావులు బిగించేశారు గ్రామంలో ముప్పాతిక మువ్వీసం తొలకరి వ్యవసాయం అయిపోయింది ఇంక బుడమ చేసే తరువాయి

రైతుకు రక్షరేకు మృగశిర అరంభమయింది నేల నాలుగు చెరగులా చల్లదనం చల్లబడింది. భూదేవి గర్భంలోంచి అమృతమే అవిరిగా పైకుబికిందా అన్నట్టు కమ్మని పరిమళం వెదజల్లుతున్నాయి లేవళ్లు దున్నుతూంటే. కోడెలు పట్టుబట్టి లాగుతూంటే నాగేటిచాలు భూమిని పిండి పిండిగా విడదీస్తోంది. "బుడమచేను యేం చక్కగా అవుద్దిరా - బుట్టెడు గింజలకి



'అత్తోరు పెట్టేరేంటే' అని అడిగాడు. 'ఔనండి' అన్నాను నా మెళ్లో కాసులపేరు ఎందుకో ఎగాదిగా తడవడం మొదలెట్టేడు.

కరిణీకం

బండెడు పంట, చల్లాలిరా - చల్లాలి." హెచ్చరిస్తూ సాగుచేశాడు నర్సయ్య.

బుషమచేనుతో కొంచెం ఊపిరి సలిపింది అతనికి. మర్నాడు ప్రొద్దున్నే అకు పోయించేస్తాడు. పునర్వసు, పుష్యములలో యేటా ఊడుస్తున్నారుగా. ఈ యేడు గూడా కొంచం యిటో అటో అయిపోతుంది. తర్వాతిమాట- మిరపతోటకి యెంత మశాగత్తు చేస్తే అంతపంట. కాగా జొన్న మాట చెప్పనక్కర్లేదు. దుక్కే దానికి మహాలక్ష్మి. సరిగా దున్ని స్వాతి చల్లగా వుండి విశాఖ విసరకుంటే చెప్పినపంట పండుతుంది జొన్న.

పట్టపగటి ఆరుద్ర ప్రవేశం బిందించింది గూడా. ఎర్రనిపురుగులు గరువుల్లో కన్నుల పండువుగా మెరుస్తున్నాయి. కోకలి బండలు లుంగలుగా పడివున్నాయి. కొంగల బారులు రాసాగాయి. వానలుపడే సూచన పూర్తిగా పోలేదు. దొడ్లల్లో దొంప పాదులికి గొంగళ్ళు ప్రారంభించాయి. జట్లుగా కన్నెపడుచులు పదాలు పాడుకుంటూ నువ్వు చేలకూ వేరుసెనగకూ గొప్పు తవ్వుతున్నారు. గొప్పుదవ్వులు, కలుపుతీతలు, ఊడ్పులు, కోతలు - ఇవి పల్లె జనానికి యెంతో ఆనందమయసన్నివేశాలు. ఋగ్గముడి మీసాలభూకామందుల అదలింపులు, కుర్రకారు చిన్న కాపుల సకిలింపులు, మధ్య వయస్కుల సరాగాలు- అదృశ్యాలే నేత్రోత్సవాలు.

ఆశించినంతగా ఆరుద్ర కురవలేదు. ఆకుమళ్ళకు చెరువులు తీశారు. వొంతుల ప్రకారం తడుపుకున్నారు. నర్సయ్య క్రొత్తకట్టకి గూడ వేళ తప్పిందిగాదు. రేవతి వ్యవసాయాలు గూడా ఆరిపోవడం మొదలెట్టాయి.

పునర్వసురావడంతోటి వాతావరణం మారింది. వోదురుగాలి రేగింది. మేఘాలు రావడం, ఆకాశమంతటా బెడగొండవలె మబ్బుక్రమ్మడం - ఇంకలేదు మొత్తేస్తుందను కోవడం - పడమటిగాలి పారద్రోలేయడం జరుగుతోంది. కొందరు పెద్దలు ఆరుద్ర బిందించింది. అవైరోజులు వొరుపు. అన్నారు. పునర్వసు ఆయమాయి గారడీగా దాటేసింది. ఎక్కడలేని పెట్టుబడులూ పెట్టి కలుపు తీతలూ, గొప్పు తవ్వలూ సాగిస్తూనే వున్నారు రైతులు.

3

పుష్యమి ప్రవేశించింది. వడగాలితో బాటు యెండలుబయలుదేరాయి. పుంతల్లో ఇసుక సలసలకాగి కాళ్ళు బొబ్బ లెక్కుతుంది. ప్రొద్దున్నే లేచిన నర్సయ్య వైశాఖంలో యీనిన తొలుచూరు ఆబెయ్యని పాలు తియ్యబోయాడు. ఎప్పుడూ లేనిది నేడు తన్నేసింది. అది దుశ్శకునం అనిపించింది. ఇంట్లోపాడి గొడ్డు అదొక్కటే. దాన్ని విసుక్కుంటూ తువ్వాలు బుజాన వేసుకుని బుడమచేను కలుపు తీయించుకోవడానికి చక్కాబోయాడు. ఇరవైమంది వుంటారు కూలీలు. వేళకి పనిలోనికిరాలేదు వాళ్ళు. చికాకు పడ్డాడు. అసంతృప్తితోనే పని మొదలెట్టారు కూలీలు. మధ్యాహ్నానికి ముంత తెచ్చాడు పెద్దకొడుకు అచ్చయ్య. ముంత చెట్టుకు వేళ్ళాడగట్టి ప్రక్కపొలంలో వున్న కుంటకి వెళ్ళాడు నీళ్ళకి. తిరిగివచ్చేసరికి కాకులువాలి ముంత బోర్లపడింది. ఉస్సురుమన్న ప్రాణంతో ముంత నేలకేసి కొట్టి పొమ్మన్నాడు కొడుకుని యింటికి. కూలీల్ని మరిరెండుసార్లు గదమాయించాడు. "అదిగో—అతుంగ అలా గనట్రా - ఎక్కడినారి అక్కడే వుండే మాలీ - వెర్రిచామని దిగబెట్టేశారా?" ధుమధుమలాడాడు నర్సయ్య.

వేళ మళ్ళిపోయింది. ములకోలకర్ర బుజాన వేసుకు యింటికి బయలుదేరాడు. రామకోవెల దగ్గరకు రాగానే అక్కడ కరణం మునసబూ పెద్దకాపూ వీరిశెట్టీ అవుపించారు. పంచాయతీబోర్డుబారి జంబుఖానా మాసిపోయినది రామకోవెలపై పరుపబడి వుంది. మూడుసార్లు ఆడిపారేసిన పేకముక్కలు బరువుగా కలుపుతున్నాడు వొకమూల కూర్చున్న కరణం. వేస్తున్నారు తేస్తు అయిదుగురిమీద. పైవాళ్లు ఉత్సుకతతో చూస్తున్నారు పేకాట. ఆ ఆటలో పైవాళ్లకున్నంత ఆసక్తి ఆడేవాళ్ళకి వుండనే వుండదు. ఎవడేనా ఎత్తుకుంటే చాలు ముక్కల్ని; పైవాళ్లు మందగా వాడివారికి యెగబడతారు. పంచేశారు - మూడో యెత్తు యెత్తుకున్నాడు వీరిశెట్టి. రెండు దెబ్బలతో అరడజను తురుపులు లేనిదే మూడో యెత్తు కూడా వేయని వీరిశెట్టి యెత్తుకునేటప్పటికి ఆటగాళ్లలో సంచలనం బయలుదేరింది. మంచికట్టుగా వుంది ఆట. చివరకి కుదేలయింది. కాని మేజామీద కుదేలైనా అలవైశేలకు పైగా నిల్వవున్న సావుకారు బిక్కమొగం వేసి తల పైకెత్తాడు. అర్ధణా చొప్పున పంచేశాడు-చిల్లుకానులు. పంపకం అయి తలెత్తగానే పొలంనుంచి యింటికొచ్చే నరసయ్య కనుపించాడు శెట్టికి.

"ఏఁ వోఁయ్ - బావా! సాయంత్రం వోసారి కనబడు. మాట్లాడే పని వుంది" అన్నాడు వీరయ్య.

"ఆఁ- ఆఁ-అలాగే—" విస్సాటంగా సమాధాన మిచ్చి రామకోవెలలో వున్న జనంవైపు తేరిపారజూసి గిరుక్కున ఇంటి సందులోకి మళ్ళి పోయాడు నర్సయ్య.

"ఏఁ – ఏమాత్రం యివ్వాలేటి?" కటువుగా అడిగాడు చుట్టకొనపంటితో గిల్లుతూ పెద్దకాపు.

"పదిహేను వందలు పైచిలుకు. అదుగో ఇదుగో అంటాడు అడిగినప్పుడల్లా. క్రొత్త అమావాస్యనుంచీ ధరలు పడిపోయాయి. మెల్లిగా రాబట్టుకోవాలి" అన్నాడు, మునసబు పంచిన ముక్కల్ని తీసుకొంటూ శెట్టి.

"అదేదో త్వరగా చూసుకో - లేకపోతే ఈ ధరలుగూడా దిగజారితే చిక్కుపడాలి. అతగాడితో మరీకష్టం వ్యవహారం. కోర్టుకు గూడా ఎక్కాలేమో" - ఆలోచన పెనవేశాడు పెద్దకాపు.

"ఏం - నర్సయ్యది అంత మొండిపద్దా?" ఆశ్చర్యంతో కరణం ప్రశ్నించాడు.

"మీకేం తెలుసునండీ చిన్నతనం. నర్సయ్యతో పనంటే ఇనపగుగ్గిళ్లు. అనపగుగ్గిళ్లు గాదు" వగరుగా వుంది పెద్దకాపు వ్యాఖ్యానం.

సాయంత్రం పెద్దకాపు బుర్రలో చిన్న అల బయలుదేరింది. "ఇంకా ఏడాది దాటదు, తనూ తమ్ముళ్ళూ కలసి నర్సయ్యమీద ఛార్జి పెట్టి. ముప్ఫయ్యేళ్ళుగా జమీందారుగారితో సమాన ఫాయీని వూళ్ళో నిరంకుశత్వం సాధించిన తనపై తిరుగుబాటు లేవదీశాడు నర్సయ్య. కాని ఛార్జిలో అతనే గెలిచాడు. బి. ఎ., ప్యాసయిన కరణాన్ని సాక్ష్యం వేసుకున్నాడు. ఆయన వాఙ్మూలం విన్నాక తననూ తమ్ముళ్లనూ చూసి విస్తుపోయాడు మేజస్ట్రేటు. బేషరతుగా కేసు కొట్టేశాడు. "కరణంగారు ఆపు చేశారు - లేకపోతేనా, నష్టపరిహారానికి దావాదాఖలు చేసేవాణ్ణి అన్నాట్ట గూడా నర్సయ్య, చాటునా మాటునా. ఇప్పుడు మళ్ళి అదను దొరికింది. కరువురోజుల్ని

పురస్కరించుకుని తనచేత కీలుబొమ్మగా వున్న శెట్టిని పెట్టుకుని వొక ఆట ఆడించొచ్చు. కరణం ఈ దఫా ఎలా నిలబెడతాడో వీక్షించాలి" అజవగొల్యాపడిలో కాటికి కాళ్ళు చాచిన పంతునిరంకుశత్వం మళ్ళీ చిగురెయ్యడానికి మొదలెట్టింది.

భోంచేసి చుట్ట కాల్చుకుంటూ బయలుదేరాడు నర్సయ్య వీరిశెట్టిదగ్గరికి. కొత్త పిచ్చాపాటీ సాగనిచ్చి, బాకీమాట మొదలేశాడు శెట్టి.

"ఆఁ - మునిగిపోయిందేమిటీ? నెల్లాళ్లలో నువ్వు లమ్మేస్తాగా - వేరు శెనక్కాయ రానీ - బుడమలకో ముప్పాతిక మువ్వీసం తేలిపోతుంది" అంటున్నాడు ఘరానాగా నర్సయ్య.

"కాలం చూస్తే ఎత్తనాటుగా వుంది. ధరలు పడిపోతున్నాయి. నేనూ వొకచోటునుండి తెచ్చిందేగాని రొంటిమాట గాదుగదా" చల్లగా నర్సయ్య హృదయాన్ని జాలితో గిలుపుతున్నాడు శెట్టి.

"ఈ పేదర్పులకేంలే - డబ్బుంటే నీ బాకి దిగబెడతానా? వడ్డీకి వడ్డీ గుర్రాలాగవు. నాకుమాత్రం నొప్పిగాదూ" అన్నాడు నర్సయ్య.

"అబ్బే - అదేలే - త్వరగా తేల్చెయ్. నువ్వుమాత్రం అనవసరంగా చిక్కుల్లో యిరుక్కుంటావా?" శెట్టిగారి చివరి చురుకు చీకట్లో నర్సయ్య ముఖాన్ని చికిలించింది.

అక్కడనుండి యెకాయెకీని కరణంగారింటికెళ్లాడు నర్సయ్య. జరిగిన సంగతి మనవిచేసుకున్నాడు. కరణంగారికి వూళ్లో మళ్ళీ వొక తుపాను లేస్తుందని మాచాయగా తోచింది. "మనం ఇంకో దెబ్బకి సిద్ధపడాలి" అన్నాడు నర్సయ్యతో. కొంచం చకితుడై "ఫర్వాలేదులే బాబూ - మీరు కలాన్ని కనిపెట్టివుందురూ. వూళ్లో గొడవవస్తే కరణాలకి పండుగ. కాకపోయినా ఊరుమీద వూరుపడ్డా కరణం మీద కాసుపడదు - రోజులూ మారుతున్నాయి" నర్సయ్య ఛలోక్తిగా విసురుకుపోయాడు.

"కూర్చోవయ్యా - వీరయ్యా!" శ్రేష్ఠికి పెద్దకాపు స్వాగతం పలికాడు. "ఏం - లెఖ్ఖకొవాలా" వణుకుతున్న కంఠంతో ప్రశ్నించాడు శ్రేష్ఠి. ఏదో పెద్దపనిలేనిదే పెద్దకాపు తనకు కబురు చెయ్యడు. గొడవలేకుండాకూడబెట్టుకునే మనిషి వీరయ్య. చల్లగా బదుళ్ళిచ్చి రూపాయికి బేడలు వడ్డీ గుంజడంలో ఆయనకు పెట్టింది పేరు.

"నర్సయ్యమాట యేమాలోచించావు," పెద్దకాపు అడిగాడు. అరుగుమీద రెండోవారెవరూ లేదుగదా అని రెండుసార్లు పరకాయించి పెదిమలు మెదిపి సంగతి చెప్పాడు శ్రేష్ఠి.

"వారంరోజులు పోనిచ్చి మళ్ళీ అడుగు- నీలో కరుకుదనం లేదుగదా. ఇవ్వకపోతే ప్లీడరు నోటీసు కట్టిచూస్తా యీ తడవ యేదారి కొస్తాడో నర్సయ్య. కరణం కొస్తాడో వీణ్ణి మరెవడు...నువ్వు మాత్రం బిగబట్టు" ముడిగా అన్నాడు పెద్దకాపు. తటపటాయిస్తున్నాడు శ్రేష్ఠి. తన తండ్రి నాటినుంచీ పెద్దకాపు ఎంత చెబితే అంత తమ కుటుంబంలో. జీ అంటే జీ - జా అంటే జా. "ఏంటోయ్ ఆలోచిస్తున్నావ్ దేనికి? బిళ్ళబెత్తుల్లా రూపాయలు వోళ్ళోపోసుకునేది నువ్వా నేనా? ఇంక మద్దత్తుమాటంటావూ నాకు వొదిలెయ్. ఖర్చులతో మూడురోజుల మధ్యాహ్నానికి డిక్రీయిస్తుంది కోర్టు. మీనాన్న హైములో యెన్ని జప్తులు, డిక్రీలు అమలు జర్పించానూ." అని పెద్దకాపు అంటూంటే "ఊఁ" అనక తప్పిందికాదు శ్రేష్ఠికి.

పాచికపారింది అనుకున్న ప్రకారం. పెద్దకాపు చెప్పినట్లు ఖచ్చితంగా అడిగాడు శ్రేష్ఠి నర్సయ్యని. "ఇచ్చుకో నోటీసు. ఇంకా ఏమైనా చెయ దలుచుకుంటే కానియ్. ఇప్పుడు నాచేతిలో కానీలేదు." అని సమాధానమిచ్చాడు నర్సయ్య. మరునాడుదయాన్నే కోర్టుకి ప్రయాణమయ్యాడు వీరయ్య. ఆరు లోజుల అనంతరం నర్సయ్యకు నోటీసు వచ్చింది. పోస్టు జవాను నర్సయ్యచేత తిరుగు రసీదుమీద వేలిముద్ర నొక్కించి కరణంగారిచేత సాక్షి వ్రాలు చేయించుకున్నాడు. నోటీసు సాకల్యంగా చదివి వినిపించాడు కరణం. వారం రోజుల్లో సొమ్ము చెల్లించనియెడల దావాచేసి నర్సయ్యవల్ల శ్రేష్ఠి కోర్టు ద్వారా ఖర్చులతో సహా రాబట్టుకుంటాడు. నర్సయ్యకు ధైర్యం చెప్పి యింటికి పంపి ఆలోచనలో మునిగాడు కరణం. సంస్కారంవైపు ముదిరిపోయిన గ్రామీణ నిరంకుశత్వం మళ్ళీ వొక గొడ్డలిపెట్టు పెడుతూంది. నోరూ వాయీ లేని గ్రామస్తులు దానికి యెదురీదలేక లొంగి మ్రగ్గి మాడిపోతున్నారు. పాపం! ఈ మూగజీవాలకి తెలిసినవాళ్ళు దారి చూపించినా, వాళ్ళు ధైర్యంగా నడిచి ముందుకు సాగే విధం లేదు. వాళ్ళకి శక్తీ లేదు——

4

పుష్యమి గూడా వొరుపడంతో తొలకరి వ్యవసాయాలు మాడుమొగం పట్టాయి.! "ఆరుద్ర బిందించింది పూరిక్కే పోతుందా అజ్జై రోజులు వొరుపు. దానికి దాఖలా ఆషాఢ శుద్ధపాడ్యమి వెల్లగా కునికింది. ఆవేళ మబ్బుతునకన్నదే లేదు ఆకాశంలో. ఈ యేటికి వస్లు పండవ్" జోస్యం చెప్పారు గ్రామపెద్దలు. లేబరు జనంలో అప్పుడే బువ్వకి అలమటింపులు బయలుదేరాయి.

పొలాలు అజమాయిషీ చేసి వస్తున్నాడు కరణం. వాళ్ళ వీధికి నర్సయ్య యింటి ముందునుంచే రావాలి. సాగుబడులు నోటు చెయ్యడంకొంత ఆలస్యమైంది. రోహిణీ కార్తెకువలె ఎండ తీక్షణంగా వుంది. వీధి వెంబడివస్తున్న ఆయనకి "తమ్ముడుగారూ" అన్న స్త్రీకంఠస్వరం వినబడింది. పిలుపు విని నర్సయ్య గృహంవైపు మళ్ళాడు. పట్టిమంచం హాలులోవాల్చి తెల్లదుప్పటి పరచి సిగ్గుతో గదిలోకి జారింది నర్సయ్య చిన్నకూతురు గౌరమ్మ. "ఏఁవమ్మా! బావింకా రాలేదూ? సొమ్ముకిలా వుంది తిరుగుతున్నాడు" కరణం ప్రారంభించాడు. అల్యూమినియం గ్లాసునిండా పెరుగు దాహానికిచ్చింది నర్సయ్య భార్య వెంకయ్యమ్మ. "దాహం పుచ్చుకోండి. మరిడెమ్మ అమాస కొణ్ణుంచియాక గుండా పనపడుతున్నారు. చేసిన ఎవసాయాలు ఆ వరసని మండుకుపోతున్నాయ్. ఇంక డబ్బెక్కడ పుడద్ది? అక్కడా ఇక్కడా కలుపుదీతలకి చేసిన బదుళ్లు మూడొందలు దాటేయ్. గోరుచుట్టుమీద రోకటిపోటులా యీ శెట్టిగారిగొడవ." జాలిగా చెబుతున్న ఆమెను వోదార్చాడు కరణం "అలాగే మరీ - కష్టాలొచ్చేప్పుడు కట్టగట్టుకు పడతాయ్. ఓపికపట్టాలి" అంటూంటే ఆమె ధైర్యంతో "తమరో సాయం చేసిపెట్టాలి. పిల్లదానికి పెళ్ళినాడు అత్తోరు బెట్టిన గుజ్జుపుకాసుల పేరుంది.

దానిమీద రెండువేలు ఎక్కడైనాయిప్పిస్తిరా - నే చక్కదిద్దుకుంటా వచ్చినా పద వచ్చినట్టుండదు. పడిన గోడలుపడి నట్టేవుంటాయాండీ? ఆయన్ని కోర్టుకీడిస్తే మాప నేంగానూ? గంపెడూళ్లో కాసంత పరపతిలేకుంటే గడప లేమండి బతుకు"

ఆమెసాహసానికి దిగ్భ్రమ చెందాడు కరణం. గదిలోకి వెళ్ళి గౌరిని అడిగిపెట్టెతాళంతీసి కాసులపేరు కరణానికిస్తూ "తమ్ముడుగారూ! రెండో కన్నెరక్కుండా తమరే ఈపనిచేసి పెట్టాలి. ఆయనికూడా తెలీనీకండి - పిల్లదాని అత్తోరు యేమో అనుకుంటారని ఇదవకండి.

★ కరిణీకం ★

ఇవాళ మనకొచ్చింది; రేపు వాళ్ళకి రావచ్చు" అనిముగించింది వెంకయ్యమ్మ. తనపై ఆమెకు గల నమ్మకానికి ఆమె తనపై పెట్టుకున్న భరోసాకీ కరణం ఆశ్చర్యబడి "ఎంతమాట! ఇంక తిర్వాత పని చేయిస్తాను" అంటూలేచాడు. కౌసుల పేరుగా వంచాని చుట్టబెట్టుకుని త్రుటిలో ఇల్లు చేరుకున్నాడు. అతని భవిష్యత్తు ఇప్పటిదాకా నట్టనడి సంద్రంలో చుక్కాని జారవిడుచుకున్న నావికు నివలె వుంది. పోయిన చుక్కాని యీ కౌసుల పేరుతో చేతికిచిక్కింది.

రాత్రికి ఊరినుంచివచ్చిన నర్సయ్య కరణంగారిని కలుసుకున్నాడు. తనకు సామ్మిస్తానన్న ఆసామీ పెదవి విరిచాడు. "ఇవాళ సోమవారం. బుధవారందాటితే శెట్టి కోర్టుకి రాతాడు. తిరిగి తిరిగి నాకు విసుగ్గా వుంది. చేసుజూస్తే ఏడుపొస్తూంది. ఏం చెయ్యమంటారూ?" జుగుప్సతో ప్రశ్నించాడు. కరణం లీలగా నవ్వుకున్నాడు. "ఫర్వాలేదు నర్సయ్యా - నేనొకచోట బదులు మాట్లాడేను. రేపు మంగళవారం పట్టిం పుందన్నారు. బుధవారం మధ్యాహ్నానికి రెండువేలు వచ్చే యేర్పాటు" అంటూంటే "దణ్ణాలు బాబూ! నీయిల్లు వెయ్యిళ్ళు మొదలై హామీకి గాని వెనుకాడుతున్నారేమో - బావయ్ గారూ? తనఖా గావలిస్తే మన దంపంతా రానిచ్చేద్దాం" అన్నాడు నిలద్రొక్కుని నర్సయ్య.

బి. ఏ. ప్యాసయ్యుండి - యాభయ్యేకరాల సుక్షేత్రం ఇనాం పల్లం గలిగి - ముసలెల్లాంటి రైతుల్ని చేతులో వుంచుకుని, పూర్వోకరణీకం చేస్తూ రెండువేలు పుట్టించలేకపోయానంటే ఎంత నామోషీ"హుందాగా సబాయించాడు కరణం.

బుధవారం ప్రొద్దుటేసరుకుమీద రెండువేలు బదులుకావాలని వీరయ్యదగ్గరకొచ్చాడు కరణం. శెట్టికి తాకట్టుమీద బాకీ పెట్టడం మహాసరదా - సగానికి సగం విలువయిస్తారు. వడ్డీమీద. "డబ్బులేదు బాబూ! మీరెరుగనిదేముందీ - దావాలూ దస్కాలూ అయితే గానీ రాలడంలేదు. పైగాయిచ్చిందానికి అక్షింతలు" మొదలెట్టాడు శెట్టి. "అత్యవసరం ఇచ్చితీరాలి మాబంధువులకు ప్రాణగొడ్డంగాఉంది" వొత్తిడిచేశాడు కరణం. "నాదగ్గర డబ్బులేదు నమ్మండి. మీ కిష్టమయితే రేపు రాత్రికి పట్టుకొస్తాను మామగారి వూరెళ్లి. వడ్డీ నూటికి రూపాయికి తగ్గరు" మంచి ఎత్తు ఎత్తాడు శెట్టి. సరే"అని గావంచాలో పొందుపరచిన గుజ్జుపుకౌసులపేరు విప్పాడు కరణం. కౌసులు లెఖ్ఖపెట్టాడు షావుకారు. "ఎవరిదండీ తమ్ముడుగారూ" పళ్లిగిలిస్తూ అడిగాడు. "మావొదినెగారిదవాళ్లకేదో దంపుడు వ్యవహారమొచ్చి నిన్న రాత్రి మనిషిద్వారాపంపింది" ధిలాసాగా సమాధానమిచ్చాడు కరణం.

కరణం దగ్గిరే రూపాయవడ్డీ పుచ్చుకుంటున్నందుకు శెట్టికి గుండె పీచుపీచుమంది.



"అయినా - నాకేం భూమా - బుట్రా? తీర్వాలకీ దెబ్బకీ భయపడ్డానికి." హృదయం భరోసా యిచ్చింది. అనుకున్న ప్రకారం లక్ష్మీవారం మధ్యాహ్నం మూడుగంటలకి రెండుకట్టలు - వొక్కొక్క దానిలో పదేశి అశోకచక్రం నూర్రూపాయల కాగితా లున్నవి కరణంగార్కి అందజేశాడు శెట్టి. "నీ ధర్మమా అని అవసరం గడిచేవు వీరయ్యా." అంటూ సొమ్ము లెఖ్ఖ పెట్టుకుంటున్న కరణంతో "ఆఁ-వూరికే యిచ్చే తేంటండి మావయ్యా - వడ్డీ - వద్దనుకున్న వాణ్ణయినా వ్యాపారంలోకి దింపుతుంది" అన్నాడు శెట్టి. మాటలో కించిత్తూ నొరకని శెట్టి చతురతకు కాగితంమీద కాస్తయినా దొరకని కరణం మెచ్చుకున్నాడు.

దావా దాఖలయింది కోర్టులో. వ్యవసాయదారుల ఋణాలకి నూటికి నెలకి యేషణాల నాల్గు పైసాలకంటె యెక్కువ వడ్డీ చెల్లదని ప్లీడరు సలహా యిచ్చాడు శ్రేష్ఠికి. కోర్టులో డబ్బుకడితే ఖర్చులు తగులుకోవు అని గుండెనిబ్బరం చూపాడు కరణం నర్సయ్యకి. వాయిదాకిముందే అసలీ వాయిదాల మింజుమలై పదిహేడు వందల యాభయ్యెనిమిది రూపాయల తొమ్మిదణాల యేడుపైసాలున్నూ నర్సయ్యచేత చెల్లింపించి కోర్టువారివల్ల రశీదుపొంది వెలికిబడ్డారు కరణం నర్సయ్యలు. వీరయ్యశ్రేష్ఠి టిక్కుమొగం పెట్టుకొని ప్లీడరుఫీజు పదిహేనూ, గుమాస్తాఫీజు నాలుగు రూపాయలూ చెల్లించి మంచం మిఠాయి యేబులం కొనుక్కుని తింటూ దారిలో ధర్మయ్య నూతిలో కడిపెడు మంచినీళ్ళు పట్టించి యెనిమిదిమైళ్ళదూరాన్నీ యెకాయెకిని సాగనంపి కాళ్ళు పుళ్ళుచేసుకుని రాత్రి యెనిమిదింటికి నాగమల్లి చేరుకున్నాడు.

5

ఆశ్లేష వచ్చిందని ఆశపడ్డారు రైతులు. ఆయమాయగా రడీగా కురిసింది. అకుమళ్ళు ముడుచుకున్నాయి. నువ్వు మొక్కలు తలలు విప్పుకున్నాయి. పాదులకి గొంగళ్లు లంగజుట్టాయి. "పడితే యీ కార్తెలో పడాలి, ఊడ్పులేకుంటే వరిపంట సున్న" అనుకున్నారు ప్రజలు. వేరుశెనగ పిల్ల ఊడల్ని దింపుతూ పిందె వెయ్యడానికి తాపత్రయ పడుతోంది. బుడమచేలు మాడి పోయే గతి వచ్చింది. రేవడిభూమి నెరియలు దీసింది. చెరువుల్లో నీళ్ళు యిగిరిపోయాయి. పొరుగూరి పాలాలలోవున్న నూతులకెళ్ళి నీళ్ళు దెచ్చుకుంటున్నారు. కరువుపనులు చేయించమని ప్రభుత్వానికి అర్జీలిచ్చారు గ్రామాధికారులు. లేబరు జనం గాదులకి కన్నాలేస్తారని భయాలు బయలుదేరాయి. నర్సయ్యకు మాత్రం ఆశ చావలేదు - "మఖలో కురిస్తే మదురుమీద కర్ర గూడా పండుతుంది" అనే ధైర్యం అతనికి. శ్రావణ మేఘాలు వస్తున్నాయి - ప్రయోజనంలేదు. చాగలి నాటునితప్పించి వర్షిస్తున్నాయి.

శ్రావణ పట్టెపంపారు గౌరికి అత్తవారు. చిన్న చిన్న చిల్లరనోములు తీర్పించింది వెంకయ్యమ్మ గౌరికి. అల్లుడు సూర్యనారాయణ ప్రతి మంగళవారానికీ శుక్రవారానికీ గౌరిని పరకాయిస్తున్నాడు. "పేరంటానికి వెడుతుంది. పట్టుచీర కట్టుకుంది. మిగతావన్నీ ధరిస్తుంది. పోనీ యీపర్వదినాలనైనా ఆయెంపె కన్నెరుగని కాసుల పేరుకి స్వేచ్ఛా వాయువు పీల్చే భాగ్యం వుండదూ - కాదు, యెదో కారణంవుండి తీరాలి" అనుకున్నాడు. రెండు దఫాలు అడుగుదామని ప్రయత్నించాడు. నున సిగ్గూ, భేషజమూ నివారిస్తున్నాయి.

మఖకార్తె ప్రవేశించింది. ఇది పోతు కార్తి. అసలేకురవలేదు. మిగిలిన కాసిన్ని బుడమకర్రలూ మాడి వూరుకున్నాయి. ఏ తల్లిచలవో అనుకున్నారు వూరంతా ఏవూరు మునసబో గాని అన్నాట్ట "కన్నెబొందు గోస్తే కణేల్మని కొణ్ణి గోయిస్తా పోలేరమ్మకి." అలాగే ఆయేడు కన్నెబొందేగోశారట. వూరంతా ఉడికిపోతున్నారు. అప్పుడే వొకరిద్దరిగా దెలకు కన్నాలుగూడా వేశారు? అలగా జనం అనుకున్నారు కొందరు. "ఏమో పాపం పుణ్యం భగవంతునికే తెలియాలి" అన్నారు క్రొత్తకోడళ్లు చాటుగా. ఉన్నమారాజులు గాదెలో గింజలు గదుల్లోకి మళ్ళించేశారు.

చాగలివాడు ఘోరకలిగా వుంది. మాలపడుచులు మధ్యాహ్నం స్నానమాడి గొంతెమ్మను లేవదీసుకుని పదాలుబాడుతూ వీధులుంట బయలుదేరారు. వీళ్ళపాటలికి చినుకుపడుతుందని విరికిడి. కానిమగ కార్తెకి మమకారం ఉంటేగా? గుంపులవాళ్లు రెండుసార్లు తిరిగిపోయారు. ఇంటికో తవ్వెడు బియ్యం డబ్బా యిప్పించమని. దండుపుంతలో వూళ్లమునసబులంతా చాటింపించారు. దొంగలభయానికి హడలుతున్నారు జనం.

మిరపనార్లకు కావిళ్ళ త్తలేక చస్తున్నారు క్షత్రసజ్జ. నర్సయ్య మిరపతోటే మానుకున్నాడు. కోసిన నువ్వుచేనంతా కలిపి గూనెడు గింజలవలేదు. అంతా తప్పగింజే - ఆరుగుంచాలు పోసినా గానుగ వడంలేదు. వేరుశెనగచేలు వెనుకబడ్డాయి. వరి ఆకులు కణుపులేశాయి. మఖకార్తెతో పూర్తిగా ఆశలుమాసి కన్నెబొందుతో బుడమచేలు పీకేశారు గ్రామస్తులు.

పుబ్బగూడా మఖలానే మాయచేసింది. తొలకరివ్యవసాయాలు తీసేశారు. ఎకరానికి ఇరవైబస్తాలకు తక్కువ రాలవనుకున్న వేరుశెనగచేనంతా పీకితే ఐదుబస్తాలకాయలొచ్చాయి నర్సయ్యకి. "పదివేల బస్తాలైనా అయే బుడమ చేను వూరిలో పాడయింది" అనుకున్నారు రైతులు. "గేదె చస్తేనేగాని పాలు బయటపడవు" విఘ్నేశ్వరుని చవితికికాస్త చిలకరించబట్టి వేరుశెనగవిత్తనాలైనా దెట్టింది. లేకపోతే ఆ ఆశ గూడాలేదు.

రైతుకిమాట యిచ్చిందిట ఉత్తర-"గంపయెత్తిస్తానని" వచ్చిపడింది ప్రథమపాదం మామూలుగానే సాగింది. రెండో పాదంలో రెండు దుక్కులు గురిసింది. నేలలో నెరియలు సర్దుకున్నాయి మళ్ళీ దుక్కులుబట్టారు అంతా జొన్నచేనే. మెరలకల్లో ఉలవలూ పెసలూకలిపి చల్లారు. పల్లాల్లో మినుము, జనుము- చల్లారు.

చెరువుల్లో నీరు చేరుకుంది. భూమి పచ్చబడింది.

వీధుల్లో మళ్ళీ పల్లెపడుచులు "పాండవులు పాండవులు తుమ్మెదా పంచపాండవులే తుమ్మెదా" అంటూ జట్లుగా బయలుదేరారు. శేషన్న మేష్టారు గిలకలు వట్టించారు "పంటల్లేవని పండుగలు మానుతాయా" ఉలవమొక్కలు రాగిదమ్మిడీలవలె తమ్మెలేసుకు వస్తున్నాయి. ముద్దరాళ్లవలె మస్య మస్య ముఖాలు ముడుచుకున్నాయి కన్నెజొన్నమొక్కలు.

విజయదశమికి మళ్ళీ వచ్చాడు సూర్యనారాయణ ఈసారీ కాసులపేరు మీదనే వుంది అతని ధ్యాస. శ్రీచంద్రశేఖరస్వామివారి ఆలయంలో కన్యకాపరమేశ్వరిపూజకు వెళ్ళివచ్చిన గౌరిని గదిలో నిలవదీసి అడిగాడు. "కాసులపేరెక్కడికిపోద్ది? కొంచెం ఎబ్బెట్టుగా వుంది అమ్మకిస్తే దాచింది" యుక్తిగా సమాధానమిచ్చింది గౌరి. నమ్మక తప్పింది గాదు నర్సయ్య అల్లుడికి. ఆడది అబద్దమాడితే గోడబెట్టినట్లుంది. అత్తగారిని అతగాడు అడగనేలేదు.

దసరానుండి పండుగలవరుస ప్రారంభం. పల్లెటూళ్ళలో అట్లతదియ వొక వేడుక. వాయినాలు తీరుస్తారు క్రొత్త పెళ్ళికూతుళ్లు. పూజలు చేసుకుని చేతులకి కట్టుకొనే తోరాలకట్ట, గోరింటాకుతో పండి పండువగా వున్న కోమలహస్తాలకో అలంకరణం. తద్దికి అల్లుళ్ళు గూడా వస్తారు - ఊయలలూ, ఆటపాటలూ వుంటాయి. సూర్యనారాయణకు కాసులపేరు విషయం విడిపోని సమస్యగా వుండిపోయింది. సాహసించి అత్తగారిని అడిగాడు. ఆమె ఆ

(52-వ పేజీ చూడండి)

[illegible]

శ్రీ వెంకటేశ్వర మోటారు లారీ అండ్ బస్సు సర్వీసు లిమిటెడ్‌వారి బస్సు వెనకాలే ఎఱ్ఱటి దుమ్ము రేపుకుంటూ వచ్చి రోడ్డు మలుపులోని మర్రిచెట్టు క్రింద ఆగింది.

బస్సులోనుంచి కృష్ణమూర్తి దిగే లోగానే, క్లీనరు బస్సు టాపుమీదకి లాఘవంగా ఎక్కేసి సూటుకేసూ, హోల్డాలూ దించేశాడు. కృష్ణమూర్తినీ, సూటుకేసునీ, హోల్డాలునీ వెనకాల వదిలిపెట్టి బస్సు మళ్ళీ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి సిగరెట్టు ఒకటి ముట్టించి రెండు జేబుల్లోకీ చేతులు పోనిచ్చుకుని చుట్టూ ఒకసారి చూశాడు.

తను వదిలిపెట్టి వెళ్ళిపోయినతరవాత యీ పన్నెండు సంవత్సరాలలోనూ పనసపాడులో ఏమీ మార్పు రాలేదని రోడ్డు మలుపూ, మర్రిచెట్టూ ఎదురుగా పుంతా చెపుతున్నాయి.

తనలోమాత్రం ఈ పన్నెండు సంవత్సరాలూ చాలా మార్పు తీసుకువచ్చాయని తెల్లటి డ్రిల్లుఫాంటూ, పోలిష్ చేసిన నల్లటి బూటూ సాక్ష్యం పలుకుతున్నాయి.

ఆ మఱ్ఱిచెట్టు ఎప్పటిలాగా ఆరోడ్డు మలుపులోనే ఉంది. చెట్టుకు ఎదురుగా రోడ్డుకి అవతల ప్రక్కన పనసపాడు పోయే పుంతకూడా ఈపక్కనీ ఆపక్కనీ బ్రహ్మ జెముడుడొంకలతో సహితం అల్లాగే ఉంది. మర్రిచెట్టుని ఆనుకునిఉన్న షెడ్డులోని సోడాషాపూ అక్కడే ఉంది.

ఆ సోడాషాపులో ఒకఅమ్మాయికూర్చుని ఉండేది. బలేషోకీలా—చాలాచాలా చెప్పుకునేవారు ఆ అమ్మాయినిగురించి కథలు. చిన్నా పెద్దా అందరూ ఏదో ఒకవంక పెట్టుకుని ఆకొట్టుదగ్గరకి వచ్చి రోజూ, ఆ అమ్మాయినిచూసి పోతూండేవారు.

ఆ అమ్మాయి ఇప్పుడు కొట్టులో లేదు. ఎవరో ఆసామీ తలగుడ్డ చుట్టుకుని నోట్లో యింత పొడుగుచుట్ట పెట్టుకుని, చిల్లర డబ్బులు లెక్క చూసుకుంటున్నాడు.

ఆచెట్టు మొదట ఒక ముసలమ్మకూర్చుని, మొక్కజొన్నపొత్తులూ, రేగులూ వగైరా ఏకాలంలోవచ్చేవి ఆకాలంలో అమ్ముతో ఉండేది. ఆ చెట్టుక్రిందకి ఎవరు వచ్చినా వాళ్లని పలకరించి పుట్టు పూర్వోత్తరాలు కనుక్కోకుండా వదిలేది కాదు. తనుకూడా చాలాసార్లు ఆ అవ్వదగ్గర ఏవేవో కొనుక్కుని తింటూ అవ్వచెప్పే కబుర్లు వింటూ కూర్చునేవాడు - చాలా మంచి అవ్వ! ఇంకా బతికిఉందో లేదో!

ఒక్కసారి తల ఎగరవేసుకుని, నిటారుగా నిలబడి, ఒళ్లు విరుచుకుని, జేబులో చెయ్యి బయటకుతీసి క్రాపు సద్దుకుంటూ పుంతకేసే చూస్తూ ఆలోచనలో పడి పోయాడు.

ఇంతలోనే ఎవరో తన ప్రక్కన చేరి, "పనసపాడు పోవాల్నేంఁ?" అని అడిగాడు.

'అవును' అని సమాధానం చెబుతూనే తల ఇటుతిప్పిచూశాడు కృష్ణమూర్తి.

'మోహన్'

సోడాషాపులో మనిషి చిల్లర లెక్క పెట్టడం పూర్తిచేసి, ఎప్పుడు వచ్చాడో కర్రమీద ఆనుకుని చుట్టపొగ వదులుతూ తనవేపు వింతగా చూస్తున్నాడు.

"ధాన్యాల తణిక్కీ ఆఫీసరల్లే ఉంఁదే!" అన్నాడు మళ్ళీ ఆ పెద్దమనిషి, తను సరిగ్గా గుర్తించానన్నట్లు చూస్తూ.

కృష్ణమూర్తికి చిరాకు వేసింది. వీళ్ళకి కావలసిందీ, అక్కరలేందీ ఏమీ లేదు. అందులో ఎవరైనా కొత్తమొహాలు కనుపిస్తే వెర్రి పుట్టుకొస్తుంది వీళ్ళకి.

"కాదులే! మునసబుగారి చుట్టాలం" అన్నాడు కృష్ణమూర్తి విసుగ్గా. ఆ విసుగు చూసి మళ్ళీ ప్రశ్న వెయ్యడానికి సాహసించలేదు ఆ పల్లెటూరిమనిషి.

కృష్ణమూర్తి తన సామానువైపు చూస్తూ నిలబడి పోయాడు. రెండుమైళ్ళయినా. ఆపుంతంబటపడిపోవాల్నే! ఈ సామాను ఏల్లాగ?

కృష్ణమూర్తి అవస్థ గుర్తించాడు, పల్లెటూరి మనిషి -

"కుర్రాడ్ని తోలుతా నుండండి" అని వెనక్కి తిరిగి షెడ్డువెనకాల పాకలోంచి ఎవర్నో కేకవేశాడు - పన్నెండేళ్లకుర్రాడు బయటకు వచ్చాడు.

"ఆ సామానుతో ఆరికూడా ఎల్లి మునసబుగారింటికాడ దిగిడిచిరా - ఏమైనా యిత్తారులే ఎల్లు" అన్నాడు.

కుర్రాడు మాటాడకుండా, పెట్టే హోల్డాలూ నెత్తిన పెట్టుకుని "మరిపదండి" అన్నట్లు చూశాడు.

కృష్ణమూర్తి సిగరెట్టు అవతల పారవేసి రెండుచేతులూ మళ్ళీ జేబుల్లో పెట్టుకుని పుంతలోకి జొరబడ్డాడు. నడుస్తుంటే అతని మనస్సు పనసపాడుమీదా, తన చిన్నతనం మీదా మసలింది.

రమణయ్యా, రామిరెడ్డీ, తనూ జట్టాపట్టా లేసుకుని, తోటలల్లోనూ, చేలల్లోనూ పొద్దస్తమానం తిరిగేవాళ్ళు. వాళ్ళు ముగ్గురూ తోటల్లో పడ్డారంటే - ఆ తోట యజమాని చెట్లకాయలకింక ఆశ వదులుకోవలసిందే. అందులో రమణయ్య మరీను - తాడి చెట్లు సైతం ఎక్కి ముంజెలు కొట్టేవాడు - రమణయ్య తన్ని వదిలిపెట్టి ఉండేవాడు కాదు- ఎవర్నీ ఎప్పుడూ గట్టిగా మాట అని ఎరగడు మళ్ళీ -

ఇప్పుడు ఏంచేస్తున్నాడో రమణయ్య.

పచ్చటిచేలూ, చేలవెనకగా రంగురంగుల ఆకాశం. పొద్దున్నా, మధ్యాహ్నం సాయంత్రం ఎప్పటికప్పుడు ఏవేవో క్రొత్తదనాలు చూపుతూంటే ఆరంగుల్లోకిచూస్తూ చెట్లుఎక్కి, పొలాల్లో తిరిగీ, కబుర్లు చెప్పుకుంటూ హాయిగా ఉండేవాడు - రామిరెడ్డి పదాలు బాగా పాడేవాడు.

ఇన్ని సంవత్సరాలూ వీళ్లమాటే మరిచిపోయాడు తను. మద్రాసులో, తనకాలేజీ, ప్రాక్టీసూ, థియేటర్లూ, బీచీ, వీటిమధ్య ఈ గ్రామాన్నీ, ఆనాటిమిత్రుల్నీ పూర్తిగా మరిచిపోయాడు.

ఇప్పుడైనా అమ్మ 'ఆపొలం సంగతేదో కొంచెం చూసుకురారా' అని మిషపెట్టి తనని తొందరపెట్టకపోతే, అసలు ఇక్కడికి వచ్చేవాడేకాడేమో!

అసలు రహస్యం అమ్మకీ తనకీ కూడా తెలుసు, మామయ్య అమ్మని ఊరికే తొందర చేస్తున్నాడు - సుశీలని తనకి చేసుకోమనీ, ఒకసారి వీలుచేసుకునివచ్చి చూసిపొమ్మనీ -

పెళ్లిచూపులు, ఆ ఆర్భాటం అంటే తనకి అసలు కిట్టదు. అదంతా ఒక 'ఫార్సు' లాగ ఉంటుంది. అంతా పాతకాలంపద్ధతి అది - అమ్మకీ తెలుసును తన సంగతి. అందుచేతే అసలు విషయం అనకుండా, వ్యవహారం మీద వెళ్ళమంది -

తనూ అనుకుంటున్నాడు. ఆ నాలుగేళ



లోపలి వసారాలోకి వచ్చేసరికి గోడకి చేరబడి కూర్చుని సుశీల మొహం ఎఱ్ఱగా చేసుకుని ఏదో ఆలోచిస్తూంది.

రాల పొలం అమ్మేసి, మద్రాసులో చే రెండు ఇళ్ళు వేస్తే - అద్దె డబ్బులూ కిడతాయి తనకి ఇల్లూ ఉంటుంది ఈ కవుళ్ళు, వసూళ్ళు - బాధ తను పడలేడు మామయ్య మాత్రం ఎంతకాలంచూస్తాడు తన వ్యవహారాలు - ఎంత పలుకుబడిఉంటేమాత్రం?

మామయ్య చాలా గొప్పవాడు. ఊళ్ళో అందకీ అతన్ని చూస్తేనే హడలు. పెద్దపెద్ద మీసాలూ అతనూ, చేతులో కర్ర, తలకి పాగా వెనకాల తలారితో దారంట నడుస్తూంటే, వీధివీధంతా ఒదిగి నడిచేవారు - మరి ఆ ఊరి మునసబు మామ మామయ్య తలుచుకోకపోతే ఎవరిపనీ నడవదు - తనకి ఇంకా జ్ఞాపకం ఉంది - చిన్నతనంలో అంతా మామయ్యనిగురించి చెప్పుకోవడం - దుక్కల్లాంటి ఇద్దరు దొంగల్ని కర్రతో గట్టిగా ఉతికి ఇద్దర్నీ రెండుచేతులా ఒక్కడూ లాక్కుపోయి రాణాలో అప్ప చెప్పి వచ్చాడట - బలే ధైర్యం మామయ్యకి.

ఆలోచిస్తూ నడుస్తూన్న కృష్ణమూర్తి కాలు గతుకులోపడి గబుక్కున పడబోయి ఆపుకున్నాడు - కుర్రాడు అది చూసి నవ్వాడు. కృష్ణమూర్తి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు -

వెధవపుంత - ఒక్కళ్ళకి ఈపుంతకి ఇంత కంకరపోసి రోడ్డువేద్దాం అన్నధ్యాసయినా కలగలేదు - అయినా సిమెంటురోడ్లూ తారు రోడ్లూ గొప్పవాళ్ళు కార్లల్లో పోయేచోట్ల కాని, ఈ పల్లెటూరు ఎలాగపోతే ఎవరికి పట్టిందేం?

ఇంకా ఎంతదూరం నడవాలో! ఎంత నడిచినా తరగటల్లేదు తన చిన్నతనంలో రోడ్డుమలుపునుంచి ఊరికి ఒక్క అంగలో వచ్చేసేవాడు -

మధ్యలో పంట కాలవ దాటాల్సి వచ్చింది - కాలవలో నీళ్ళు పూటుగా ఉన్నప్పుడు ఒక తాడిచెట్టు అడ్డంగా పడేసేవారు దానిమీదనడిచి దాటేవాళ్లుఅంతా - ఇప్పుడు నీళ్ళు అంతగా లేవు బురదగా ఉంది కాలవంతా. ఇప్పుడు కూడా ఒక తాటిబద్ద బురదలో సగం కూరుకుపోయి ఉంది బూట్లు విప్పి కుర్రాడిచేతికిచ్చి, లాగు మోకాళ్ళపైకి జాగ్రత్తగా మడిచి కాలవదాటి - పక్కతోటలోఉన్న దొరువులో దిగి కాళ్లకి పట్టిన బురద శుభ్రంగా కడుక్కున్నాడు - ఊరు యింక అట్టే దూరంలో లేదు

ఆ పంటకాలవంటే కొంచెం దూరం పోతే, మామ చేనూ - అవతలగా తనచేనూ ఉన్నాయి.

కుప్పలు నూరుస్తూంటే చిన్నతనంలో, మామయ్యతోటీ, నాన్నతోటీ పొలంలోనే ఉండిపోయేవాడు చీకటిలోకూడా పోలేరు అయినా వెంటరాకుండా సుశీల అందరికీ అన్నం తెచ్చిపెట్టేది - కొంచెంకూడా భయంలేదు దానికి పురుగూ పుట్రా వుంటాయనైనా లెక్కపెట్టకుండా పొలాలకి అడ్డపడి వచ్చేసేది - తనూ రాత్రి అక్కడే ఉండిపోయేది చింపిరిజుట్టూ తనూ, ఎప్పుడూ చిలిపిగా ఉండేది -

సుశీల ఇంకా అలాగ చిలిపిగా అల్లరి చేస్తూనే ఉందా? తనలాగ పెద్దదయిపోయి ఉంటుంది -

కృష్ణమూర్తికి తోటలమీదనుంచివస్తోన్న చల్లటిగాలితోపాటు తియ్యటి ఆలోచనలు

నాకు క్రొత్తగా పెళ్లి అయింది క్రొత్త పెళ్లాన్ని వెంటబెట్టుకొని అందరి యిళ్లకూ వెళ్లినట్లే మా కాలేజీ లెక్చరరుగారింటికి కూడా వెళ్లాను.

ఆయన వైవాహిక జీవిత పరమార్థాన్ని వివరించి, వేద కాలం నుంచీ నేటి అధునాతన యుగం వరకు వైవాహిక కర్మకాండలలో వస్తూవున్న మార్పులన్నీ ఏకరువుపెట్టారు. భార్యాభర్తలు అన్యోన్యంగా వుండాలంటే, వారుభయులూ పాటించవలసిన పద్ధతులను గురించి మరింత శ్రద్ధగా చెప్పుతూ, నాకు ఒక ముఖ్యమైన సలహా యిచ్చారు.

"నువ్వు ముఖ్యంగా ఓర్పు అలవాటు చేసుకోవాలి. ఏమంటావా?- మాటవరసకి నువ్వూ మీ ఆవిడ కలిసి సినిమాకు పోదాం అనుకొంటారనుకొందాం. సాయంకాలం 5 గంటలకి నువ్వు ఆఫీసునుంచీ తిరిగి వచ్చేసరికల్లా 'రెడీగా' వుండమని ఆవిడతో చెప్పి వెళ్తావు. తీరా నువ్వు తిరిగివచ్చిచూసేసరికి ఆవిడ ముస్తాబు యింకా పూర్తికాదు. అలాంటప్పుడు అవతల సినిమా దాటిపోతుందేమోనన్న యావకొద్దీ నీకు మీ ఆవిడమీద చిరాకు పుట్టుకొస్తుంది. అయినా సరే- ఆ చిరాకు పైకి కనిపించనీయకుండా వెంటనే ఏదో ఒక పుస్తకం చదువుకొంటూ కూర్చో. ఈ పద్ధతి గనుక నువ్వు అలవాటు చేసుకోగలిగావంటే అనుకోకుండానే ప్రపంచ వాఙ్మయచరిత్రలోని వుదాత్త రచనలన్నిటిలోనూ పరిచయంగల వ్యక్తిగా తయారై పోగలవ్!"

ఎండమావులు ★

కలిగాయి - హుషారుగా యీలవేసుకుంటూ వడిగా నడవడం మొదలుపెట్టాడు.

కుర్రవెధవ నడవలేక పరుగు మొదలుపెట్టాడు. అదిచూసి కృష్ణమూర్తి వడి తగ్గించాడు.

వంగ మొక్కలకి నీళ్ళు పడుతూన్న ఆసామీ ఒకడు కొత్తమనిషి రావడం చూసి ఏతాం నిలిపేసి మొహానికి చెయ్యి అడ్డం పెట్టుకుని చూడ్డం మొదలుపెట్టాడు - కృష్ణమూర్తికి చిరాకు పుట్టింది. ఆతోట దాటే వరకూ మళ్ళీ కొంచెం విసురుగానే నడిచాడు. తోటమలుపు తిరగగానే ఊరు కనుపించింది.

ఊరుచివర ఒక పెద్దఇల్లు - ఇంటిచుట్టూ ఎత్తయినమట్టిగోడ - కోటలాగఉంటుంది - ఫర్లాంగుదూరానికి కనిపిస్తూనే ఉంటుంది - ఆయిల్లు పెద్దరాజుగారిది. పెద్దరాజుగారంటే మహాదొడ్డ ఆసామీ - కాశీమజిలీ కథల్లో చెప్పుకునే రాజులాగ ఉండేవాడు ఆయన. తన చిన్నతనంలో వాళ్ళఇంట్లో ఒకపెళ్ళి జరిగింది. పెద్దరాజుగారి అమ్మాయిది - ఎక్కడెక్కడి జనం - అక్కడే ఉన్నారు. ఆ పెళ్ళి అయినన్నాళ్లూ తోలుబొమ్మలూ, మేళాలూ, బ్యాండు - సన్నాయి - బాణసంచా - ఒకటేమిటి ఎన్ని వినోదాలో! నెలలతరబడి చుట్టుప్రక్కల గ్రామాలంతా చెప్పుకున్నారు, ఆయన గొప్పతనం - ఎప్పుడూ ఆ యిల్లు జనంతో కిటకిటలాడుతూ ఉండేది.

ఆలోచిస్తూనే ఆ ఇంటి ముందుకి వచ్చేశాడు. ఆ యింటివైపు చూసేసరికి కృష్ణమూర్తికి గుండె ఆగిపోయినంత పనయింది.

ఇల్లంతా ఇప్పుడు పూర్తిగా పాడుపడిపోయింది. ఒకభాగం కూలిపోయింది - ఆ ఇంట్లో ఎవరూ లేరు.

కృష్ణమూర్తికి అడుగు ఇంకముందుకి పడలేదు. గుండెల్లో బరువుగా తోచింది.

తన మొహంలోకి విచిత్రంగాచూస్తూన్న కుర్రాణ్ని అడిగాడు. "ఈ ఇంట్లో ఎవరూ లేరా?" అని.

పదేళ్ళక్రిందటి పెద్దరాజుగారు పోయారట - ఆయనపోగానే, కొడుకులు ఇద్దరూ, అప్పులుపోగా మిగిలిన ఆస్తి పంచుకుని తగాదాలుపడి - చివరికి ఎవరివాటా వాళ్లుఅమ్ముకుని తలోదారినీ పోయారట. అప్పటినుంచీ ఆయిల్లు అలాగే ఉండిపోయింది.

కృష్ణమూర్తి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

తనుకూడా ఆ నాలుగు ఎకరాల పొలం తెగనమ్ముకునిపోతే.

'అనగా అనగా' అనే కథలోని ఒక ఆసామీగా మారిపోతాడు.

బరువుగా అడుగులువేస్తూ మామయ్యఇల్లు చేరుకున్నాడు.

చెప్పా పెట్టకుండా వచ్చిన అల్లుణ్ని చూసి రామయ్యకి ఆశ్చర్యం వేసింది.

"కబురు చేస్తే బండి పంపేవాణ్నికా" అన్నాడుమామయ్య - మామయ్యకీవయస్సు వచ్చేస్తోంది అనుకున్నాడు కృష్ణమూర్తి. లోపల పని చేసుకుంటూన్న రంగమ్మ అల్లుడు రావడం చూసి నీళ్లు పుచ్చుకుని బయటకు వచ్చింది.

"చోద్యం చూస్తూ అలా నిలబడడమే కాని, దాహం గ్రటా ఏమైనా కావాలో ఏమా అడగడం పెట్టండం ఏంలేదేం?"అని మొగుణ్ణి గదమాయించి, "ఇదేనేం రావడం" అని ప్రశ్న వేస్తూ నీళ్ళు అందించింది రంగమ్మ.

"తెలివిలేనివాడు. చెప్పినా తెలియదు - ఏమనుకోబోకు కిష్టయ్యాయ్!" అంది కాళ్లు కడుక్కుని మామయ్య పక్కనే కూర్చుంటూంటే. మామయ్య మాట్లాడకపోవడం కృష్ణమూర్తికి ఆశ్చర్యం కలిగించింది -

మునుపు మామయ్యఎదటపడడానికే రంగమ్మత్త దడిసేది. అటువంటిది - ఈ గదమాయింపుచూసి కృష్ణమూర్తి నోటంట మాట రాలేదు.

"అంతా కులాసాయేగా!" అన్నాడు మామయ్య ఏదో అడగాలని -

తనుకూడా సమాధానం అల్లాగే చప్పగా చెప్పాడు.

రంగమ్మ ఏదో మాట్లాడుతూనే ఉంది. ఆ మాటల్లో ఏం అర్థంలేదు. అడిగిందే అడుగుతో చెప్పిందే చెపుతూంటే, కృష్ణమూర్తికి ప్రాణం విసిగిపోయింది - జీవంలేని

ఇత్తా కానీ కబుర్లు అంటే ఒళ్ళుమంట - అందులో రంగమ్మ ఊర్మిళే వచ్చివాగు తూంటే భరించడం చాలా కష్టం అయి పోయింది కృష్ణమూర్తికి.

సుశీల కూడా ఇల్లాగే మాట్లాడుతుందా? అనుమానం గబుక్కున మసలింది మన స్సులో. సుశీల కనపడుతుందేమో నని ఇటూ అటూ చూశాడు. - కృష్ణమూర్తి రావడం

చూసిన సుశీల జాడైనా లేకుండా లోపల ఎక్కడో దాక్కుంది.

ఒక్కసారిగా అందరిమీదా కారణం తెలియకుండానే అసహ్యం కలిగింది కృష్ణ

ఎండమావులు

మూర్తికి - అప్పటివరకూ తను ఆలోచించుకున్నదంతా వ్యతిరేకంగా కనిపించింది. మహాకాన్న త్యాల నుంచి కక్కసారిగా జారి క్రింద పడ్డట్టయిపోయింది కృష్ణమూర్తికి.

రంగమ్మ లోపలి కెళ్ళిపోగానే ప్రాణం కొంత తెప్పరిల్లింది. నెమ్మదిగా ఒక సిగరెట్టు ముట్టించుకుని, మామతో చేను అమ్మకం విషయం ప్రస్తావించాడు.

"ప్రొద్దున్నే నలుగురునీ కదిపి చూద్దాంలే - తొందరేం?" అన్నాడు. మామయ్య.

భోజనాలదగ్గరకూడా సుశీల కనుపించనే లేదు - తను ఎటో చూస్తూఉంటే ఒక పక్కనుంచి ఎవరో తరుముకు వస్తూ ఉన్నట్లు పరుగెత్తిపోయింది.

రంగమ్మ భోజనాలదగ్గర ఊరికే మొహమాట పెడుతూంటే ఏం తినబుద్ధికాలేదు కృష్ణమూర్తికి.

చేతులు కడుక్కుని - నడవలో సిగరెట్టు కాలుస్తూ మడత మంచంమీద వాల్దాలు పరుచుకుని ఆలోచిస్తూ పడుకున్నాడు కృష్ణమూర్తి - రమణయ్య - రామిరెడ్డీ జ్ఞాపకానికి వచ్చారు.

మామ చుట్టకాల్చుకుంటూ పక్కనవచ్చి కూర్చున్నారు - మామని అడిగాడు వాళ్లు ఏంచేస్తున్నారని-

"రమణయ్య నీకు కనుపించలేదే?" అన్నాడు-

"ఎల్లాగ కనిపిస్తాడు - నే నిల్లా కదలలేదుగా?" అన్నాడు కృష్ణమూర్తి "సోడా షాపులో చూసేవస్తున్నా ననుకున్నాలే! కుర్రాడ్ని తీసుకువస్తే" అన్నాడు-మామ.

కృష్ణమూర్తికి ఆశ్చర్యం వేసింది - రమణయ్యకి సోడాషాపు గతి ఏంకాలింది? - వాడికి ఆస్తి బాగా ఉండేదే! అనుకున్నాడు.

"వట్టి పన్నాసిలే-ఉన్నదంతా ఆముండకెట్టి-దాంతో లేచిఉంటున్నాడు" అన్నాడు మామ-

అంత మంచి రమణయ్య ముండల్ని మరిగి-రౌడీలాగ తిరుగుతున్నాడుట! అందరికీ వాడిని చూస్తే ఇప్పుడు అసహ్యమే.

రామిరెడ్డి బాగా వనకవేశాడు. ఎంత సేపూ తనూ, తన పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగిరీ తప్పితే, పల్లెత్తు ఉపకారం ఎవరికీ చేసి ఎరగడు. ఆ తాసిల్దారునీ, రెవిన్యూ యిన్స్పెక్టరునీ కట్టుకు తిరుగుతూంటే వాళ్ళకి జడిసి రామిరెడ్డిని ఎవరూ ఏమీ అనలేక పోతున్నారుట.

రామిరెడ్డీ రమణయ్యా ఒకళ్లకొకళ్ళు ఎదురుపడ్డారంటే ప్రళయం ముంచుకొస్తుంది. వాళ్లిద్దరికీమధ్య తగువులాట తలలు బద్దలు కొట్టుకునే దాకా వెళ్ళింది.-

తను ఆదర్శప్రాయంగా ఇంతవరకూ ఎంచుకుంటున్న మిత్రులు యిద్దరికథా వినేసరికి కృష్ణమూర్తి మనస్సు చివుక్కుమంది. ఎంత ఉంటే మట్టుకు-ఈ పల్లెటూళ్ళవాళ్ల బుద్ధులే అంతలే, అనుకున్నాడు-రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు-మర్నాడు వ్యవహారం తేల్చుకుని వెళ్ళిపోవా లనుకున్నాడు.

పొద్దున్నే రంగమ్మ ఒక అడుగు పొడుగున్న గ్లాసునిండా కాఫీయిచ్చింది కృష్ణమూర్తికి. కాఫీ నోట్లో పోసుకునే సరికి వెగటుతోచింది - అందులో నీళ్ళూ పంచదారా తప్ప మరేంలేదు-ఇటూ అటూ చూసి మొక్కల్లోకి వంచేశాడు కాఫీ-దొడ్లోకి నీళ్ళుపోసుకునేందుకు వెళ్లేసరికి సుశీల అక్కడే ఉంది. చాలా పెద్దదయింది-

మొహంలో అందంకూడా ఉంది - కాని నాజూకు లేదు-కృష్ణమూర్తి పలకరిద్దాం అనుకుంటూ ఉండగానే లోపలికి పారి పోయింది.-

ఒట్టి పల్లెటూరిది-కాస్సేపు మాట్లాడితేనే మొగుడూ పెళ్లాం అయిపోతారు కాబోలు ఇంత సేలో!

మామయ్య జోడు తొడిగి కఱ్ఱ పుచ్చుకుని వీధిలోకి బయలుదేరాడు.

కృష్ణమూర్తికి ఏంతోచక ఏదో పేపరు తనకూడా తెచ్చుకున్నది చదివిందే మళ్ళీ చదివాడు.

చాలాసేపు అయినట్లు తోచి పేపరు క్రిందపడేసి టైము చూశాడు - ఇంకా తొమ్మిదికూడా కాలేదు-కాలంకూడా ఈ పల్లెటూళ్ళో అన్నిటితోపాటూ తనని ఏడి పిస్తోంది అనుకున్నాడు. వచ్చి వచ్చి తను ఈ పల్లెటూళ్ళో పడ్డాడేమిటి? అంతమంది పిల్లలు చదువుకున్న వాళ్ళు ఉంటే అసలు సుశీలను గురించి అనుకోవడం తనదే తప్పు-మాట్లాడడానికి కూడా జంకే ఆ పిల్లతో తను యింకేం కాపరం చెయ్యగలడు?

క్రమంగా కృష్ణమూర్తి ఒక కునుకు తీశాడు. మామయ్య తిరిగి వచ్చే సరికి పన్నెండు అయింది. మామయ్య వెంట వెంకన్న వచ్చాడు. వెంకన్న తన చిన్న తనంలో తనచేనూ, మామయ్య చేనూ కవులుకి చేస్తూఉండేవాడు - ఎప్పుడూ మామ వెంట చేతులు కట్టుకుతిరిగేవాడు.-ఇప్పుడు వెంకయ్య చేతినిండా ఉంగరాలున్నాయి. మామ పక్కనే కూర్చున్నాడు.-

మామ తను గ్రామానికి మునసబుననీ, అధికారిననీ మరిచిపోయినట్లున్నాడు. మామతో సమానంగా వెంకయ్య కూర్చోడం కష్టంగా తోచింది కృష్ణమూర్తికి. వెంకన్న యిప్పుడు బాగా సేరించాడు - మామ తన చేను వెంకయ్యకి బేరం చెప్పాడని తెలియగానే మరింతకోపం కలిగింది-

వెంకయ్యా. మామా ఒకళ్ల గొప్ప ఒకళ్లకి చెప్పుకుంటూ అలాగే కూర్చుండిపోయారు-వాళ్ళిద్దరికబుర్లూ వింటూంటే కృష్ణమూర్తికి అరికాలిమంట నెత్తికెక్కింది.-

రంగమ్మత్త సర్లిగానే అంది-తన చేను బేరం పెట్టడానికి వెంకయ్య తప్ప ఇంకెవ్వరూ దొరకలేదు - మామకి. అంత అసమర్థుడు మరొకడు లేడనిపించింది.

వెంకన్న వెళ్ళిపోగానే భోజనాలుచేసి కూర్చున్నారు. రంగమ్మ బలవంతాన సుశీల చేత తమలపాకులూ అవీ వసారాలో కూర్చున్న కృష్ణమూర్తి దగ్గరికి పంపింది. సుశీల ముళ్లమీద నడుస్తోన్నట్లు నడుస్తూ ఆకులూ వక్కా అక్కడ పెట్టేసి లోపలికి పారిపోయింది. రంగమ్మ నెమ్మదిగా బయటకివచ్చి అసలు విషయం కదిపింది.

"పిల్ల పెద్దదయిపోతూంది-ఎప్పటినుంచో అనుకుంటూన్న దేగా-నీయిష్టం చెబితే ఏదో ఆ మూడుముళ్ళూ పడేయించాలని" అని అందుకుంది.

రంగమ్మ రకరకాలుగా చెబుతో-మాటల మీద మాటలు దొర్లించేస్తోంది. కృష్ణమూర్తికి తలనొప్పి ఎక్కువయింది.-తలుపు వెనకాల క్రింద సందులోంచి సుశీల చీర కుచ్చెళ్ళు కనిపిస్తున్నాయి - తన ఉద్దేశం తెలుసుకోవాలని అంత కుతూహలంగా ఉంటే, తిన్నగా అడిగితే సుశీలకే చెప్పే వాడుగా!-

అంతలో రామిరెడ్డి రావడంతో ఆ మాటలు అక్కడికి నిలిచిపోయాయి. అప్పటికి తప్పించుకున్నందుకు ధన్యోస్మి అనుకున్నాడు.

"జ్ఞాపకం ఉందా? కిష్టయ్యా?" అన్నాడు రామిరెడ్డి కూర్చుంటూ. మామ అప్పుడు బయటకువచ్చి కూర్చున్నాడు. - అంతవరకూ ఎక్కడున్నాడో! రామిరెడ్డి తన ప్రెసిడెంటుగిరీ, ఎలక్షన్లు, రాజకీయాలూ అన్నీ ఒక్కసారిగా కుప్పేసి మాట్లాడేస్తున్నాడు-ఆ మాటల్లో ఎంతసేపూ తనని గురించి తప్ప మరేమీ లేదు.-

మామ మధ్య మధ్య అందుకుని తన గొప్పతనంకూడా జ్ఞాపకం చేస్తూ సంభాషణలో అడ్డుపడ్డాడు.-

కృష్ణమూర్తికి అక్కడనుంచి పారిపోవాలని బుద్ధిపుట్టింది.-మర్యాదగా ఉండదని ఊరుకున్నాడు-

మాట తప్పించాలని - తన చేనుకి బేరం కుదిర్చిపెట్టమని అడిగాడు రామిరెడ్డిని.

"అదెంతపని-ఇదిగో యీ ఎలక్షను అయిపోయీ, ప్రెసిడెంటుగిరీ ఖాయం అయితే-ఒక్క నిముషం" అన్నాడు రామిరెడ్డి చిటిక వేస్తూ.

"ఏడిసినట్లే ఉంది" అనుకున్నాడు-కృష్ణమూర్తి.

మామ ఏదో పనిఉందని బయటకు వెళ్లిపోయాడు.

"ఏం మీమామ ఏం ఏర్పాటుచెయ్యలేదూ?" అని అడిగాడు. రామిరెడ్డి మామ పోయిన దిక్కు చూస్తూ.

"ఆఁ! చేశాడులే వట్టి పెయ్యమ్మ" అన్నాడు కృష్ణమూర్తి కోపం ఆపుకోలేక.

సంభాషణ మామమీదకి తిరిగింది.-చాలా వేళాకోళం అయిపోయింది మామబ్రతుకు.

రామిరెడ్డి వెడతానని లేచాడు. లేస్తూ అడిగాడు.

"ఏం కిష్టయ్యా సుశీలని చేసుకుంటావంటగా? బూరిముక్కలు ఎప్పుడేం?" అన్నాడు.

"ఆఁ! చేసకోవలసిందే-ఏం చూసి-యీ పల్లెటూరి మొహాల్ని" అనేశాడు అప్రయత్నంగానే కృష్ణమూర్తి.

★ "ఎండమావులు" ★

రామిరెడ్డిని పంపేసి, లోపలి వసారా లోకి వచ్చేసరికి, గోడకి చేరబడి కూర్చుని సుశీల మొహం ఎఱ్ఱగా చేసుకుని ఏదో ఆలోచిస్తోంది.

ఆ ఆలోచనలో సుశీలకి అక్కడ్నుంచి పోవాలనే ధ్యాసకూడా కలగలేదు.

ఒకళ్ళనొకళ్ళని చూసుకుంటూ అల్లాగే ఉండిపోయారు. సుశీల అందంగానే ఉంటుంది, అనుకున్నాడు కృష్ణమూర్తి మళ్ళీ.

"జ్ఞాపకం ఉన్నానే?" అన్నాడు-

బావ పలకరించగానే లేచి నుంచుంది.

ఎగాదిగా బావ మొహంకేసి చూసింది. సమాధానం చెప్పక తప్పలేదు-

"జ్ఞాపకం లేకేం-చాలా పెద్దవాడివై పోయావు - అయినా నేం నీకు జ్ఞాపకం ఉండాలి గాని - పట్నటూరి వాళ్ళెంతే!" అంది. మొహం ఎఱ్ఱబడింది.

కృష్ణమూర్తి మనస్సు చివుక్కుమంది - గోడవతలనుంచి తనూ రెడ్డీ అనుకున్న మాటలన్నీ విన్నట్లుంది-

"ఎంతసేపటి నుంచి కూర్చున్నావేం?" అన్నాడు కృష్ణమూర్తి-

"ఎంతసేపట్నుంచి అయితే నేం? అయినా, చేసుకోవడం ఇష్టంలేకపోతే అడిగినప్పుడు చెప్పకుండా - వాళ్ళదగ్గరా వీళ్ళదగ్గరా నీ యిష్టం వచ్చినట్లు నాన్ననీ నన్నూ అంత వేళాకోళం చెయ్యడం ఎందుకు? నువ్వు గొప్పవాడివనా?" అంది కోపంగా, కళ్ళంట నీళ్ళు కుక్కుకుంటూ. "పరిస్థితులు కొంచెం మారే సరికి, వీళ్ళంతా గొప్పవాళ్ళు - ఒకప్పుడు నాన్ననిచూస్తేనే వీళ్ళందరికీ హడలు. నాకుమాత్రం ఆ సంగతి జ్ఞాపకం లేదేం" అంది సుశీల, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

నాన్నని అలాగ వేళాకోళం చెయ్యడం సుశీలకి ఆత్మాభిమానం దెబ్బతిన్నది - బావ తనని పెళ్ళిచేసుకోబోతాడని అంతవరకూ ఏమీ అనలేకపోయింది - ఇప్పుడు తనకేం భయం ఇంక? నాన్నని ఎవరు ఏమన్నా సుశీల సహించలేదు. అమ్మతో కూడా చాలాసార్లు దెబ్బలాడుతూ ఉంటుంది.-

కృష్ణమూర్తి మాట్లాడలేకపోయాడు.-

సుశీలకి ఇంత వివేకం ఉందా? తనే లేనిపోని ఊహల్లో పడి ఇంతకాలం కొట్టుకున్నాడు.

"చాలా మారిపోయావు సుశీలా!" అన్నాడు.

సుశీల మాట్లాడకుండా మెల్లిగా లోపలికి వెళ్ళిపోయింది.

సాయంత్రం మామతో అన్నాడు తను వెళ్ళిపోతున్నానని-"ఏం తొందర! యింకా చేను వ్యవహారం ఒకదారిన పడలేదుగా!" అన్నాడు మామ-

"నాకు ఇక్కడ ఏమీతోచదు-ఆ చేను ఏదో నువ్వేచూసి ఉత్తరం రాస్తే, రాతకోతలకి మళ్ళీవస్తానులే" అన్నాడు.

రంగమ్మ అడిగింది - "మరి ఏమాటా చెప్పావు కావు. పిల్ల పెద్దదయి కూర్చుంది. నీమీద ఆశపెట్టుకుని కూర్చున్నాం కదా!"

"మంచిరోజు చూసుకుని అమ్మకి రాయండి" అన్నాడు కృష్ణమూర్తి. ★

ఉత్తరాలు

[దూరదేశాన ఉన్న సారస్వత ప్రియ శాస్త్రికీ, క్రొత్తగా కాపురానికి వచ్చిన అతని భార్యకు యీ మధ్య నడచిన ఉత్తరాల సారసంగ్రహం ఇది]

ప్రియమైన మాలతీ!

నువ్వు నీ పుట్టింటికి వెళ్ళిన తర్వాత నాకు ఉత్తరం ముక్క వ్రాసి పడేస్తానన్నావు. కాని ఇంతవరకూ ఒక్క జాబైనా అందిందికాదు. మీ నాన్నతో కూడా చెప్పాను. ఆయనకూడా నిన్ను ఉత్తరాలు వ్రాయనిస్తానని నాకు హామీ ఇచ్చాడు. 'నీకు ఇంత సిగ్గు ఎందుకో నాకు అర్థమవడం లేదు.

నువ్వు చక్కగా చదువుకొని నా సాహిత్య కృషికి తోడ్పడతావని నా ఆశ, ఆశయం. మీ నాన్నకు సంస్కృతంలో ఎంతో పాండిత్యం ఉందని వినికిడి. ఆయన దగ్గర నువ్వు సంస్కృత విద్యాభ్యాసం చెయ్యాలని నా కోర్కె. వారికికూడా యీ విషయం వ్రాస్తున్నాను. మనిద్దరి జీవితాలు నందనవనంలోని చందన తరువుల నీడలలో విహారం సల్పాలంటే, నీకుకూడా మంచి అభిరుచి ఏర్పడాలి. అభిరుచి ఏర్పడ్డానికి మంచిచదువు పునాదిగా ఉండాలి. అంచేత నువ్వు త్వరలో సంస్కృతం ప్రారంభించు.

నీకు ఆది సభా పర్వాలుకూడా కొని యిచ్చాను. నువ్వేమయినా చదివావా? ఏమన్నా అర్థమయిందా? తెలియచేస్తావు కదూ? మరి ఉంటా నింక!

శాస్త్రి

* * *

శ్రీ వేదమూర్తులైన బ్రహ్మశ్రీ—గారికి మాలతి అనేక నమస్కారములు చేసి వ్రాయున దేమనగా;

ఇక్కడ అంతా క్షేమం. అక్కడ క్షేమ సమాచారములను తరచు తెలియచేయు చుండవలెను. త॥ మీరు వ్రాసిన ఉత్తరము అందినది. భారతములో కొంచెము చదివినాను. ఏమియు తెలియలేదు.' ముందు ముందు ఏమో తెలియదు. ఇంకా సంస్కృతము ప్రారంభించలేదు, మా తండ్రిగారు త్వరలో ప్రారంభించెదరు. ఇంతే సంగతులు.

చిత్తగించవలెను.

కొండ మొదలు మాలతి వ్రాలు.

* * *

మాలతీ!

నువ్వు వ్రాసిన ఉత్తరం అందింది. చాలా సంతోషంగా ఉంది. కవిత్వం వ్రాయడం ఎంతకష్టమో ఉత్తరాలు వ్రాయడంకూడా అంతే కష్టం. ప్రపంచంలో ఎంతోమంది గొప్ప కవులూ, కథకులూ ఉన్న మాట నిజం; ఉత్తరాలు వ్రాయడంలో మాత్రం గడు దేరిన పెద్దలు చాలా అరుదుగా కనబడతారు.

ఇంతకీ నేను చెప్పేది ఏమంటే, నీ ఉత్తరం నాకు చాలా బాధ కలిగించింది. నువ్వు వ్రాయదలచుకున్న విషయాన్ని కార్డుముక్క మీద వ్రాసినా సరిపోయేది. అనవసరంగా అణాన్నర దండుగపెట్టావు. 'శ్రీ వేదమూర్తులైన' వగైరా వగైరాలన్నీ మాని ఇకముందు కొంచెం నాగరీకంగా వ్రాయడం నేర్చుకుంటావని నమ్ముతున్నాను.

తెలుగులో 'సాక్షి,' 'వదరుబోతు,' 'గణపతి' ఇత్యాది గ్రంథాలన్నీ చదువుతే

“మధుపం”

బాగుంటుందని నా సలహా. నువ్వు ఏం చదువుతున్నావో కాస్త తెలియపరుస్తే సంతోషించనూ?

భారతం నీకు అర్థమవలేదన్నావు. బాధ లేదు; కాని కథలు సొంపుగా లేవూ? కష్టమైనమాటలకు మీ నాన్ననుగాని, మీ అన్ననుగాని అర్థమడిగి తెలుసుకో. కథ మీద దృష్టిపెట్టుకొని చదువుతే నీకు బాగా బోధపడుతుంది. అందులోని లోతుపాతులు నీకు స్వయంగా నేను చెపుతాను కదూ.

ఈతూరి జాబులో నువ్వు బాగా చదువుగా సంస్కృతాంధ్రభాషల లోతుపాతుల్ని తెలుసుకోవడానికి ప్రయత్నించే విద్యార్థినిలా జాబు వ్రాస్తావని ఆశించే.

శాస్త్రి.

* * *

భర్తగారికి నమస్కారములు

ఈ మధ్యనే నేను సంస్కృతం ప్రారంభించాను. మా నాన్నగారు రఘువంశములో నాలుగవ సర్గ ప్రారంభించారు. ఏడు శ్లోకములు అయినవి. భారతములో దుష్యంతమహారాజు చరిత్ర చదువుచున్నాను. ఇచ్ఛినీకుమారి అను నవలలో 112 పేజీలు చదివితిని. మానాన్న ఛందస్సుకూడా నేర్పుతానన్నాడు. ఈ మధ్య మా చిట్టి చెల్లెలు వంట్లో నలతగానుండెను. నిన్ననే పథ్యముపెట్టితిమి. ఇంతే సంగతులు.

చిత్తగించవలెను,

కొం॥ మొ॥ మాలతి.

* * *

కొండ మొదలు రాణీ!

నీ ఉత్తరం చిత్తగించాను; చాలా కించపడ్డాను. అసలు ఉత్తరాలు ఎందుకు వ్రాసుకుంటారో నీకు తెలుసునా? పోనీ, ఆలోచించావా?

నాముందు నువ్వు ఎంత భయపడుతూ, మాట్లాడుతావో, నీ ఉత్తరాలలో కూడా అంతే భయమూ లజ్జా కనపడుతున్నాయి. కాని నీ భాష ఇదివఱకుకంటె చాలా బాగుంది. అంచేత నువ్వు ఇకముందు మంచి ఉత్తరాలు వ్రాసే నేర్పరితనాన్ని అలవరచుకోవాలి.

మాటవరసకి, నువ్వు వ్రాసిన ఉత్తరమే ఉందా? దాన్ని యీ విధంగాకూడా వ్రాయవచ్చు:

“మీరు కోరినట్టు నేను సంస్కృతం చదవడం ప్రారంభించాను. రఘువంశం చతుర్థ సర్గలో 7 శ్లోకాలు అయాయి. కొన్ని శ్లోకాలు ముచ్చటగా ఉన్నాయి. (లేకపోతే అసహ్యంగా ఉన్నాయి - నీకు ఎలాతోస్తే అలా వ్రాయాలికాని, అబద్ధమాడరాదని మరా!) ఉదాహరణకు—(ఇక్కడ ఉదాహరణలు ఇవ్వాలి.)

భారతంలో దుష్యంతమహారాజు చరిత్ర చదువుతున్నాను. కథ చాలా బాగుంది. నాకు యీ ఘట్టంలో ఎన్ని పద్యాలువచ్చాయనుకున్నారు! మీకు అసలు అన్ని

వ్రాసే ఉత్తరాలలో కనబడవేమీ? బహుశా మీకు తెలుగు సరిగా రాదన్న అనుమానం కలుగుతోంది నాకు. నిజమేనా? చెప్పండి మరి! —మాలతి"

చూశావా మరి! నువ్వు వ్రాసిన ఉత్తరంలోనూ, ఇందులోనూ ఉన్న సంగతులించుమించుగా ఒక్కటే! కాని యీ ఉత్తరంలో నువ్వు అనుగడుక్కి పలుకరిస్తున్నట్టు కనబడుతుంది; కవ్వించి, నవ్విస్తున్నట్టు ఉంది.

అంచేత ఉత్తరాలలో ముఖ్యంగా చనువు కనబడాలి. ఖుషీగా మాట్లాడుతూన్నట్లు ఉండాలి; ప్రాణం లేచిరావాలి.

అయితే, ఇవన్నీ ఎలా వస్తాయి అంటావా? అదే ఉత్తరాలలోని గోసాయి చిటిక, వ్రాయి; చక్కటి ఉత్తరాలు వ్రాయి. నేను వ్రాసినట్టే వ్రాయాలన్న నియమంలేదు. ఎలా వ్రాసినా, నీ సిగ్గును కాస్త చిలుక్కొయ్యకు తగిలించి, చనువు తీసుకొని నీ ఉత్తరాలద్వారా మాట్లాడ గల్గితే, అది సజీవంగా ఉండితీరుతుంది.

ఏదీ, ఒక్కటి, అటువంటి ఉత్తరం వ్రాస్తావని నమ్ముతూ, నీ జాబుకోసం చేయిచాచే:

శాస్త్రి.

* * *

శాస్త్రిజీ!

అందుకోండి యీ జాబు. సిగ్గువిడచి నిష్కర్షగా వ్రాయమన్నారు గదూ! 'కొండ మొదలు రాణీ' అని ఏదో వెటకారంగా వ్రాశారు. అసలు అయింటి పేరు మీ మూలానే నాకు వచ్చిందని గుర్తించండి. అదీగాక మనకు యీ ఉత్తరాలేమిటి నా మొహం! ఎవరైనా విన్నా, నవ్విపోగలరు కూడా! ఆ భారతం, ఆ ఛందస్సు, ఆ కాళిదాసు, అవన్నీ చదవడం, నాకు సుతరాము ఇష్టంలేదు. నాకు ఇంతవఱకు వచ్చిన పద్యం ఒక్కటికూడా లేదంటేనమ్మండి. ఇహ, యీ చదువుకిస్వస్తి!

మీరేదో ఉత్తరాలు వ్రాయమంటే, ఏమనుకుని పోతారో అని వ్రాస్తున్నాను కాని, ఇహ ముందు ఉత్తరాలు వ్రాయకపోతే, మీరేమీ అనుకోకండేం! ఈ ఉత్తరాలూ, యీ గందరగోళం నేను భరించలేను. ఇంతకంటె ఏ సినిమాకో, గోయేకో చూడడం మంచిదిలా కనబడుతోంది.

భయమూ లజ్జా విడిచి మీరు వ్రాయమన్నందుకు ఎంతో కృతజ్ఞురాలిని

—మాలతి.

అన్నట్టు : మీ భారతం మీకు వెంటనే కావలిస్తే మా నాన్నకు ఉత్తరం వ్రాయండి. ఆయన తిరుగు టపాలో పంపే ఏర్పాటు చేస్తారు. ★



గగనవిహారి

చిత్రకారుడు : శ్రీ యన్. బలరామదాసు, బరంపురం.

పద్యాలు వచ్చునా అని? పద్యం చదవడంలో [illegible] వినా, నాకూ పోటీ పెడితే ఎవరు [illegible] చూడాలని ఉంది.

నేను కత్తెరలేగా కంఠస్థం చెయ్యగల్గుతున్నా [illegible], సీసాలు అంత త్వరగా [illegible]. ఎందుచేతనో? ఛందస్సులోని తేడా వల్లకాదు కదా!

ఛందస్సు అంటే జ్ఞాపకంవస్తోంది. ఛందస్సుకూడా నేర్చుకోబోతున్నాను. రెండు రోజుల్లో మీమీద పద్యాలు వ్రాసి పంపుతానేమో కూడా!

అన్నట్టు : నేను చదివే పుస్తకాలలో అరసున్నా లుంటాయేమండీ? మీరు

గోడమీద బొమ్మ

కాంతరావు (చిన్ననవల)

(గతసంచిక తరువాయి)

17

ఆ మరుచటిరోజు వుదయం మామూలుగా కిష్టయ్య రంగయ్యగారింటికి వచ్చాడు. భద్రం అప్పుడే షాపుకు వెళ్ళిపోతున్నాడు. మేడమీదకు వెళ్ళేసరికి రంగయ్యగారు మూలుగుతూనే మంచంమీద వున్నారు. దుప్పటి కప్పుకున్నప్పటికీ వణుకు హెచ్చుగానే వుంది. ఉండివుండి దగ్గుతూ కఫం కక్కుతున్నారు. నరసమ్మ దగ్గరనే నిలబడింది.

కిష్టయ్య చేతులు కట్టుకు నిల్చున్నాడు. ముసలాయన మూలుగుతూనే కిష్టయ్యను కూర్చోమని సైగచేసినా, నిన్నటికీ యీవేళకూ మనిషి తగ్గిపోవటం; బాధ హెచ్చుగా వుండటం గమనించి కిష్టయ్య అలాచూస్తూనే నిల్చుండిపోయాడు. ఇంతలో పార్వతి చెంబుతో వేడినీరు తీసుకొని వచ్చింది. కోడలును చూచి నెమ్మదిగా లేచి కూర్చున్నారు. బయటకు కిష్టయ్య సహాయంతో వచ్చి పళ్లుతోముకోడానికి ఎండలో కూర్చున్నారు.

"రాత్రి ఏమిచ్చారు?" ప్రశ్నించాడు కిష్టయ్య.

"వద్దంటే అన్నం తిన్నారు. రాత్రి మళ్ళీ వూపిరాడక బాధపడ్డారు. డాక్టరు అవసరం లేదంటారు" ఇంతతో. పార్వతి నిష్ఠూరమైన గొంతుక ఆపివేసింది. ఆమాటలు అనడానికి ఆమెపడ్డ బాధను గ్రహించిన మామగారు మెల్లగా నవ్వి "అన్నం మహాలక్ష్మి - చచ్చేవరకు దాన్ని ముట్టుకోనియ్యమ్మా!" కిష్టయ్య కలుగజేసికుని, "నా - నాలుగురోజు లాగండి బాబూ! న - నయమయ్యాక"

"ఇంకా బ్రతకమంటావా నాయనా! ఒకరిని కష్టపెట్టకుండా యీప్రాణం యిలా పోతే చాలు - అంత పుణ్యం చేసుకోవద్దూ?"

ఈమాటలు వినిపించకపోయినా నరసమ్మ కళ్లల్లో నీరు చిమ్ముతూనే వుంది. పార్వతికి మామగారిలా జీవితంపై విరక్తి జెందడానికి కారణం తెలుసు కాబట్టి దుఃఖం ఆపుకోలేక అక్కడనుంచి వెళిపోయింది.

రంగయ్యగారు కిష్టయ్యసహాయంతో గదిలోనికి వెళ్లిపోగానే నరసమ్మ స్నానానికి మేడదిగిపోయింది. కిష్టయ్య యెదురుగా చేతులు కట్టుకు నిల్చోవటం చూచి కూర్చోమని రంగయ్యగారు కుర్చీ చూపించారు. కిష్టయ్య కూర్చుంటూ, మెల్లగా గొణిగాడు, "ని-నిన్నను ఏదో అనేశాను! ఏ-ఏమీ అనుకోవద్దని చె-చెప్పమంది"

రంగయ్యగారు కొత్తవుబ్బిన కంటిరెప్పలను పైకెత్తుతూ "నీపెళ్లాం తప్పేమీ అనలేదు నాయనా!" అన్నారు.

కిష్టయ్య ఆనందంతో యింకోవిషయం కూడ చెప్పాడు. 'మీ-మీఒంట్లో న-నయమయ్యేవరకు నన్ను శెలవుపెట్టి మరీ ఇక్కడే పడుకోవలసిందని మా-మాసీతాలు చెప్పింది.' ముసలాయన యీ సహాయానికి కృతజ్ఞత కళ్లలో చూపిస్తూ నవ్వి అన్నారు. "అక్కర లేదు నాయనా! అవసరంవస్తే నేనే పిలుస్తానులే!"

నరసమ్మ స్నానం చేసి మేడమీదకు రాగానే, కిష్టయ్య ఆయనను అతిగా మాట్లాడించి ఆయాసపెట్టకూడదని శెలవు తీసికుని వెళిపోయాడు.

వరుసగా మూడు రాత్రులు అదేవిధంగా వూపిరాడక బాధ పడ్డారు. ఇచ్చిన మందు కూడ త్రాగలేదు. పార్వతి త్రాగితేగాని వీలులేదని ఒకరోజు పట్టుపడితే బలవంతాన నోటిలో వేసుకున్నారు. ఆ తరువాత చాల సేపటివరకు వాంతి వచ్చినట్లే బాధపడ్డారు. అన్నం ససేమిరా యివ్వనని జావ త్రాగమని కోడలు చొరవ చేసుకుని దగ్గరకూర్చుంది. నాలుగోరోజురాత్రి కొద్దిగా బాధపడ్డా అంతగా వూపిరాడక బాధ పడలేదు. పగలంతా యెవరో వొకరువచ్చి చూచిపోతూ ఏవేవో సలహాలు చెప్తున్నారు. చిన్నాపెద్దా చెప్పే యీ సలహాలకు మనసులో విసుగుచెందినా పైకి మాత్రం తల ఆడిస్తున్నారు.

తనకు జబ్బు ప్రవేశించిన ఐదోరోజు వుదయం యింట్లోఅంతా గాబరా పడుతున్నారు. తను మంచంమీదనుంచి సరిగ్గా లేవలేకపోతున్నా రంగయ్యగారు యీరోజు మిగతావారుపడే ఆరాటం పడలేదు. ఎవరు చెప్పినా వినకుండా ఆరోజు మధ్యాహ్నం భద్రం బొంబాయి ప్రయాణం కట్టాడు. పార్వతి భర్తను యీలాంటి సమయంలో ప్రయాణం ఆపుచేయమని, పోరుపెట్టి మరీ చెప్పింది. నోరుముయ్ అంటూ చెయ్యి విసిరాడు. మళ్లీ ఆలోచించండని కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది. "నన్ను ఆలోచించమని యెప్పుడూ చెప్పకు. ప్రయాణం ముందు యేడుస్తావేం? ఇంతవేగం చచ్చిపోడుగా - వచ్చేవిపండగరోజులు. కొట్టంతా ఖాళీగావుంటే!" అంటూ చరచర నడిచాడు. పార్వతి మరి కాదనలేక భర్తను గుమ్మం వరకూ సాగనంపింది.

భద్రం బొంబాయి వెళ్లిన రెండవరోజున వెంకట్రావుద్వారా తెలుసుకున్నాక సుందరమ్మ తీరుబడి చేసుకుని రంగయ్యగారిని చూడడానికి వచ్చింది. అల్లుడిని రైతులవద్ద అప్పుచెప్పి వచ్చాక ఆరు రోజులవరకూ రంగయ్యగారివద్దకు తను అనుకున్న విషయం అడుగుదామని వద్దామనుకున్నా రాలేకపోయింది. చలికాలంలో రెండవదశలో వున్న బోదకాళ్ళు ఆమెను సాధారణంగా గుమ్మం కదలనివ్వవు. దానికితోడు జ్వరం. ఈ రోజు ఎలానో కష్టపడి సాయంత్రం వేళవస్తే ఎవరైనా వుంటారని వుదయం తొమ్మిది గంటలకు వచ్చింది. కూతురుని తీసికొని వెళ్లిపోయాక యీ యింటికి రావటం యిదే ప్రథమం. పార్వతికి ఇష్టం లేకపోయినా పలుకరించింది. నరసమ్మ సుందరమ్మను గౌరవంగా స్వీకరించి మేడమీదకు తీసికొనివెళ్ళింది. ఆమెదగ్గరకు వెళ్లటానికి మనస్కరించక వంట పూర్తయినా పార్వతి దిగువగదిలోనే వుండిపోయింది.

సుందరమ్మను చూడగానే రంగయ్యగారు లేచి పరుపుమీద కూర్చుని, "ఏం

పోస్టాఫీసులో స్టాంపులు అమ్మే చోటక్యూలో నాముందు నిలబడి వున్నాయనకు స్టాంపులు అమ్మే వాడితో ఏదో పేచీ వచ్చినట్టుంది. వాళ్ల సంభాషణ శ్రద్ధగా విన్నాను.

"అది కాదయ్యా! రెండు రెండణాల స్టాంపులు యిమ్మంటే..." రుసరుసలాడుతున్నాడు నాముందు నిల్చున్న వ్యక్తి.

"నాల్గణాల బిళ్ల ఒక్కటే యిస్తే ఏం?" స్టాంపు మెండరు అడిగిన ప్రశ్న.

"రెండు వుత్తరాలు పోస్టు చెయ్యాలయ్యా!"

"పోనీ- పదహారు కానీ స్టాంపులు తీసుకోరాదూ- ఒకటి కాదు; రెండు కాదు — ప-ద-హా-రు-స్టాంపులు!"

"ఏం? నీ దగ్గర రెండు అణాల స్టాంపులు లేవా ఏం?"

"ఆహాఁ! పోనీ- నీ వుత్తరాలు ఎయిర్ మెయిల్లో వెయ్యరాదు-? ఇంకా చప్పున చేరిపోతాయి కూడాను!"

"ఏమిటయ్యా నీధోరణి.? నీముష్టి స్టాంపులు నీదగ్గరే అట్టే పెట్టుకో. ఇంకో పోస్టాఫీసుకుపోయి నాకు కావలసిన స్టాంపులు ఏదో నే కొనుక్కోగలను." అంటూ విదిలించుకు పోయాడు ఆ వ్యక్తి.

నాకేమీ అర్థం కాలేదు. స్టాంపులు అమ్మే ఆవ్యక్తికేసి చూశాను. అతను పగలబడి నవ్వుతూ ఆవ్యక్తిని చూడండి. ఆయనకి మన పెద్ద బజారులో ఫ్యాన్సీ షాపు వుంది. రేజర్ బ్లేడ్ కావలసివచ్చి ఆయన కొట్టుకి పోయినా, అది వుందో లేదో ముందు తేల్చి చెప్పకుండా మిగిలిన సమస్త వస్తువులను మనకు అంటగట్టాలని చూస్తాడు. చూడండి ఎలావుంటుందో న్యాయం"!

★ గోడమీద బొమ్మ ★

సుందరమ్మా! అంతా బాగున్నారు కదా!" అన్నారు.

ఈ ప్రశ్నకు ఆయనవైపు ఆపాదమస్తకం చూస్తుండటంవలన వెంటనే జవాబివ్వలేక పోయింది. జబాబిచ్చేముందు రంగయ్యగారి జబ్బువిషయం ప్రస్తావన తెచ్చి కొద్దిగా కలకల్లాడింది. సుందరమ్మ చెవిటిదానికి వినిపించదని మామూలు స్వరంతోనే తలదించుకుని, "మా బాగు కేమండీ అదే బాగు!" అన్నది. నరసమ్మ అమాయకంగా చూస్తోంది.

"నీకేమే! రత్నంలాటికూతురు, నిక్షేపంలాంటి అల్లుడు యింట్లో వున్నప్పుడు! ఎంతహాయిగా వుండవచ్చు!"

రంగయ్యగారు యీ మాటలని నోటిలో చుట్టపెట్టారు. నరసమ్మ అగ్గిపుల్ల వెలిగించింది. చుట్ట కాలుస్తూండగా సుందరమ్మ అతి వినయాన్ని ప్రదర్శిస్తూ, "మీకు తెలియని రోజులా యివి? నలుగురూ ఇంత అంత అంటారు కాని వారు గడించిన దేమాత్రం? ఇంకా ఆ పిల్లల ఇద్దరికి చదువులు, పెళ్ళిళ్ళు వున్నాయి."

"వచ్చినవాళ్లను దూషించకు. వాడు నీకేమీ లోటుచెయ్యలేదు!"

"మీలాంటి పెద్దలు అలా అంటే మరి నేనేమంటాను?" నలుగురూ అంటారు.

కొంగాడి లక్ష్యం లేకుండా ఆడముండను బ్రతుకుతున్నానని—కష్టాలు మ్రింగబట్టే ఎవరైనా అంటారు."

"ఉన్నమాటంటున్నాను - కోరితెచ్చుకోవాలి కాని నీకెందుకే కష్టాలు? రత్నాలవంటి పిల్లలతో హాయిగా వుండక. అల్లుడేమైనా యెదురాడుతున్నాడా?"

సుందరమ్మ మౌనం దాల్చటంతో రంగయ్యగారన్నారు. "నువ్వు చెప్పినా నే నమ్మను. వాడు పెద్దవాళ్లకి యెదురాడే మనిషికాడు. యోగ్యుడు. నీ అదృష్టంకొద్దీ అలాంటి అల్లుడు దొరికాడు."

"కాదని ఎవరన్నారండీ!" సుందరమ్మ యీ మాటలతో కలుగజేసికుని, "ఈ రోజుల్లో గుణం చూసేవా రెవరులెండి."

రంగయ్యగారు నవ్వి, "గుణం వుంటే ధనం దానంతటదే వస్తుందే!" అన్నారు. ఇంకేదో అనబోతూంటే సుందరమ్మ ధటాలున, "ఒక రివ్వకపోతే ధనం ఎలా వస్తుంది బాబూ! మీరు ధర్మమెరిగినవారు కాబట్టి అన్నట్టుగా యిస్తారు, మరెవరిస్తారు?"

ఈ మాటల్లోని అంతరార్థం గ్రహించిన రంగయ్యగారు కొద్ది క్షణాలు మాట్లాడలేదు. నిస్త్రాణవల్ల పరుపుమీద జారబడ్డారు సుందరమ్మ తలదించుకునే కూర్చుంది. కొద్ది నిమిషాలు గడిచాక ముసలాయన ఆమె వైపు చూడకుండా, "సుందరమ్మా! ఏమున్నా మనసులో పెట్టుకోకే! పెళ్ళిముందు అన్నట్టుగా ఆస్తి అడగటానికి వచ్చావా యిప్పుడు?"

సుందరమ్మ మాట్లాడలేదు. ఔనన్న సూచనను మాత్రం కొద్దిగా ముఖంలో చూపించింది. రంగయ్యగారు బహు తేలిగ్గా అన్నారు. "నా తదనంతరం అని ఆ వేళ చెప్పాను కదూ! జ్ఞాపకం తెచ్చుకో!"

సుందరమ్మ మనస్సులోవున్న కోర్కెను బయటపెట్టకుండా వుండలేక పోయింది. "మీరు తప్పించి మా అల్లుని మంచికోరేవారెవరున్నారు? మా అల్లుడు సుఖపడాలని నాకున్నట్లు మీకుమాత్రం లేదా? మీరు దయతలిస్తే వాళ్ళిద్దరూ సుఖంగా వుంటారని - మా అల్లుడు మీ ఎదురుగా నిల్చుని అడగటానికి సిగ్గుపడతాడని యిన్నాళ్ళు పెంచారు మీకు తెలీదా?"

ఈ చివరమాటలతో రంగయ్యగారు, "సుందరమ్మా! ఈ ముసలివాడిని యేవిషయంలోను మభ్యపరచే అవసరం యెవరికీ వుండదనుకుంటాను. నాకు తోచినట్లుచేస్తే ఎవరు అడ్డుచెప్పినా చెల్లదు. నీ అల్లుడేవచ్చి నా యెదురుగా నిల్చుని అడిగితే యీ నిమిషంలోనే సగం ఆస్తి యిచ్చేస్తాను."

సుందరమ్మ మిటుకు మిటుకుమని ముసలాయనవైపు చూసింది. ఆయన పాలిపోయిన ముఖంలో నిశ్చలత కనిపించింది. ఒక

విధంగా యీ మాటలతో ఆయన ఆమెను పరిహసిస్తున్నట్లు శంకించింది. ఎంతసేపు కూర్చున్నా ఏ ఆలోచనా పాలుపోలేదు. ముసలాయన మాట్లాడడానికి శక్తి లేక కౌమోసు మానాన్ని దాల్చారు. మళ్ళీ దగ్గు కఫంతో చుట్టుకుపోయారు.

సుందరమ్మ లేచి నిల్చుంది. "వస్తానండీ" అంది. రంగయ్యగారు, "మంచిది. శుభం" అన్నారు. సుందరమ్మ ముఖం ముడుచుకునే ప్రక్కయింటికి వెళ్ళింది.

ఆవేళ సాయంత్రం వెంకట్రావు ఆఫీసు నుండి రాగానే సుందరమ్మ యింటికి వెళ్లాడు. సుందరమ్మ యెదురై లోపలకు తీసికొనివెళ్లి ఫలహారం, కాఫీ యిస్తే వెంకట్రావు అభ్యంతరం చెప్పినా, బలవంతం క్రిందరాగా కడుపునిండా మెక్కించాడు.

"నన్నంత అర్జంటుగా రమ్మనటానికి కారణం?"

సుందరమ్మ ముఖంలో యీ ఇనస్పెక్టరు వేషంలోవున్న వెంకట్రావు మీద ఎక్కడలేని భక్తి తాండవించింది.

"ఆపదుండను. నాకు మరే దిక్కూ లేదు. మీమీదనే భారమంతా వేశాను."

"అబ్బెబ్బె అలా గనకండీ! మీ సంగతి చూస్తున్నాగా! చదువైనా వుండాలి లేక గొప్ప కుటుంబంలోనైనా పుట్టాలి అంటారు. సంస్కారం లేని బృందం ఆ భద్రానికి దొరికినట్లుగా మీ అల్లుడికి దొరక లేదు. అది వాడి అదృష్టం!"

"ఏం అదృష్టం బాబూ! పెద్దమనుష్యులే గోతులు త్రవ్వుతూంటే! ఆపదుండను. ఆయ నివ్వనంటే నేను యే కోర్టు కెక్కతాను చెప్పండి? అప్పుడే రాతకోతలు చెయ్యించి వుంటే యేచిక్కూ లేకపోయేది. పెద్దమనిషని నమ్మాను. ఎంత బెట్టుసరిగా మాట్లాడాడు." ఆతృతగా అలసటతో సుందరమ్మ అంటున్న యీ మాటలకు వెంకట్రావు—


"అసలు సంగతి ఏంటో చెప్పండి!" అన్నాడు.

"మీతో చెప్పకేముండీ! అల్లుడా అలా ఎదురుతిరిగాడు. ఇక మీరు తప్పించి నాకు దిక్కెవ్వరూ లేరు. నీటముంచినా పాలముంచినా......"

వెంకట్రావు వెంటనే కుంప బ్రద్దలుకొట్టి నట్లుగా, "నాసంగతి మీకు బాగా తెలుసు. నేనేం చెప్పకున్నా స్వంతశబ్బాలా గుంటుంది."

"మీలాంటి నిజానికి కట్టుబడేవాళ్ళు కార్యవాదులు వుంటే యీలోకం ఏనాడో బాగుపడేది."

వెంకట్రావు తలపంకించి, "నాగురించి యీలా చాలమంది అనుకోవడం విన్నాను లెండి. నాకు యీలాంటివి అసలు రుచిం



'మైమరపు'

ఫోటో: శ్రీ ఆర్. పి. రంగారావు—సికింద్రాబాదు.

★ గోడమీద బొమ్మ ★

చవు. పోర్బరుల్లో నేను చేసిన వుపకారాలకి ఎంతోమంది ఏవేవో తెచ్చి యివ్వబోతూంటారు. వద్దంటే వింటారండీ? ఒకడు నేను లేనప్పుడు నూరురూపాయిలు ఖరీదు గల సిల్కుచీర యింట్లో యిచ్చి మరీ వెళ్లాడు. అసలు పుచ్చుకోకపోయినా మరీ కష్టమే. మా కింత మేలుచేసి మరీ మీరు ఏం పుచ్చుకోకపోతే మీ దగ్గరకు మళ్లీ రామోఁగావస్తాం అంటారు! అదిగాక ఇంకొకడు రాస్తే వాళ్లకు నచ్చదు కూడాను. ఆ ఇంగ్లీషు భాష ఒక అబ్బకీ ఒక అమ్మకీ పుట్టలేదండి! ఒక్క మాటలోనే నాలుగు అర్థాలుంటాయి అన్నీ చూసుకోవాలి మరి!"

"నిజమేనండీ!" కొంచం ఆగి "ఆ ముసలాయన కొడుకులా పెంచాడుకదా సగం ఆస్తి రాదంటారా? మీరా రంగయ్యగారితో చెప్ప—"

వెంకట్రావు సగర్వస్వరూపం చప్పున శాంతించింది. "గొప్ప చిక్కు తెచ్చి పెట్టారే! అసలు ఎదుటివాళ్ళ ఆస్తిపాస్తుల చిక్కుల్లో కలుగజేసుకోనండీ!"

"మీరలా అంటే ఎలా? ఆయన ఇస్తామన్నదే యిచ్చేటట్లు చేస్తే!"

"ఇస్తామన్నారా? ఎప్పుడు? వాళ్ల ఇంటి విషయాలన్ని తెలుసును కాని ఈ విషయం నేనెప్పుడూ వినలేదండి?"

"క్షమించండి. ఇదివరకు మీతో చెప్పలేదు. ఆయనే నీకూ నాకూ తప్పించి యింకెవరికీ యీవిషయం తెలియకూడదన్నారు. లేకపోతే నేను పిల్లనిస్తానండీ? పెద్దమనిషిపరువు మర్యాదలను నిలబెట్టడాని కింతకాలం వూరుకున్నాను."

నిపుణుల సలహాలు అన్న శీర్షిక క్రింద ఒక పత్రికలో పడిన ఒక విశేషం.

"ఏదైనా విషయం మరచిపోకుండా వుంచుకో వాలంటే మీ చేతి చిటికెన వేలికి సన్నని దారం చుట్టబెట్టి వుంచుకోండి.

"మరేదైనా విషయం మరచిపోవా లనుకొంటే పెద్ద రకం మోకు ఒకటి చూపి మెడకు బిగించుకోండి."

"అయితే నుఠేం చిక్కులేదు. మీరు నిశ్చింతగా వుండొచ్చు" అని వెంకట్రావు కొస్త ధీమాతో అన్నాడు.

"నాకేదో భయంగా వుందండి. కొన్లూ

నువ్వులునానని నోళ్ళు

"ఇంకొకళ్ల కెవ్వరికీ చెప్ప వద్దని నీకు నేను చెప్పిన విష యం, నువ్వు ఆవిడతో చెప్పా వని ఆవిడ నాతో చెప్పింది" అంటూ ఒక యిల్లాలు మరొక యిల్లాలితో ఫిర్యాదు చేసింది.

"అరె! అదేమిటే! నేను చెప్పానని నీతో చెప్పొద్దని ఆవిడతో నేను చెప్పానే!"

"అది సరే కానీ, నాకా విడ చెప్పిందని నీతో నేను చెప్పానని ఆవిడతో మాత్రం చెప్పకేం!"

* * *

జీవితంలో నానా యాత నలు పడి ముప్ఫైయ్యేళ్లు కష్ట పడి గ్రంధ రచనలు చేసి, చివరి కెప్పటికో ముసలి తనంలో కాస్త పేరు ప్రఖ్యా తులు ఆర్జించిన ఒకానొక వ్యక్తి వద్దకు, ఒకరోజున, అతి నాజూకైన ఆగర్భ శ్రీమంతు రాలు ఒకామెవచ్చి, తాను కూడా పుస్తకాలు వ్రాయా లని ఏనాటి నుంచో కలలు కంటున్నానని చెప్పి, వ్రాయటం ఎలాగో కాస్త చెప్పి పుణ్యం కట్టుకోమని బ్రతిమాలింది.

ఆయన క్షణమాలోచించి, తారక మంత్రం వుపదేశిస్తు న్నంత గంభీరంగా మొఖం పెట్టేసి దానికేముందండీ పేజీ మీద ఎడమవైపు నుంచీ కుడి వైపుకి రాసేయండి" అన్నాడు.

చేతులూ ముఖం బాగా పొంగి వున్నాయి. ఆ పొంగు గుండెవరకూ వచ్చిందంటే ప్రక్కవాళ్లకు తెలియకుండా కళ్ళు మూసే స్తారు. ఇప్పటివరకూ ఏమీ చెయ్యనిది యింకేంచేస్తారు? వానరాకట ప్రాణంపోకట తెలియదంటారు -"

ఆందోళన వ్యక్తంచేస్తూ చేతులు నులుపు కుంటూన్న సుందరమ్మను చూచి వెంకట్రావు తల మీద కెత్తి, "1938 వ సంవత్సరంలో జస్టిస్ వెంకటసుబ్బారావని భార్యా సమే తంగా హార్బరు చూడడానికి వచ్చాడు. మా చండశాసనుడు లెండి. వాడి భార్య ఇంగ్లీషులో ఘటికురాలు. అంత తియ్యగా ఆ సంకరభాషను మాట్లాడేవాళ్ళని ఇంకెవ రినీ చూడలేదు. మాదొర కార్యక్రమమంతా నామీదవేశాడు. నేనే సరియైనట్లు వాళ్లకు అన్నీ చూపించి చెప్పకపోతే మా దొరకి గ్రాండ్ గా కమ్చీ దెబ్బలు తగిలేవి. ఇప్పటికీ హార్బరులో చాలమంది అంటారు, వెంక ట్రావుమీద ఏభారంవేసినా నిశ్చింతగా వుండొచ్చునని. సరే! - మీరుకూడ నామీద భారం వేశారుకదా! సగం ఆస్తి మీ అల్లుడి పేర వ్రాయించే పూచీ నాది"

సుందరమ్మ ఎంతో కాళ్లావేళ్లాపడినట్లుగా మాట్లాడింది. జన్మజన్మాలకు తను చేసిన మేలు మరచిపోలేనని, తనపాదాలకు చెప్పు గా వుంటానని మరీమరీ విన్నవించుకుంది.

వెంకట్రావు ఆరోజు రాత్రినే ముస లాయనను కలుసుకున్నాడు. కొస్త ఆయన స్థితినిగురించి విచారాన్ని వెళ్ళబుస్తూ ఆడాక్ట రునుఅక్కరలేదన్నందుకు తనమనస్సు ఎప్పు డూ ఇంకెవరివిషయంలోనూ కించిత్తయినా ఆందోళన చెందలేదని చెప్తూ సందర్భాను సారంగా చివరకు రామం పరిస్థితి అక్క డేమీ బాగులేదని అన్నాడు.

"వాడికేంలోటు నాయనా! లోటున్నా వాడు సర్దుకుపోతాడులే. అంత శాంతుడ్ని యేపరిస్థితిలోనూ విడిచిపెట్టేటంత తెలివి తక్కువది కాదు ఆ సుందరమ్మ" అని హీన స్వరంతో అన్నారు రంగయ్యగారు.

"కానీ ఒక్క విషయం మనం ఆలో చించాలి. డబ్బంటే ఆపేక్షవున్న వాళ్లదగ్గర బ్రతికటం కష్టంగా. మీరు మాత్రం ఆడిన మాట కాదంటారా? కాని ఎవరిభయం వారి కుంటుంది."

ముసలాయన యీమాటలతో పరువుమీద చారబడే కళ్లు నిలబెట్టేరు. సుందరమ్మ గుట్టు బయటపెట్టిందని, యీయనని అడగటానికి పంపించింది ఆవిడేనని యిట్టే పోల్చేశారు. వెంకట్రావు యింకా లోకం పోకడమీద లెక్చరు కొట్టూంటే అంతా విని చివరకు అన్నారు.

"ఇంత చెప్పించుకుంటానని ఎన్నడూ అనుకోలేదు. సరలే! నే చచ్చిపోయాక కూడా నాపేరు తల్చుకుని యీసురోమని ఏడ్చేవాళ్లుండాలా ? నాకు న్యాయమని తోచినదానిని చేశాను నాయనా!"

ఆయన అబద్ధంచెప్పాలనిపొరబాటునైనా వూహించలేదు. ఈ చివరమాటల్లోని అంత రార్థం గ్రహించిన వెంకట్రావు మరేం మాట్లాడకుండా వెళిపోయాడు. ఆమరునాడు రిజిష్ట్రారు ఆఫీసునకువెళ్ళి తన స్నేహితుడు గుమస్తాను కలుసుకున్నాడు. వెంటనే సుంద రమ్మయింటకి వెళ్ళాడు.

ఆరోజు సుందరమ్మ చాల వుత్సాహంగా వుంది.

(ఇంకా వుంది.)

★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



101. నగ్నీకరణము

గాలికీ, ఎండకీ, వానకీ ఇళ్లూ, భవనాలూ దెబ్బతిని బెల్లు రాలిపోడమూ, బీటలు వెయ్యడమూ జరుగుతుందని మనకందరికీ తెలుసును. కాని నేలకూడా దెబ్బ తింటుందని చెప్తే చాలామందికి వింతగా ఉండవచ్చును. నేలా, కొండలూ గుట్టలూ పై మూడింటివల్లనే కాక నదులూ, నదాలవల్లా, మంచు ప్రవాహాలవల్లా, సముద్రమువల్లా, చెట్లవల్లా, మనుష్యులవల్లా దెబ్బతిని అరిగిపోయి నగ్నముగా వున్నవి మరీ నగ్నముగా తయారౌతాయి. ఈ అరుగుదలని భూగోళశాస్త్రజ్ఞులు "నగ్నీకరణము" అంటారు.

ఫ్రెంచి ఇండోచైనాలోని బౌద్ధ దేవాలయము ఒకటి పెద్దచెట్టుయొక్క బలిష్ఠమైన వేళ్ళ ఒత్తిడికి నొక్కుకుపోయి ఇటుకలు ఇటుకలుగా విరిగిపోతోంది. రావి మొక్కలు గోడల్లో బయల్దేరి బద్దలు చేస్తాయని అందరికీ తెలుసును. ఇంగ్లండులో తీగలు పాకించిన ఇళ్లు ఇలాగే కూలిపోతూంటాయి. ఇవన్నీ చెట్లద్వారా జరిగే వినాశాలు. కుందేళ్ళు, నక్కలూ నేలలో బొరియలు చేసి గుట్టల్ని మిట్టల్ని గుల్ల బారించి కూల్చేస్తాయి. మానవుడు వ్యవసాయము కోసము అడవులు కొట్టి, గడ్డి తవ్వి పారేసి, నేలను నగ్నము చేసి, భూతాలు చేయగల నగ్నీకరణానికి దారి చేస్తాడు. ఈ రకపు నగ్నీకరణము ఊహించలేనంత జరిగింది.

నదులు లొయ్యనీ, గట్లనీ కోరేసి కడిగేస్తాయి. కొలరెడో నది బ్రహ్మాండమైన లోయల్ని కోసింది పర్వత భూమిలో. గోదావరి తూర్పుకనుమల్లో ఎనిమిదిమైళ్ల పొడవుగల గండి కోసింది; రాజమహేంద్రవరానికీ ధవళేశ్వరానికీ మధ్య గట్టు వెంబడిని నూరెకరాలకి మించిన పంటలంకని కోరేసి మింగేసింది. పెద్దపెద్దరాళ్లు నదీ ప్రవాహంలో దొర్లిపోతూ అరిగిపోతాయి, బొమ్మరాళ్లమాట చెప్పేదేమిటి? ఈ రాళ్ల దొర్లుడురాపిడికి నదీలొయ్య కూడా లోతౌతుంది. గట్లు ఎత్తైపోతాయీ, అందువల్ల విరిగి నదిలో పడిపోతాయి. నది వరదలలో వున్నప్పుడు నీటిశక్తి దాని వేగపు వర్గాన్ని బట్టి ఉండడమువల్ల మైలు వేగంతో పారే నదికంటె నాలుగుమైళ్ళ వేగంతో పారే సెలయేరు మొదటిదానికంటె పదహారురెట్లు బలంతో కోరేస్తుంది. బరువువల్ల నదిలో నిల్చిపోయిన రాళ్ళని కవ్వములాగ తిప్పుతుంది నీరు. అందువల్ల లోతైన గోతులు ఏర్పడతాయి. ఇక జలధారలు పెట్టే గోతులు మాట చెప్పేదేమిటి! కొండకనుమల్లోనుంచి దాటుకు వచ్చే నీరు ఇటూ అటూ తిరుగుకుంటూ నలికెండ్లపాము లాగ వంగుతుంది. నీటి తాకిడికి కొండ మొదలు కోరుకుపోతుంది. ఒడ్డుకి పైనున్న రాతికప్పులు విరిగి నదిలో పడి దొర్లుకుపోతాయి. లోయక్రమంగా వెడల్పౌతుంది.

ఎత్తైన కొండలమీద—హిమాలయాలలో అందాము—వర్షానికి బదులు మంచు ముద్దలు కురుస్తాయి. అక్కడి ఎండ తీక్ష్ణత ఈమంచుని కరిగించడానికి చాలదు. పైనించి చూస్తే ముగ్గు కుప్పల్లాగ కనబడే ఈమంచు పెరగ్గా పెరగ్గా అడుగు పొరలు తమమీది ఒత్తిడి ఎక్కువై పోవడం వల్ల కరుగుతాయి. పైనున్న మంచుకట్టలు మెల్లిగా ఈ నీటిమీద జరుగుతాయి ఇవే మంచునదులు. ఇవి ఘనపదార్థమువల్ల ఏర్పడినవే కనక నీరులాగ ఇటూ అటూ ఊగకుండా ముక్కుసూటిగా 'ప్రవహిస్తాయి.' కనక మంచునగులవల్ల ఏర్పడే లోయలు నిటారుగా వుంటాయి. కొండలమీదనించి దొర్లిపడ్డ రాళ్లు ఈ మంచునదిలో దిగ దిగి అతుక్కు చేరి పళ్ళలాగ పనిచేసి—పేద్ద ఆకురాయిలాగ—మంచునది లొయ్యని కోస్తూ ముందుకి సాగిపోతుంది. సముద్రపు కెరటాల తాకిడికి ఒడ్డూ, పాటుపోటులవల్ల ఉప్పుటేళ్ళగట్లూ అరిగి తరిగిపోతాయి. ఇక పర్వతాలు ఒడ్డునవుంటే వాటినుంచి దొర్లిపడే రాళ్లు కెరటాలతో తిరిగివచ్చి తగిలిచెయ్యగల వినాశానికి అడ్డే లేదు. ఇలాంటి నగ్నీకరణమువల్లనే సముద్రతీరపు కొండలు సముద్రమువేపు లంబముగా వుంటాయి.

గాలి నేలమీదవున్న మట్టీ ఇసకావంటి తేలిక పదార్థాలని ఎత్తుకుపోయి నేలని నగ్నీకరిస్తుంది; వర్షపు నీరు కూడా దీనికి సాయము చేస్తుంది. ఎడారి భూముల్లో గాలి రేపే ఇసుక తుఫానుల అల్లరి ఇంతా అంతా కాదు. 'డ్యూను'లనే ఇసుక దిబ్బలు ఒకచోట క్రమంగా తరిగిపోయి ఇంకోచోట నిలుస్తూంటాయి. నిత్యమూ దొర్లుతూ ఉండడమువల్ల ఇసక కూడా అంచులు అరిగిపోయి గుండ్రంగా తయారౌతుంది. (నది ఇసకో, సముద్రపు ఇసకో ఇలాగ అవదు) ఈ ఇసకని ఇముడ్చుకున్న గాలి బాదితే కొండలమీది మట్టి మెత్తనై, ఎగిరిపోయి వట్టిశిలని చూపిస్తుంది. ఎడారిలో కొండలన్నీ ఇదే వరస. ఒక గడ్డిపోచయినా కనిపించదు వాటిమీద. విశాఖపట్నపు తీరంలో ఎర్రమట్టి దిబ్బలు ఇలాగే సముద్రపు టిసుక గాలి దెబ్బతిని (మెత్తని తువాలు గుప్పలాగ పెడితే కనిపించే) ముడతలతో చిత్రంగా అరిగిపోతున్నాయి.

ఎండ చేసేపని ముఖ్యంగా రాళ్లని బద్దలు

చెయ్యడమే. రాళ్ల పైపొరలు ఎండకి వేడెక్కి వ్యాకోచించి, మళ్లీ రాత్రి చల్లబడినప్పుడు – లేదా మంచుకురిసినప్పుడు – సంకోచించుకుని బీటలువారి పగిలి, ముక్కలై కిందకి దొర్లి, గుండ్రనై, గాలికి ఇంకా హరించి, నీట్లో పడితే దొర్లి, భూ నగ్నీకరణానికి సాయము చేస్తాయి.

అనుదినమూ అనుక్షణమూ, ఎండా, గాలీ, నీరూ భూమిని నగ్నీకరిస్తున్నాయి. దీనివల్ల ఎత్తుగావుండే ప్రదేశాలు మట్టమౌతున్నాయి. మట్టముగావున్న నేలలు ఇంకా అరిగిపోతున్నాయి. మనదేశములో ఈ అరుగుదలలేక నగ్నీకరణమువల్ల పంటభూములు చాలా పాడైపోతున్నాయి. ఈ నష్టము వాలుగావుండే దక్కను నేలలో చాలా ఎక్కువ. రాజస్థానపు యెడారి ఎల్లలు విస్తరిస్తున్నాయి. నగ్నీకరణాన్ని తగ్గించడానికే దేశనాయకులు వనమహోత్సవాల పేరిట మొక్కల్ని వృద్ధిచేస్తున్నారు. మొక్కలవేళ్లు మట్టిని పట్టివుంచి తరిగిపోకుండా చేస్తాయి. సహారా యెడారిలో అడవులు పెంచే యత్నమొకటి చేస్తున్నారు ఫ్రెంచివారు. అమెరికాలోని టెన్నెస్ నది ప్రవహించే దేశము వాలుగా ఉండి వర్షమువల్ల కడుక్కుపోతూ, సారము పోగొట్టుకుని మరుభూమిలాగ తయారౌతూంటె ఆ నదికి ఆరో ఏడో ఆనకట్టలు కట్టి మెట్లు మెట్లుగా నదిని దింపి, నీటిని సాగుకి ఉపయోగిస్తున్నారు.

—మూర్తి.

—అరగని ఆహారము కడుపులోవుంటే, గాలులు బయల్దేరి కడుపుగోడల్ని, దానిని అంటిపెట్టుకున్న ఇతర తిత్తులనీ ఒత్తుతాయి. దుప్పటి మడత వీపుకిందపడి 'పాము' ఉన్నట్లు కలవచ్చినట్లే పై ఒత్తిడులు రకరకాల కలలకి కారణమౌతాయి.

—అవును. జ్వరమాపకములో పాదరసానికి పైన శూన్యప్రదేశమే అనాలి. కాని పాదరసపు ఆవిరి ఉంటుంది. పాదరసానికీ, గాజుమాపకపు లోవైపుకీ కొంత ఆకర్షణ వుంటుంది. కనక మాపకాన్ని తిరగవేసినా పాదరసము పడదు. తిరగవేసి దులిపితే పడుతుంది. కాని ఇది మళ్ళీ తిరగవేస్తే మిగిలిన పాదరసముతో చేరకపోవచ్చును.

—ఆకాశపు నీలిరంగు గాలికణాలు విరజిమ్మిన నీలికిరణాలది. సాయంకాలపు రంగులు గాలికణాలకంటె కొంత పెద్దవయిన నీటి, – పొగ, – ధూళి, – కణాలు విరజిమ్మిన ఎర్ర కిరణాలవి. అంటే నీలి రంగు ఆకాశానిదీ కాదూ, ఎర్రరంగు కణాలదీ కాదు. కణాలు విరజిమ్మే కిరణాలదే రంగు. తెలుపురంగుని విశ్లేషిస్తే ఏర్పడే ఏడురంగులలోనూ, నీలి, పసుపు, ఎరుపుల ప్రాబల్యము హెచ్చు. కణాలసైజు హెచ్చినకొద్దీ, విరజిమ్మబడే రంగు నీలినుంచి ఎరుపుకి మారుతుంది.



చి
మద్రాసు :



కారుడు : శ్రీ సూర్యప్రకాశ సాహుదేవ్.
్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనలోనిది.

బొమ్మరిల్లు

"విజయ"

శ్రీ గణపతి రాధాకృష్ణమూర్తి

★

వచ్చింది వచ్చింది 'విజయ' వచ్చింది
తెచ్చింది తెచ్చింది జయము తెచ్చింది.

పచ్చనితోరణాల్ ప్రతిప్రాంగణాన
వింతశోభలు పుణికి పుచ్చుకున్నాయి.

ఎంకుచూచిన ముదము కదను తొక్కింది
అంతులెరుగని శుభము గంతులేసింది.

ఆబాలగోపాల మానందజలధిలో
మురిసిపోతూ సోలి తేలిపోయారు.

కష్టాలు గట్టెక్కి మనరాష్ట్రమొచ్చి
నష్టజాతకమంత తీరిపోనుంది.

పలుకవే పాపాయి జేజేలు పలుకు
ఆంధ్రమాతకు పట్టు నీరాజనాలు.

జై 'విజయ', జయ 'విజయ', దిగ్విజై 'విజయ'
జయమస్తు, శుభమస్తు, విజయోస్తు, 'విజయ'.

'విజయలో నీప్రజలు విజయంబు నందీ
సకలసంపదలతో వర్ధిల్లవలెను!'

అశ్వరత్నం

పైడిమర్రి వేంకటసుబ్బారావు

శ్రీమాన్ కొండమాచార్యులుంగారు గొప్ప శిష్యకోటికి ఆచార్యులు. పల్లె పల్లెలో ఉన్న శిష్యులదగ్గరికి పోయి వారికి పాదతీర్థం ప్రసాదించి సాయుజ్యాన్ని అనుగ్రహించవలసినవారు. ఏటా తప్పనిసరిగా, ఉన్న శిష్యులందరికీ తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదించవలసి ఉంటుంది. కాలినడకతో పోవడం అసాధ్యం. శిష్యవర్గం చూచి భరిస్తుందా? ఒక గుర్రాన్ని యిచ్చారు. దాన్ని కాపాడ్డానికి ఒక భృత్యుడు కావాలి. ఎవడు దొరికినా మాసం, రెండు మాసాలుమాత్రం ఆచార్యులవారిని సేవించడంలోనే వానికి సెలవులు పొందక తప్పించుకుపోయేవాడు.

రామప్ప ఎక్కడా బ్రతుకు తెరువు లేక బాధపడుతున్న ఒక బీద తెలగవాళ్ళబ్బాయి – ఎవరూ దిక్కూ తివాచిక లేనివాడు. శ్రీ ఆచార్యులగారికి పనిమనిషి కావాలనివిని వారిదర్శనం చేసుకున్నాడు. ఆచార్యులుగారు అయాచితంగా, తమకు శ్రియఃపతి సాక్షాత్తుగా తానే భృత్యుణ్ణి అనుగ్రహించాడని ఆనందించారు.

'మేము భృత్యులందరికీ పెట్టినట్లు దోరకజ్జాయం. రామాంజపు పాడితో నీకు భోజనం పెడుతూంటాం. మా అశ్వరత్నాన్ని కాపాడడం మాత్రమే నీ పని – అంతే.....' ఆచార్యులుగారు అన్నారు రామప్పతో.

దినం భోజనం జరుగక బాధపడుతున్న రామప్పకు 'దోరకజ్జాయం' 'రామాంజపు పాడితో' భోజనమనేసరికి ఇంకా సంతోషపడ్డాడు – వాడి జన్మలో అంతటి పేరు వినియుండలేదు. సంవత్సరం గడువు పెట్టుకొని యేర్పాటు చేసుకున్నాడు.

పనిలో ప్రవేశించిననాడు ఆచార్యులుగారు భోజనం పెట్టారు. ఆచార్యులుగారే స్వహస్తపాకం చేయడంవల్ల అడుగున కొంచెం మాడింది. ఆ మాడు చెక్కలు భృత్యునికి ప్రసాదించాడు పరిహరించడం మేలుగా ఉండదని. కూరలు కాయలు చేసుకోవడం చేతగాక ఒక్కసారే ఒక పెద్ద రేకుడబ్బానిండా పోసిపెట్టిన కారప్పొడితో తాను భోంచేస్తాడు. అదే పొడి యింత శిష్యునికి పడేశాడు. రామప్పకు ఆకలిగా ఉన్నది. కాని కారప్పొడితో ఆ మాడుచెక్కలు తినలేక 'దోరకజ్జాయం' 'రామాంజపు పాడి' యింకా వడ్డిస్తారని ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆచార్యులు అడిగారు 'భోంచెయ్యడం లేదే' మని. శిష్యుడు వడ్డించమని కోరాడు – 'దోరకజ్జాయం' 'రామాంజపు పాడి'ని.

అప్పుడు శ్రీ ఆచార్యులుగారు వివరించారు. ఇవిది శ్రీభాష్యకారుల ధర్మంలో ప్రవర్తించేవారు వచించే సాంప్రదాయసిద్ధమైన అభిదలనీ, శ్రీవారి ప్రసాదం అపరిహార్యం అనీ వ్యాఖ్య చేశారు. రామప్పకు గత్యంతరం లేక కళ్లు మూసుకొని ఉదరమహాసాగరంలో పడేశాడు – 'దోరకజ్జాయాన్ని రామాంజపు పాడి'తో.

ఎన్ని రోజులకు అడిగినా శ్రీ ఆచార్యులుగారి వదన సరోజమునుండి వెలువడే వ్యాఖ్యలు, ఉపవ్యాఖ్యలు ఇంతే, ఇవే. రామప్పకు మొదట చేసుకొన్న వాయిదా ప్రకారం సంవత్సరమంతా 'దోరకజ్జాయం' 'రామాంజపు పాడి' భుజిస్తూ ఆచార్యులుంగారి శుశ్రూష చేస్తూ ఉండడం తప్పని సరైంది. పైగా మాటలు పూర్వపు అపునీతమైన భాషలో మాట్లాడగూడదనీ, పవిత్రమైన 'తిరు' శబ్దాన్ని ప్రతిపదం ఆదిలో తగిలించి మాట్లాడాలని శ్రీవారి ఆదేశం. తప్పితే వషట్కార ప్రయోగం. సున్నాలపన్నం వల్లె వేయడం – నిజంగా రామప్పకు అదో యముచర అయిపోయింది. బయటపడ్డానికి ఉపాయం ఆలోచిస్తుండేవాడు. ఆరు మాసాలు అతికఠినంగా గడిచాయి, నిత్యం ఒక్కొక్క గ్రామం పయనించడంలో. భృత్యుడు మధ్యన కొన్ని మాసాలు లేని కారణాన పర్యటన చేయకుండా తప్పిపోయిన గ్రామాలన్నీ పవిత్రం చేయాలని ఆచార్యులుగారు అప్పుడే నిర్ణయించుకోవడంవల్ల పర్యటనా కార్యం మరింత యెక్కువయింది మామూలుకన్నా.

పల్లెల్లోనైనా తన భోజనానికి యే శిష్యుని యింట్లోనైనా యేర్పాటు చేయిస్తారేమో అని ఆశించాడు రామప్ప. అపవిత్రులైనవారి భోజనం తిన్నందువల్ల వారు ఎక్కే అశ్వరత్నాన్ని, వారిని సేవించే పవిత్రత రామప్పకు ఉండదనీ, మొదటి వాగ్దానప్రకారం – 'దోరకజ్జాయం' 'రామాంజప్పొడి'తో భోజనం జరుగదనీ ఆచార్యులుగారు అట్లా సమ్మతించలేదు.

పర్యటనలో అడవిప్రాంతములో ఉన్న ఓ గ్రామానికి వెళ్ళారు. ఆచార్యులుగారు గ్రామంలో శిష్యులను పునీతుల చేస్తూ, తిరుపాకం, తిరుసాపాటు చేస్తూఉన్నారు. రామప్పపాలిట ఉన్న తిరు అశ్వరత్నాన్ని కాయడం మిగిలింది. అశ్వరత్నాన్ని కొట్టుకొనిపోయి పరిసరంలో ఉన్న తిప్ప సమీపంలో మేపుతూ కూర్చున్నాడు. యథావిధిగా మూడవయామం కాలేదు, రామప్ప భోజన సమయం రావడానికి. గుర్రాన్ని విడిచి, పైగుడ్డ పరుచుకొని ఓ చెట్టుకింద పడుకున్నాడు – కునుకుపట్టింది.

కొంతసమయం తరువాత మేల్కొన్నాడు. అశ్వరత్నం కనబడలేదు. ప్రక్కపొదల్లో నలువైపులా చూచాడు. దూరంగా. ఓ పులి ఆరగిస్తూ ఉంది ఒక గుర్రాన్ని. అది ఆచార్యులగారి అశ్వరత్నమే నని గుర్తించాడు రామప్ప. భయపడ్డాడు ఆచార్యులుగారేమంటారోనని. అయితే ఈ సంగతి 'తిరు' భాషలో ఎల్లా చెప్పడం? బాగా మెదడునంతా మథించి మథించి స్వీయానుభవాలన్నీ యేకరువు పెట్టుకొని తేల్చుకున్నాడు. ఆచార్యులగారి దగ్గరికి పరుగెత్తాడు.

ఆచార్యులుగారు అప్పుడే తీరుబాటుగా, తిరుసాపాటు చేసి తిరుతాంబూలం పుచ్చుకుంటున్నారు. రామప్ప కనబడ్డాడు.


'దోరకజ్జాయం – రామాంజపు పాడి' సిద్ధమైనవి లేరా రామప్పా!' అన్నాడు ఆచార్యులు.

రామప్ప తికమకపడుతూ ఎంతో గొడవతో. 'స్వామీ! తీగల తిరుమాళిగలోని చారల పురుషోత్తములవారు అయ్యగారి అశ్వరత్నాని తిరుకటికూ, తిరుపుటికూ' అన్నాడు.

ఆచార్యులుగారికి అర్థం కాలేదు. 'అశ్వరత్నం ఏమయిందిరా? – నీ తిరుభాష, తిరుగుడు పాడుభాష విడిచి తెలిసేట్లు చెప్పరా?' అని గొడవపెట్టాడు ఆచార్యులు.

'స్వామీ! దోరకజ్జాయం – రామాంజప్పొడి అని తిరుభాషలో చెప్పి, మాడు చెక్కలు కారప్పొడి పడేసి తినమని బాధపెట్టారు – ఏమీ తెలియని మనుష్యుల మోస

(43-వ పేజీ చూడండి)



(గతసంచిక తరువాయి)

సర్కసులు నడిపేవాళ్లూ, సినిమాలు తీసేవాళ్లు అందరూకలిసి గోరిల్లాకు చాలా అన్యాయం చేశారు. వీరి ప్రచారం మూలంగా గోరిల్లా అనేది అతి దుష్టమైన జంతువు అనే అభిప్రాయం ప్రజలలో పాతుకుపోయింది. కానీ నిజం మాత్రం అదికాదు.

ఎంతో కోపం తెప్పించే పని ఏదైనా చేస్తేనే కానీ, సామాన్యంగా గోరిల్లాలకి కోపం రాదు. గోరిల్లా గుంటకళ్లవంక చూస్తున్నప్పుడు అగ్నిపర్వతపు గుహల్లోకి చూస్తున్నంత భయంకరంగా తోచవచ్చు. దానికితోడు సామాన్యంగా గోరిల్లాలు ఎవరైనా ఎదురైనప్పుడు గుండెలు బాదుకు చిందులు తొక్కుతాయి. ఇదంతా చూసి మనని అది కాలికి కాలు, చేతికి చెయ్యీ, వూడదీసి పెట్టెయ్యాలని చూస్తున్నదనిపిస్తుంది కానీ, నిజం అదికాదు. తానుకూడా హుషారుగా వుండగలనని తెలియచేయటానికే గోరిల్లా యింత అల్లరి చేస్తుంది.

దీని విషయమై పరిశోధనలు జరిపిన శాస్త్రజ్ఞులు గోరిల్లా మనస్సు ఎల్లప్పుడూ స్నేహాన్నే కోరుతుంటుందని తెలుసుకొన్నారు.

ఏపని అయినా తాపీగా క్రమం తప్పకుండా చేయాలని మానవుడు ఎంత పట్టుదలగా వుంటాడో, గోరిల్లాలు వాటి నిత్యజీవితంలో అంత క్రమబద్ధంగానూ మసులుకొంటాయి. జ్యూలోవున్న గోరిల్లాలకి మీ రెవరన్నా ఒక చాక్లెట్ బహుమానంగా యిస్తారనుకోండి. ఆ చాక్లెట్ మీద చుట్టివున్న కాగితాన్ని అది అతి జాగ్రత్తగా తీసేసి చాక్లెట్ ముక్కను నోట్లో వేసుకొని, పనికిరాని ఆకాయితాన్ని, మడ్డి మనుష్యుల్లా కాకుండా, వేళ్లసందున పెట్టి నలిపేసి ఆకాగితపు వుండను ప్రత్యేకం పనిగట్టుకు తీసుకుపోయి, ఒకమూలగా పడేసి వస్తుంది.

'కాంగో' అనే పేరుగల ఒక గోరిల్లా పూర్వం ఒక జ్యూలో వుండేది. దీని తెలివితేటల పరిశోధనకు అక్కడ దానిబోనుకు యివతలగా ఆరుబయటను ఏవో కొన్ని యంత్రాలు పెట్టి వుంచారు. ప్రతి వుదయమూ అది బోనులోనుంచి బయటకివచ్చి పరీక్షా కార్యక్రమంలో పాల్గొంటూ వుండేది. ఇలా వుండగా ఒకనాటి రాత్రి వాన కురిసింది. ఇది మామూలుగా ప్రతిరోజూ కూర్చొనేచోట చిన్న నీటిమడుగు ఏర్పడింది. మరునాటి వుదయం పరీక్షకోసం బోనులో నుంచి బయటకు వచ్చిన 'కాంగో' ఆనీటి మడుగుకేసి కాసేపు చూసి, వెనక్కి తిరిగివెళ్లి ఎక్కడో యింత ఎండుగడ్డి పడివుంటే దాన్ని పట్టుకొచ్చి, నీటిమడుగునంతటిని గడ్డిపరకలతో కప్పేసి, వాటిమీద చతికలబడి కూర్చొని, 'యిక మీ పరీక్షలు ప్రారంభించవచ్చునన్నట్లు' అక్కడవున్న వారి వంక చూసింది.

గోరిల్లా పెంపకం, పోషణ బాధ్యతలు నిర్వర్తించే జ్యూ వుద్యోగులు, మానసికతత్త్వశాస్త్రవేత్తలు ఎంతసేపూ ఆ గోరిల్లాల చేతికి చిక్కకుండానే తప్పుకు తిరుగుతూ వుంటారు. కారణం, అవిఅంత దుష్టజంతువులని కాదు;

వాటి ధృతరాష్ట్ర కౌగిలికి ఝుడిసిపోయి! గోరిల్లాలకు ఎవరిమీదనైనా ప్రేమపుట్టుకు వచ్చిందీ అంటే, వెంటనే ఆవ్యక్తిని గట్టిగా కౌగలించుకుని వూపిరి ఆడకుండా చేసేస్తాయి. (మానవుల్లో కూడా కొందరు కొందరికి ఎవరిమీదైనా ప్రేమ పుట్టుకొచ్చిందంటే, వాళ్ల విషయంలో విపరీతమైన శ్రద్ధ తీసుకొని, వుక్కిరి బిక్కిరి చేసెయ్యటం మామూలుగా జరిగేదే!)

చికాగోలోని లిన్ కాలన్ పార్కు జ్యూలో 'బుష్ మన్' అనే ఒక గోరిల్లా వుండేది. దానికి ఎందుకనో అక్కడ పనిచేసేవాళ్లల్లో ఒకడిమీద అవ్యాజమైన అనురాగం అంకురించింది. ఆ పనివాడు ముందుగా తనకు తిండి పెట్టకుండా మిగిలిన జంతువుల విషయం చూస్తూన్నంతసేపూ యివతల యిది, మొగుడిమీద అలిగిన పెళ్లాంలాగా, మూతి ముడుచుకు కూర్చొనేది. అలా కాకుండా అతగాడు ముందుగా తన విషయమే పట్టించుకొని, తనకే తిండీ అదీ పెట్టితే దీనికి ఎక్కడలేని సంతోషమూవచ్చి, అతణ్ణి గట్టిగా కౌగలించుకోబోయేది. ఆపనివాడు మాత్రం ముందుగానే జాగ్రత్తపడి, దాని చేతులకి అందకుండా మాత్రం తప్పుకు తిరిగేవాడు.

బ్రాన్క్స్ జ్యూ (న్యూయార్క్)లో 'ఓకా' అనే ఆడగోరిల్లా, 'మకోకో' అనే మొగ గోరిల్లా వుండేవి. ఈ రెంటినీ ఎప్పుడైనా ఒకే బోనులోకి వదిలిపెట్టితే అవి రెండూ ఒకదాన్ని ఒకటి చంపేసుకోబోతున్నంత ఘోరంగా పెనుగులాడేవి. ఆ పెనుగులాటను చూచి మనమంతా ఒకదానిపైమరొకదానికి అంత దౌష్ట్యం వున్నది కాబోలు ననుకొంటాం. అదేమీకాదు. అదంతా వాటి ప్రేమకలాపం!! (ఇటీవల మనం చూస్తున్న హిందీ చిత్రాలలో నాయకా నాయికల్లాగా) ముందుగా యీ మిస్టర్ మకోకో కళ్లురుమి పళ్లు బిగించి ఆ గోరిల్లా అబల 'ఓకా' జుట్టు పట్టుకొని అటూ యిటూ పదిమాట్లు వూపేస్తుంది. 'ఓకా' మాత్రం వూరుకొంటుందా? ఈడ్చి పెట్టి ఒక్క లెంపకాయి కొట్టుంది. ఇక అక్కడనుంచీ యీ రెండూ, యిద్దరు 'కింగ్ కాంగులు' కుస్తీ పడ్తున్నంత భయంకరంగా, కుస్తీపట్లన్నీ పట్టి భూమ్యాకాశాలు దద్దరిల్లేలా చేసిపారేస్తాయి. మిస్టర్ మకోకో ఆ ఆటల సందడిలో 'ఓకా'ను రెండు చేతులా పైకియెత్తి పెట్టి విసిరి నేలనేసి కొడుతుంది. క్రింద పడిన 'ఓకా' మళ్లీ ఒంటి కాలిమీద లేచి పెనుగులాడ బోతుంది. ప్రమాదవశాత్తూ వీరిలో ఎవరికైనా చిన్న దెబ్బతగిలితే, రెండో వారికి గుండెలో బల్లెం గుచ్చుకుపోయినంత యిదిగా బాధపడటంకూడా జరుగుతూ వుంటుంది.

ఈ రెంటినీ ప్రక్క ప్రక్కగా వుండే రెండు వేరువేరు బోనుల్లో పెట్టినప్పుడు కూడా, ఆబోను వూచల సందుల్లోనుంచీ ఒకదానికి యింకొకటి తిను బండారాలు యిచ్చుకొంటూ వుంటాయి. ఇలాటి త్యాగంచేసే గుణం మొగ గోరిల్లాలోకంటే ఆడ గోరిల్లాలోనే ఎక్కువగా వున్నట్లు ఋజువు అయింది కూడాను!

మరీ పెద్దవై పోయిన గోరిల్లాల మాట ఎల్లావున్నా, పసియీడులో వుండే గోరిల్లాలను తెచ్చుకొని మన యిళ్లల్లో పెంచుకోవటం మొదలుపెట్టితే, అనేకమంది పిల్లలకంటే అవే మేలనిపించేటంత బుద్ధిగా మసులుకొంటాయి. న్యూయార్కులో ఒక మిస్ యిల్లాగే చిన్న చింపాంజీని తనయింట్లో అట్టే పెట్టుకు సాకటం ప్రారంభించింది. ఆగోరిల్లా వినయ విధేయతలు, ఋజువర్తన, శుచి శుభ్రం యివన్నీ చూసి ఆవిడ మురిసిపోయి, దాన్ని కూడా తన యింట్లో మనిషిక్రిందనే చూసుకొనేది. దానికి ప్రత్యేకం ఒకగది; అందులో ఒక ప్రక్క వుండేది. అర్ధరాత్రివేళ అవశిష్టాలు ఏవైనా తీర్చుకోవలసి వస్తే, యీ గోరిల్లా పక్క మీదనుంచి లేచి ఎలక్ట్రిక్ లైట్ స్విచ్ వేసుకొని, 'బాత్ రూమ్'లోకి పోయి ఆపని పూర్తి చేసుకొని తిరిగివచ్చి లైటు తీసేసి మరీ పడుకొనేది. దుప్పటి తానే కప్పుకొనేది. (ఈమాత్రం క్రమం తప్పకుండా నడుచుకోవటం పిల్లలందరికీ పుట్టుకుతోనే వచ్చేస్తే ఎంత బాగుండును!)

అడవిలో బ్రతికే గోరిల్లా లైతే, అవి ప్రతిరాత్రి పడుకోబోయేముందు చెట్లకొమ్మలు ఆకులు విరిచి గుట్టలుపోసి, వాటితో మెత్తటి పక్క పరుచుకొని పడుకొంటాయి. అన్నట్లు-గోరిల్లాలు నిద్రపోతున్నప్పుడు అతి భయంకరంగా గురక పెట్టుతాయి. వీటి విషయం విశేష పరిశోధనలు జరిపిన ఏ. ఐ. గుడ్

పండుగరోజు పాపాయి

రెంటాల గోపాలకృష్ణ

★

బొమ్మలు తెస్తావా నాన్నా
భోగీ పండుగ వచ్చిందీ
సొమ్ములుకొన్ని చేయిస్తావా
శ్రావణ మాసం వచ్చిందీ!

ఉయ్యాలొకటీ వేయిస్తావా
ఉడుముల తద్దె వచ్చిందీ
అమ్మతొ అరిసెలు చేయిస్తావా
అటుకుల తద్దె వచ్చిందీ!

గుమ్మటు మొకటీ కట్టిస్తావా
గురుగుల పండుగ వచ్చిందీ
మందులు చాలా కొనితెస్తావా
దీపావళి అదిగో వచ్చిందీ!

ముఖమల్ పరికిణి కుట్టిస్తావా
ఉగాది పండుగ వచ్చిందీ
తీయని పానకం చేయిస్తావా
శ్రీరామనవమీ వచ్చిందీ!

పూలూ, పత్రీ తెచ్చిస్తావా
చవితిపండుగ వచ్చిందీ

బందరు బండీ ఎక్కిస్తావా
సముద్ర స్నానం వచ్చిందీ!

శ్రీశైలంనను పంపిస్తావా
శివరాత్రదుగో వచ్చిందీ
ఉప్పుడు పిండీ చేయవె అమ్మా
ముక్కోటేకా సొచ్చిందీ!

కదురూ, రాట్నం తెప్పిస్తావా
గాంధీపుట్టిన రోజొచ్చిందీ
కాయపుతాయం కావాలే
కృష్ణజయంతి వచ్చిందీ!

పప్పులు, బెల్లం పంచిపెట్టవే
దసరాపండుగ వచ్చిందీ!
నెత్తిన పండ్లూ పోయండమ్మా
పుట్టిన రోజూ వచ్చిందీ!

జోడా ఒకటే కొనితేనాన్నా
స్వాతంత్రదినమూ వచ్చిందీ
అమ్మకు చీరెలు తీసుకరావా
ఆంధ్రరాష్ట్రమూ వచ్చిందీ!

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

అనే ఒక శాస్త్రజ్ఞుడు గోరిల్లాలు ఎక్కువగా వుండే ఒకానొక అడివిలో చాలా రోజులు గడిపాడు. అప్పటి ఆయన అనుభవాలు చెప్తూ, "ఒకరాత్రి 'బప్-బప్-బప్-బప్ బప్-బప్-" అనే అదొక రకమైన ధ్వని ఏదో, ముందుకొంత మందంగా ఆరంభించి క్రమంగా పెద్దదై మళ్లీ తగ్గుతూ, విడవకుండా వినిపించింది. శబ్దాన్ని బట్టి చూస్తే అది దాదాపు అరమైలు దూరం నుంచీ వినవస్తోందనిపించింది" అన్నాడు. ఆప్రాంతాల్లో నివసించే వారు చెప్పిన దాన్నిబట్టే యింత బిగ్గరగా గురక పెట్టటం మూలంగా గోరిల్లాకు కొంతరక్షణకూడా వున్నదని అర్థమౌతున్నది.

అడవుల్లో తిరిగే గోరిల్లాలు ఏవీ కూడా తగినంత కారణం లేకుండా మనుష్యుల మీద పడవు. కాకపోతే, మనిషి ఎవడైనా కన్పించినప్పుడు అతనిని బెదరగొట్టటానికి యివి ముందుగా వెధవ వేషాలు చాలా వేస్తాయట. ఆ వేషాలు చూసి బెదిరిపోకుండా మొగాడులా నిలబడితే చాలు, అవి వచ్చిన దారినే వెళ్లిపోతాయి. పిక్కబలం చూపించబోతే మాత్రం అవి మనిషిని పట్టుకు రక్కేస్తాయి!

గోరిల్లాలకీ మనుష్యులకీ సామాన్యంగా పేచీలు అరటితోటల్లో వస్తుంటాయి. అరటిపళ్లన్నా, అరటిపిలకలన్నా వీటికి వల్లమాలిన యిష్టం. అందుకనే వీటిని చెదరగొట్టటానికి తోటకాపర్లు రాత్రి పొడుగునా సీనారేకుడబ్బాలు వాయిస్తూ కూర్చుంటారు. కొందరు కొందరు మనిషి ఆకారంలో దిష్టిబొమ్మలు తగిలించి ఆతోటల్లో పెట్టుతూవుంటారు. ఆబొమ్మలు వుండేచోటు రెండు రోజుల కొకసారి మార్చకపోతే, యివి అసలు రహస్యం కనుక్కొని. యింక భయపడటం మానేస్తాయి,

(ఇంకావుంది)

పిల్లల పగ

శ్రీ కంబగిరి మల్లినాథ్

'అమ్మా, మంచినీళ్లియ్యవే, దాహం అవుతోంది' అని అరుచుకుంటూ లోపలికి వచ్చాడు 10 యేండ్ల గోపి.

పనిలో మునిగివున్న రామమ్మ వులిక్కిపడి చూచింది. సహజంగా ఎఱ్ఱనైన అతని చంపలు రెండూ కందిపోయాయి. ఆచిన్ని పాదాలు బొబ్బలు ఎక్కాయి. రామమ్మ కుండలోని చల్లని నీళ్లను తెచ్చి యిచ్చి, 'త్రాగు నాయనా. ఇంకా ఎన్నాళ్ళకిరా వొంటిపూట బడులు?' అని అడిగింది, అన్నం ముద్దను వాడిచేతులో పెడుతూ.

'ఇంక 20 రోజుల తర్వాత నంటమ్మా.'

'రేపటినుంచి, మధ్యాహ్నం పూట యింటికి రావద్దు గోపీ. ఇంత అన్నం అక్కడికే పట్టుకుపోయి మధ్యాహ్నం తిని, సాయంత్రం చల్లబడిన తర్వాత యింటికిరా నాయనా'

'టిఫిన్ కారీర్ లేదే అమ్మా'

తల్లికేమి సమాధానం చెప్పాలో తోచలేదు. 'రేపటికి నే తెస్తాలేరా గోపీ. రాజమ్మగారు యిచ్చిన 5 రూపాయలతో ఒక చిన్న టిఫిన్ కారియర్ కొనితెస్తాను' అని అంది.

గోపీ బడికి వెళ్లిపోయాడు. రామమ్మకు జరిగిపోయిన సంఘటన లన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. 5 యేండ్ల క్రితం తన భర్తకు నిష్కారణంగా కారాగార ప్రాప్తి కలిగింది, జైలులోనే ఆ అవమానము

(43-వ పేజీ చూడండి)



విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించే రోజులు అవి. వారి ఆస్థానంలో గోపయ్య, వీరయ్య, సోమయ్య, పైడియ్య అనే నలుగురు,, సంస్థాన పండితులకు శిష్యులుగా వుండే వారు. వారు ఒకరివద్ద శిష్యులుగా ఎలా వున్నారో అలానే వీరివద్ద కూడా ఓ నల్గురు శిష్యులు తరిఫీదు అవుతూ వుండేవారు.

ఇలా వుండగా ఆస్థానకవులు వ్రాసిన గ్రంథాలు బోలెడన్ని అమ్ముడు కాకుండా వుండిపోయినా యని ఒకరోజున శ్రీవారికి తెలియ వచ్చింది. మిగిలిపోయిన ప్రతులు ఏమాత్రం వుంటాయని రాయల వారు ప్రశ్నించారు. సుమారు వెయ్యివరకూ వుండిగలవని గ్రంథాలయాధికారి జవాబిచ్చాడు. ఎప్పటికప్పుడు వేడివేడిగా అమ్ముడుపోయే అమూల్య గ్రంథాలు ఇంత విచిత్రంగా మిగిలిపోవడానికి కారణం ఏమైవుంటుందా అని ఆలోచించి- ఆఖరికి ఎలాగైనా వాటిని ప్రజలు కొనేలా చూచి ప్రభుత్వ భాండాగారానికి లోటు రానీయరాదని మహారాజు ఒక చక్కని పథకం తయారుచేశారు.

అదేమంటే- - ఆస్థాన కవులవద్ద శుశ్రూష చేస్తోన్న శిష్యులు నలుగురూ-వారివద్ద శిష్యరికం చేస్తోన్న మరి నలుగురూ కలసి, ఒక నెల రోజుల గడువులో ఒక్కొక్కరూ 125 గ్రంథాలకు తక్కువ కాకుండా అమ్మి వేయాలనీ - అందరికంటే ఎక్కువగా ఎవరైతే గ్రంథాల్ని చెలామణీ చేస్తారో వారికి మంచి బహుమానం లభించగలదనీ ప్రకటించారు. అదే ప్రకటనలో గురువులు అమ్మిన గ్రంథాలకు వేరు - శిష్యులు విక్రయించిన గ్రంథాలకు వేరు - అని బహుమతుల వివరాలు స్పష్టీకరించారు.

శ్రీ అందే గోపాలకృష్ణ

ఈ పథకం ప్రకారం ఎనిమిది నూటపాతికలు, వెయ్యి గ్రంథాలూ ఖర్చయిపోతాయని అంచనా వేశారు రాయలువారు.

'బహుమతి' అని ఎప్పుడైతే మహారాజు శెలవిచ్చారో అప్పుడే ఆ ఎనమండుగురికీ ఒళ్ళు పులకరించి, మేను జలదరించింది. ఎవరికి వారే గ్రంథాల్ని ఎక్కువగా అమ్మి బహుమానం సంపాయించాలని ఆశపడ్డారు.

వెంటనే ఒక్కొక్కరు 125 గ్రంథాల చొప్పున తీసుకొని ఒక గురువూ, ఒక శిష్యుడూ కల్సి ఒక జంటగా బయలుదేరారు-నాల్గువైపులికీ. దారిలో ఎదురైన ప్రతివారికీ ఆ గ్రంథాలలో వున్న అమూల్య సారాన్ని వర్ణిస్తూ, తప్పక దానిని కొని తీరవలసిందిగా కోరుతూ, ఎవరికి వారే యమయాతనలుపడుతూ, ఆ గ్రంథాల్ని విక్రయిస్తున్నారు. వారు ఎక్కని గుమ్మం లేదు- తిరుగని వీథి లేదు. తిండీ తిప్పలుకూడా మాని మహారాజు ప్రసాదించబోయే బహుమానంకోసం ఆ గురుశిష్యవర్గాలు చాలా ప్రయాసపడి తిరుగుతున్నారు.

ఇలా వుండగా మహీపతి పెట్టిన గడువు పూర్తయింది. మిగిలిపోయిన గ్రంథాలూ, అమ్మిన గ్రంథాల మూల్యమూ రాయలవారి కార్యాలయంలో వప్పగించి ఎవరు ఎన్నెన్ని అమ్మినదీ వివరంగా లెక్కలు వ్రాసి శ్రీవారికి పంపుకున్నారు.

అందరికంటే గోపయ్య, సీనయ్యలు ఎక్కువ గ్రంథాల్ని అమ్ముడు చేశారు. గోపయ్య శిష్యుడైన సీనయ్యకు గ్రంథాల్ని గురించి ప్రచారంచేసి అమ్మే అంతటి తెలివితేటలు శూన్యం కావటంవల్ల, గోపయ్యే అతని వాటా గ్రంథాలు కూడా పుచ్చుకుని మొత్తానికి ఎలాగైతేనేం 300 గ్రంథాలకీ 250 అమ్మివేశాడు. సీనయ్య తను స్వయంగా పట్టుమని పది కూడా అమ్మలేకపోయాడు. మిగతా ముగ్గురి గురువులలో ఏ ఒక్కరూ తమకిచ్చిన 125 గ్రంథాలలో నూ ముప్పది అయిదుకంటే ఎక్కువ చెల్లుబడి చేయలేకపోయారు. వారి

శిష్యులు కూడా అంతే! ఇరవై కంటే ఎవ్వరూ ఎక్కువ అమ్మలేక పోయారు. సీనయ్య పదికంటే ఎక్కువ అమ్మలేక పోయినా గోపయ్య తన శిష్యుని నిస్సహాయతకు జాలిపడి 50 గ్రంధాలు అతని వల్ల అమ్ముడుపోయినట్లు తను పంపే లెక్కలో యిమిడ్చి పంపించాడు.

రాయలవారు నలుగురు గురువులూ పంపుకున్న లెక్కల్ని నిండు కొలువులో అతి శ్రద్ధగా పరిశీలించి గోపయ్య, సీనయ్యలకి బహుమతులు పంచే నిర్ణయానికి వచ్చారు. కాని యింతలోనే సభలో కలకలం ప్రారంభమైనది. 'ఏమిటద'ని భూపతి ప్రశ్నించారు. ఎవ్వరూ ధైర్యం చేయకపోగా, ఒక ముసలి గుమాస్తా రాయలవారికి ఎదురుగా వచ్చి చేతులుకట్టుకు నిల్చుని యిలా అన్నాడు :

"మహాప్రభూ! మన కోశాధికారి - బసవయ్యగారు - గోపయ్యగారు తమకు పంపుకున్న లెక్కలు శుద్ధ తప్పు అనీ- గ్రంధాలను విక్రయించటంలో నేర్పు చూపి శక్తికొలదీ పని చేసినది అతని శిష్యుడు సీనయ్యే ననీ చెబుతున్నారు."

శ్రీవారికి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది.

"ఇలా తప్పుడు లెక్కలు ఎందుకు వ్రాసి పంపావు? నిజం చెప్పు: లేకపోతే నీ తల తీ యిస్తాను" అని గోపయ్యని నిండుసభలో నిలదీసి అడిగారు.

గోపయ్యకి యిదంతా అయోమయంగా కన్పించింది. తను తప్పుడు లెక్కలు వేసి పంపలేదే! అయినా ఇందులో, బసవయ్యకి సంబంధం ఏమిటి? అత నెందు కిలా తనని యింతమందిలో అవమాన పరుస్తున్నారు?? ఒరుల కలిమిని చూచి ఓర్వలేని పరిస్థితి అతని కీనాడు ఎందుకు కలిగింది? తను ఎన్నడూ, ఎవ్వరికీ కీడు తలపెట్టి ఎరుగడే!!! గ్రంధాల్ని విక్రయించటంలో పడ్డ శ్రమంతా వృధాయేనా? తనకి బహుమతి పొందే యోగ్యత లేదా??—ఇలా ఎన్నో ప్రశ్నలు అతని మనస్సులో మెదిలాయి.

"మాట్లాడ వేం?" మహారాజు మళ్ళీ గర్జించాడు.

"చిత్తం - ఏలినవారికి పంపుకున్న లెక్కలు ఖచ్చితమైనవే నని నా ఆత్మసాక్షిగా చెబుతున్నాను. నేను తమనుండి బహుమతి పొందబోతున్నాననే యీర్ష్యతో ఎవరో యీ పుకారు పుట్టించారు. కావలిస్తే యీ విషయంలో ఏమైనా

(55-వ పేజీ చూడండి)

కలలో వేధించిన పిలక

మా ఇంటివద్ద ఒక గుడిఉంది. ఆగుళ్లో ప్రతిరోజు సాయంకాలం మావీధిపిల్లలూ, నేను కలసి ఆడుకుంటుంటాం. మా మూలు ప్రకారంగా మేము ఒక సాయంకాలం ఆడుకుంటుంటే ఆపేటలో వున్న ఒక తాతగారు ఆగుళ్లోకి మాఆటలు చూడాలని ఒక కర్ర పుచ్చుకుని వంగి నడుస్తూవచ్చాడు. ఆతాత బలేకోపిష్ఠి. ఆయన పిలక ఎవరైనా ముట్టుకుంటే కస్సుమనేవాడు. ఆయన మా ఆటలవంక చూస్తూ కూర్చుంటే నాకో దుర్బుద్ధి పుట్టింది. అదేమిటంటే - ఆతాత పిలక పుచ్చుకుంటే ఆయన ఎలాగూ ఉడుక్కుంటాడు; ఆయన ఉడుకుమోతు తనం చూసి మిగతావాళ్లందరూ ఆనందిస్తారని నాబుద్ధికి తోచింది. నాబుద్ధికి తోచటమేమిటి, పని జరిగి పోవటమేమిటి,—రెండూ ఒక్కసారే జరిగిపోయినై!

నేను పిలక పట్టుకోవటం చూసి అక్కడి పిల్లలందరూ 'గొల్లు' మని నవ్వి చప్పట్లు చరిచారు. అంతమంది పిల్లలలో తనని అవమానం చేయటం చూసి, ఆతాత మండిపడి "చూడు మీనాన్నతో చెప్పి ఏం చేయిస్తానో" అని గబగబా గుడి ఇవతలకొచ్చి, "చూడరా శేషయ్యా మీవాడు ఏం చేశాడో!" అని ఒక పొలికేక పెట్టాడు. జరిగిన సంగతంతా మానాన్నగారు ఆతాత ద్వారా విని ఒక పెద్దకావడి బద్ద తీసుకొచ్చారు - నన్ను బాదడానికి. మా నాన్నగారంటే నాకు బలే చెడ్డభయం.

గుడి దగ్గరకు వచ్చేస్తున్న మా నాన్నగారిని కొందరు పిల్లలుచూసి లోపలికి పరుగెత్తుకొచ్చి "ఒరేయ్! ఒరేయ్! మీనాన్న నిన్ను చావబాదడానికి పెద్ద కావడిబద్ద తీసుకొస్తున్నాడు రోయ్" అని చెప్పారు.

నామీద కోపంగా వున్న



కొందరు 'అబ్బాయిగారి తిక్క వదుల్తుంద'ని అన్నారు. మరి కొందరు 'తన్నులు గుద్దులు తలకాయ మాంసం' అని పాటపాడసాగారు. కొందరు భయంతో పారిపోయారు.

నేను మాత్రం గడగడ ఒణికిపోయాను. మానాన్నగారు గుళ్లోకి అడుగు పెట్టగానే కోయ్యబారిపోయి ఆగుళ్లోవున్న స్తంభాల్లో నేనూ ఒక స్తంభంగా మారిపోయాను. మానాన్నగారు కోపంతో చిందులు తొక్కుతూ 'ఏడీ వెధవ' అని కేకలువేస్తూ గుడిచుట్టూ తిరిగారు. నేను ఆయనకు కనిపిస్తేగా కొట్టటానికి! నేను స్తంభంగా మారిపోయానుగా.

నేను కనిపించకపోగా మానాన్న ఇంటికి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్తే తంతారని నేను మాత్రం గుడి సింహద్వారంవద్ద కూర్చుని ఏడ్వ మొదలెట్టాను. కొంతసేపు ఏడ్చి ముఖం ఇటు తిప్పేసరికి అల్లంత దూరంలో, మా తమ్ముడు కనపడ్డాడు. నన్ను పిలుచుకు పోవటానికి మానాన్నగారే వాడిని పంపించారని నాకు తెలుసు. నే నెప్పుడైనా అల్లరిచేస్తే మా నాన్నగారు మా తమ్ముడిని పంపి నన్ను పట్టించి తంతూఉంటారు. మా తమ్ముడికి నామీద బలేకచ్చ. మా నాన్నగారు నన్ను 'చితకామతకా' తంతూవుంటే వాడు లోపలనుంచి తొంగిచూస్తూ నన్ను వెక్కిరిస్తూ చంకలు కొట్టుకుంటాడు. అందుకే నాకు వాడిమీద గొంతుక వరకూ వుంటుంది కోపం!

మా తమ్ముడు పట్టుకుంటానికి వస్తుంటే నేను పలాయనమంత్రం చిత్తగించాను. వాడు నన్ను వెంబడించాడు. నేను పిక్కబలం కొద్దీ పరుగెత్తుతున్నాను. కాని అదేమి చిత్రమో, నేనెంత జోరుగా పరుగెత్తినా కొద్ది దూరమే దాటగలుగుతున్నా. వాడు మాత్రం పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నాదగ్గరికే వచ్చేశాడు. ఇక మా తమ్ముడు నన్ను ఒక నిముషానికో అర నిముషానికో పట్టుకుంటాడనగా నేను విచిత్రంగా సుడిగాలిలో కాగితం ముక్కలా పైకి ఎగిరిపోసాగాను. మాతమ్ముడు నావంక విచిత్రంగా చూసి, భయం వేసిందో ఏమో,

శ్రీ ముద్దుల నారాయణమూర్తి

వెనక్కి తిరిగి ఇంటివైపు పరుగెత్తాడు.

నేనలా గాలిలో కొంచెం సేపు ఎగిరి ఎగిరి మళ్లా క్రిందికి దిగి వచ్చాను. నేను క్రిందకు దిగి వచ్చి చూచేటప్పటికి మానాన్న ఎదురుగా వున్నారు. ఇంకేముందీ- ఆయన పళ్లు బిగించి ఉరుముతూ "ఏరా గాడిదా! ఇప్పు డెక్కడికి పారిపోతావ్?" అంటూ మెట్లు దిగి వస్తున్నారు. గజగజా వణికిపోయాను. ముచ్చెమటలు పోసేశాయి. అదేమి విచిత్రమో గానీ నుంచొన్న మనిషినల్లా నీళ్లు కారిపోయాను. క్రింద కారిపోయిన నీళ్లన్నీ కలిసి మంచుగడ్డగా మారిపోయాను. మా నాన్నగారు ఆ మంచుగడ్డను ఎత్తిపట్టుకొని, నేను మంచుగడ్డగా మారిపోయినందుకు 'బావురు' మని ఏడవసాగారు. మా నాన్నగారు నన్ను అంటే [మంచు గడ్డ రూపంలోవున్న నన్ను) క్రింద పడవేసి దిగాలమని చతికిలపడి ఏడ్వసాగారు. నేను క్రింద పడటంలో మురికిగుంటలోపడి ఆప్రవాహానికి నీటిలో కొట్టుకుపోతున్నాను. కొంచెం సేపటికి సముద్రంలో తేలుతున్నాను.

ఇంతలో ఒక గ్రద్ద అకస్మాత్తుగా వచ్చి (మంచుగడ్డ రూపంలో వున్న నన్ను) పైకి తన్నుకెళ్లింది. నేను కళ్లు తెరచి చూచేటప్పటికి నన్ను తన్నుకెళ్లుతున్నది నిజంగా ప్రాణంతోవున్న గ్రద్దకాదనీ, నేనే ఒక చెక్కగ్రద్ద కాళ్లు పట్టుకొని ఆకాశంలో ఎగురుతున్నానని తెలుసుకున్నాను. నాకు ముందుగా ఒక తాటినిచ్చెన గ్రద్ద కడుపులోంచి క్రిందకు వేళ్లాడుతోంది. దాన్ని పట్టుకో ప్రయత్నించాను. కాని అది నాకందలేదు. ఇంతలో ఒక పెనుగాలి వీచింది. ఆగాలికి ఆతాటినిచ్చెన నాదగ్గిరిగా వచ్చింది. వెంటనే ఆనిచ్చెనను పట్టుకొని పైకి యెక్కి గ్రద్ద ఆకారంలో ఉన్న ఆ చెక్కవిమానంలోపల కూర్చున్నాను. ఆచెక్క విమానం 'భయ్, భయ్'మంటూ వెళ్లి వెళ్లి పెద్ద పెద్ద కొండల మధ్యగా క్రిందికి దిగనారంభించింది. కొంచెం సేపు అలాదిగి ఒక పర్వత పైభాగంలో ఒక గుహ ఉంటే, సరాసరి పోయి ఆగుహలోనికి దూరింది. ఆగుహ అంతా చీకటిమయం. విమానం లోంచి దిగి క్రిందకి వచ్చాను.

ఇంతలో ఎక్కడనుంచో నాల్గు

★ కలలో వేధించిన పిలక ★

వైపులనుంచీ మంటలు పొగలు గ్రక్కుకుంటూ వస్తున్నాయ్. ఇంకా ఏవేవో శబ్దాలు 'కీచుకీచు' మంటూ 'బామ్‌బామ్' మంటూ వినబడసాగినై. నాకు బలే భయమేసింది. చెక్కవిమానంలోకి ఎక్కి పారిపోదామని ప్రక్కకు చూచాను. ఆ చెక్కవిమానం ఏదో పెద్ద శబ్దం చేసుకుంటూ ఒకపిచ్చుకగా మారి బయటికిఎగిరిపోయింది! అమ్మో! పిచ్చుక ఎంత మోసం చేసిందీ! క్రమేపి నాముందు వున్న మంటలు మీది మీదికి వస్తున్నాయ్. నేను వెనక్కు వెళ్లిన కొద్దీ అవి ముందుకు తరుముకు రాసాగినయ్. అలానే వెనక్కు చాలాదూరం నడిచివచ్చాను, చివరకు గుహ చివరిభాగందాకా వచ్చాను. ఇక ఎటువైపూ దారి లేదు. ముందు మంటలు: వెనుక పర్వతపువాలు. ఇక అక్కడ నుంచి క్రిందికి దూకి పారిపోదామని గుహాద్వారంనుంచి క్రిందకు చూచాను. అమ్మయ్యో! ఇంకేముంది? నేను భూమికి పైగా కొన్ని వేల మైళ్ళ ఎత్తున ఉన్నాను. అంత ఎత్తునుంచి క్రిందికి చూడడంలో నా కళ్లు తిరిగి మూర్ఛపోయి క్రిందకు పడ్డాను.

తిరిగి నేను కళ్లు తెరచి చూచేవరికి కొండ నడిభాగాన మెత్తటి మట్టిమీద పడివున్నాను. ఎందువల్లనో నాకు దెబ్బలు ఏమీ తగల్లేదు! నాముందు మళ్లీ ఒక గుహాద్వారం కనిపించింది. ఈసారి వెనుకటి గుహాలోవలె ఈ గుహాలో మంటలు కనిపించలేదు. సూర్యప్రకాశానికి మించే కాంతులు కనిపించినై. నేను లేచి ఒళ్లు దులుపుకొని లోపలకు నడిచాను అక్కడ అక్కడ కొన్ని కొలనులు కన్పించాయ్. ఆకొలనులలోని నీళ్లన్నీ బంగారపు రంగుతో మెరసిపోతున్నాయి. ఒడ్డున కొన్ని చెట్లు కన్పించాయి. అవి అన్నీ వెండితో చేసి ఉన్నాయ్. నేనా విచిత్రాలు చూసుకుంటూ ఆశ్చర్యంతో ముందుకు నడిచాను.

ఒకచోట రత్నాలు మాణిక్యాలు, ఇంకా ఏవేవో విలవగల రాళ్లు పెద్ద పెద్ద రాసులుపోసి వున్నాయి. ఆరాసులు ధగధగ మెరిసిపోతూ వున్నాయ్. నాకు కొన్ని రత్నాలు జేబులో పోసుకోవాలని బుద్ధి పుట్టింద. అందుచేత ఒక రాసివద్దకు వెళ్లి దోసిలి నిండా రత్నాలు తీశాను. వెంటనే ఆరాసిలోంచి ఒక పెద్ద నల్లతాచు-యించుమించు మారోకలిబండంత లావూ, నాలుగయిదు గజాల పొడవూ వుంటుంది-బుస్‌మంటూ లేచినా వెనుక పడింది. నేను ఆరత్నాలన్నీ అక్కడే పారేసి పరుగెత్తాను. ఆపాము నా వెనుకపడి తరుమసాగింది. నేనలా పరుగెత్తి పరుగెత్తి చూడకుండా ఆకొండనుంచి క్రింద వున్న ఒక బిలంలో పడిపోయాను.

ఆబిలద్వారం చాలా పొడుగ్గా వుంది. ఆబిలద్వారం అడుగు భాగాన ఒక నది ప్రవహిస్తూ వున్నది. ఆనదిలో ఇద్దరు మనుష్యులు బోటుషికారు చేస్తున్నారు. నేను వచ్చి, వచ్చి ఆబోటులో పడ్డాను. నేను చాలా ఎత్తునుంచి పడ్డందువల్ల ఆబోటు అటూ ఇటూ ఊగిపోయి మునిగిపోయేటంత ప్రమాదం ఏర్పడింది. కాని దైవవశాత్తు మునిగిపోలేదు. ఆరంధ్రంలోంచి పైకి చూచాను, ఇంకా ఆపాము తరుముకు వస్తోందేమో నని. అది ఆబిల పైభాగంలోనే 'బుస్' కొట్టుకుంటూ చూస్తూంది అప్పుడు దాని స్వరూపం చూసి నేను 'గజగజ' వణకిపోసాగాను. ఇంతలో పడవ ముందుకు సాగిపోయింది.

ఆపడవలో 'వున్న వాళ్లు ఆబిలంలోంచి ఎలా పడ్డావ్? అసలు నీ చరిత్ర ఏమిటి? సంగతి సందర్భమంతా" చెప్పమన్నారు. పూసగుచ్చినట్లు సంగతి అంతా చెప్పాను. తామూ ఆరత్నాలకోసమే వెతుకుతున్నామనీ, అక్కడికెళ్లే మార్గమేదో చెప్పమని నన్ను అడిగారు. నాకేం తెలియదని చెప్పాను. కాని వాళ్లునమ్మలేదు. దారేదో చెప్పకపోతే గొంతు పిసికి చంపుతామన్నారు. నేను బిక్కమొహం వేసి నాకేం తెలియదని 'బావురు' మన్నాను. "ఉహు ఈ ఏడ్పులు బొబ్బలు మాదగ్గర పనికిరావు. చెప్తావా? చెప్పవా?" అని ఇద్దరూ కలసి నాకంఠం గట్టిగా నొక్కసాగారు. నేను అంతకంతకూ బిగుసుకుపోయి ఒక కర్రగా మారిపోయాను. వాళ్లు అది చూచి "అమ్మ బాబోయ్ ఇదేదో దెయ్యంరోయ్"అని నన్ను [కర్రరూపంలో వున్న నన్ను) నీళ్లలోకి దూరంగా

విసరిపారేసి, ఒడ్డు వైపుకి తమ పడవను చకచకా నడుపుకు పోయారు.

నేను నీళ్లలో అలా కొట్టుకు పోతుంటే ఒకచోట ఒక పెద్దచేప నన్ను పట్టుకొని నీళ్ల అడుగుభాగానికి తీసుకెళ్ల సాగింది. అలా మేము వెళ్లగా వెళ్లగా ఒకచోట ఒక పెద్ద గుహాకనపడింది. ఆ గుహద్వారానికి తలుపులున్నాయి. ఆ రెండు తలుపులూ రెండుచేపల తోలుతో చేయబడివున్నాయ్. వాటి పొలుసు పొలుసుకి రత్నాలు పొదగబడి దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

నేనా ద్వారందగ్గరకు వెళ్లగానే మనిషిగా మారిపోయాను. అక్కడేవున్న ఇద్దరు చేప భటులు తలుపులు తెరిచారు. నాప్రక్కగానున్న చేప నాచేయి పట్టుకొని లోపలికి తీసుకుపోయింది. అలా మేము కొన్ని ద్వారాలు దాటాము. చివరకు ఒక పెద్ద హాలులోకి వచ్చాం. అక్కడ ఒక పెద్ద దర్బారు నడుస్తోంది. ఆదర్బారులోని వాళ్లంతా చేపలే. మారాక చూచి వాళ్లంతా లేచి నుంచున్నారు. అప్పటికి నాకు అది చేపలరాజ్యం అనీ, నా ప్రక్కన వున్న చేప చేపలరాణి అనీ బోధపడింది.

చేపల రాణి వెళ్లి సింహాసనం మీద కూర్చుంది. నన్ను ఆప్రక్కన వున్న సింహాసనంమీద కూర్చోపెట్టుకొంది. అవతల ప్రక్కన చేపలరాణీ కూతురు గాబోలు వుంది. నేనా దర్బారువంక విచిత్రంగా చూస్తున్నాను. నాకు అంతా అయోమయంగా వుంది. కొంచెం భయంకూడా వేసినమాట నిజమే!

ఇంతలో చేపలరాణీ లేచి తనకు చాలా కాలంగా తన కూతురుని మానవుడి కెవడికైనా యిచ్చి పెళ్లి చేయాలని వుందనీ, రేపే తనకుమార్తెకూ నాకూ వివాహంచేయ నిశ్చయించాననీ ఒక దీర్ఘోపన్యాసం ఇచ్చింది. నాగుండె 'గుభేల్' మంది. నేను చచ్చినా ఆచేపలరాణి కూతురుని పెళ్లి చేసుకోనన్నాను. అందుకు ఆ రాణీ మండిపడి అలా చేసుకోకపోతే శిరచ్ఛేదం చేయిస్తానన్నది. "అందుకైనా సిద్ధమేగాని చేపలకంపు కొట్టే నీకూతురినిమాత్రం వివాహం చేసుకోబో" నన్నాను. ఆ రాణి వెంటనే ఏదో సైగచేసింది. రెండు చేప తలారులు రెండు పెద్ద విచ్చు కత్తులతో తయారయినారు. ఆ రాణి ఇప్పుడైనా ఆలోచించుకోమని కావాలిస్తే కొంత 'టైమ్' కూడా యిస్తాననీ చెప్పింది. నాకుకోపంవచ్చి ఏమీ అక్కర్లేదన్నాను. అయితే తీసుకెళ్లి శిరచ్ఛేదన చేయండని ఆజ్ఞాపించింది. వాళ్లు నన్ను నేల మీదపడేసియీడ్చుకుపోతున్నారు. 'అరెరె! కొంతటైము అడిగి ఎలాగన్నా పారిపోతే బాగుండే' దని అప్పుడు అనిపించింది. ఇంతలో వాళ్లు నన్ను. వధ్యశిలవద్దకు తీసుకువచ్చారు. నారెండు చేతులు లాగి పట్టుకొని సిద్ధంగా వుండమని కత్తులు ఎత్తేసరికి నేను వాళ్ల చేతుల్లో ఒక పొడుగాటి తాడుగా మారిపోయాను!

వాళ్లు శ్చర్యంలోనన్ను తీసుకెళ్లి 'మహారాణీ! ఆకుర్రాడు విచిత్రంగా తాడుగా మారిపోయాడు' అని చెప్పారు. ఆ మహారాణి ఆతాడుని తీసుకొని పరికించి "వాడ్ని ఎక్కడ దాచారో తీసుకు రండని" ఆజ్ఞాపించి ఆతాటిని క్రిందకు విసిరేసింది. వెంటనే నేను కొబ్బరికాయగా మారి దొర్లుకుంటూ దొర్లుకొంటూ అన్ని ద్వారాలూ దాటుకుంటూ వడి సముద్రంలో తేలిపోయాను. ఇంతలో అక్కడికి ఒక చేపల పడవ వచ్చింది. ఆబోటులోంచి కొందరు జాలర్లు చేపలకోసం వల వేశారు. నేను ఒక వలలో చిక్కుకున్నాను. ఆజాలర్లు చేపలన్నీ బుట్టలో వేసుకొని నన్ను [కొబ్బరికాయను] కొట్టుకు తిందామని కొట్టటానికి పైకెత్తారు. "నన్ను కొట్టకండి. నేను మనిషినండోయ్" అని పెద్దగా కేక వేశాను.

"ఏడ్చావులే ఏమిటా పొలికేకలు? లేలే బడివేళయింది, సినిమాలుచూడటం:కలవరించటం" అని వీపుమీద మా అమ్మ ఒకటి చరిచింది.

అప్పుడు నేను స్వప్నలోకంలోంచి ఇవతల పడి, నా అవయవాలన్నీ సరిగా వున్నాయో లేదోనని సరిచూసుకొన్నాను.

★

★ పిల్లల పగ ☆

(35-వ పేజీ తరువాయి)

భరించలేక కుమిలి కుమిలి ఆయన చనిపోయాడు. అవన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. భర్త పోవడంవల్లనే గదా, గోపికి అంత కష్టము! ఆయనే వుంటే తనకూ యింత కష్టముండేది కాదుగదా? భర్త పోవటంతోటే నాల్గు యిండ్లలో పనిచేసి ఆవచ్చే డబ్బుతో పొట్ట పోసుకుంటూ గోపిని చదివిస్తోంది. పెద్దవాడై తన్ను పోషిస్తాడని వాడి మీదనే ఆశలన్నీ పెట్టుకు బ్రతుకుతోంది రామమ్మ.

'5 గంటలు కొట్టారురా నాయనా, లే! లేచి కొంతసేపు చదువుకో' మని గోపిని లేపి, చమురు దీపం తెచ్చి చాపమీద పెట్టి, తను వెళ్ళిపోయింది. నాల్గు లెక్కలు చేశాడో, లేదో దీపంలో చమురు అయిపోయింది; అది కాస్తా ఆరిపోయింది.

'అమ్మా దీపము ఆరిపోయిందే. ఇంత చమురు పోయవే'

రామమ్మ సీసాలో చూచింది. చుక్కచమురుకూడ లేదు! 'లేదురా నాయనా. ఇవ్వాల్టికి పడుకో. తెల్లవారాక చదువు కుందువు గాని,' అన్నది రామమ్మ. గోపి మళ్లా ముసుగు తన్నాడు.

తెల్లవారగానే చద్ది అన్నం తిని ధీవీ అరుగుమీద కాసేపు చదువుకొని లెక్కలు చేసుకుంటూ కూర్చున్నాడు గోపీ ఇంతలోకే వాళ్ల అమ్మ లోపల్నించి 'వినిపించలేదా గోపీ, 9 గంటలు కొట్టిరా! ఇదిగో ఈటిఫిన్ కారియర్ సంచిలో పెట్టుకుని వెళ్లు. మధ్యాహ్నం బళ్లోనే అన్నం తిను' అని పిలిచింది.

ఒక్క పరుగుతో అమ్మదగ్గతి కెళ్లి, టిఫిన్ కారియర్ తీసుకొని సంచిలో పెట్టుకున్నాడు. 'అబ్బ ఎంత కొత్తగావుంది' అని టిఫిన్ కారియర్‌ను చూచి మురిసిపోయాడు గోపి.

'జాగ్రత్త నాయనా, సంచి దగ్గరే పెట్టకో' అని మఱొక సారి జాగ్రత్త చెప్పింది రామమ్మ.

గోపి పుస్తకాలసంచి చంకకుతగిలించుకొని బయల్దేరాడు, దాదాపు మైలు దూరములో వున్న 'అవధాన్లు' బడికి. బడికి చేరేటప్పటికి పదికి పది నిముషాలున్నది. అప్పుడే పిల్లలందరూ తరగతిలో కూర్చున్నారు-గోపి చప్పుడు చేయకుండా పోయి తన స్థలంలో కూర్చున్నాడు. రెండు చేతులూ చూచుకున్నాడు కందిపోయాయి.

గంట కొట్టారు. అవధాన్లుగారొచ్చి, రెండు లెక్కలు జెప్పి, చేస్తూవుండమని వెళ్లిపోయాడు. అవధాన్లుగారు పోయీపోవటంతోటే క్లాసులో ఒకటే గోల బయల్దేరింది. గోపి మాత్రము లెక్కలు చేసుకుంటూ వున్నాడు.

'ఎంత బుద్ధిమంతుడురా గోపి! అందరూ ఎగురుతూంటే వాడు మాత్రం లెక్కలు చేస్తున్నాడు చూడరా!" అని గేలిచేశాడు గిరీశం.

"అరెరె, ఆపెన్సలు నాదిలాగే వుందే!" అని దగ్గఱ కొచ్చాడు రఘు. చూసినట్లు చూసి, 'ఇది నా పెన్సలే రోయ్! ఎప్పుడో కొట్టేశాడు' అని గోపి చేతులోని పెన్సలు లాగేసు కున్నాడు రఘు

'నాదే ఆపెన్సలు, మా అమ్మ కొని పెట్టింది.' అని గోపీ అంటూన్నా ఎవరూ వినిపించుకోలేదు. పైగా అందరూ గోపినిచూచి 'దొంగ, దొంగ' అని అరిచారు. ఇంతలో గంట కొట్టారు.

తెలుగు శాస్త్రులుగారు వచ్చి తెలుగు పాఠంచెప్పి వెళ్ళిపోయాడు. మామూలు ప్రకారం అయ్యవారు పోగానే క్లాసులో అంతా గలభా చెలరేగింది. ఎగురుకుంటూ పోతూ. శివుడు గోపి చేతులు పట్టుకొని వాడి సంచిని లాగేసుకొన్నాడు. సంచిలో వున్న కారియర్ మూత వూడిపోయింది- అన్నమంతా ప్రక్కనే వున్న జమీందారు గారి అబ్బాయి రాజు గుడ్డలమీద పడింది. మంచి అవకాశము దొరికింది రాజుకు.

గోపి కెప్పుడూ మంచి మార్కులొస్తూండేవి: రాజుకు ఎప్పుడూ తక్కు వొస్తూండేవి! గోపివల్లనే కదా తనకు తక్కువ మార్కులు వస్తూండేవని గోపిమీద యీర్ష్య బూనాడు రాజు. ఇప్పుడు మంచి అవకాశం దొరికింది రాజుకు. రెండు దెబ్బలు వీపుమీద కొట్టి "కండ్లు కనిపించలా వెధవా" అని గోపీని తిట్టాడు.

ఇంతలోకే మళ్లీ అవధానుగారొచ్చారు. వచ్చి రావడంతోటే రాజు ఆయన దగ్గఱ కెళ్ళి 'చూడండి సార్, గోపి నాగుడ్డల

మీదంతా అన్నము చల్లాడు' అని ఒకటికి రెండుచేసి చెప్పాడు.

'ఏరా నిజమేనా?' అని అడిగాడు అవధాన్లు, మిగిలిన పిల్లలను. అందరూ 'అవునవును' అని సాక్ష్యమిచ్చారు. అందరికీ పిప్పరమెంట్లిస్తుంటాడు రాజు. అందుకనే అందరూ అలా అతని పక్షం పలికేశారు.

"సార్ ! నా టిఫిన్ కారియర్ ఎవరో తీసుకున్నారు సార్; అన్నాల గదిలో పెట్టిందిసార్' అని ఒకమూలనుంచి రఘు అరిచాడు.

'గోపి దగ్గర వొకటుంది. అదేనేమో చూడురా' అని గిరీశం అన్నాడు.

రఘు గోపి దగ్గరికి పోయి, టిఫిన్ కారియర్ చూచి, 'అచ్చంగా నాదే! ఎప్పుడో కొట్టేశాడు సార్!!' అన్నాడు.

గోపికి ఏమి చేయటానికీ తోచలేదు.

"ఏంరా గోపీ" ఎట్లా వచ్చింది, యిది నీకు? అని కారియర్‌ను చూపిస్తూ అడిగాడు అవధాన్లు.

"మాఅమ్మకొని యిచ్చిందండి" అని అన్నాడు గోపి-వచ్చే ఏడ్పును ఆపుకొంటూ.

'నీదే అయితే అందరికిమల్లే అన్నాలగదిలో పెట్టుకోకుండా నీ దగ్గరే నంచిలో యెందుకు పెట్టుకున్నావ్?' అని ఘర్జించాడు అవధాన్లు.

'దొంగిలించింది దగ్గిర పెట్టుకోకపోతే ఎట్లాసార్!' అని తన తెలివితేటలు వెళ్లబెట్టాడు, రఘు. క్లాసంతా గొల్లున నవ్వింది.

"ఎక్కడా పెట్టవద్దు, నీదగ్గరే పెట్టుకో'మని మాఅమ్మ చెప్పింది సార్" అన్నాడు గోపి.

"వెధవ, దొంగిలించిందికాకుండా, అబద్ధాలు కూడాను" అని విరుచుకబడ్డాడు అవధాన్లు గోపిమీద. గోపి వీపు వాచిపోయింది. దుఃఖం పొంగిపోతోంది ఆచిన్న హృదయంలో.

వెనుక ఎప్పుడో ఒకనాడు గోపితల్లి, రామమ్మ ఒక రూపాయికి తన యింటెడు పనీ చేయనన్నప్పుడు వచ్చిన కోపాన్నంతా యిలా గోపీమీద చూపించి కసి తీర్చుకొన్నాడు అవధాన్లు.

పరీక్షలలో లెక్కలు కాపీ అందించనందుకు రఘు, గిరీశంలకు గోపీమీదవున్న కోపమంతా యీ రోజు తీరింది. బడి వదలగానే అందరూ యితడిని వేలుపెట్టి చూపించి 'దొంగవాడి కొడుకు, దొంగకాక యింకే మవుతాడు!" అని గేలి చేస్తూ వెళ్లిపోయారు.

రఘు గోపి ప్రక్కనుంచి టిఫిన్ కారియర్ వూపుకుంటూ పోతూ, 'లెక్కలు చెప్పవద్దులే, నీవే చేసుకో' అని ఎత్తిపొడిచాడు.

గోపికి పిచ్చి ఎక్కినట్లయింది. కడుపులో కాలుతోంది. ఆకలి కన్నా, అవమానమే ఎక్కువగా హృదయాన్ని దహించి వేస్తోంది. బడిలో వుండలేకపోయాడు. మండే యెండలో యింటి ముఖం పట్టాడు. క్రింద కాళ్లు బొబ్బలెక్కుతున్నాయి. తల మాడిపోతోంది. కాని లక్ష్యం చేయలేదు. హృదయబాధ ఎక్కువైంది. ఇంటిదాకా తూలుతూ పోయి ఆయాసం వల్ల గుమ్మంలో నిలబడిపోయి 'అమ్మా, వచ్చానే' అని తలుపు తట్టాడు. రామమ్మ కేకవిని ఆశ్చర్యంతో తలుపు తీసింది.

'అమ్మా!' అని ఒక్క కేకతో తల్లి వళ్లో పడిపోయాడు. వళ్లు కాలిపోతోంది. రామమ్మ కేమీ అర్థం కాలేదు. 'ఏరా గోపి, యేం జరిగింది?' అని అడిగింది గోపిని-గోపీ యేమి మాట్లాడలేదు.

కారియర్, పుస్తకాల సంచీ లేనందున యేదో అఘాయిత్యం జరిగివుంటుందని తెల్సుకుంది రామమ్మ.

'ఏమి జరిగింది నాయనా' గోపీ అని నెమ్మదిగా అడిగింది. మూతబడిన కండ్లను అతి ప్రయాసతో తెరిచి. 'నామీద పగఅందరూ తీర్చుకున్నారే' అమ్మా అని మాత్రం చెప్ప గలిగాడు గోపి. ★

అశ్వరత్నం

(31-వ పేజీ తరువాయి)

గించడానికా? మీ తిరుగుడుభావి. మీ గుర్రం కనబడకపోయేసరికి యీ తిరుభాష వద్దా? మూడు జాములైనా కూడూ సున్నా లేకుండా మాడుస్తారా! చాలు మీ సేవ - మీ గుర్రాన్ని ఈ కొండపక్కన పులి చంపి తిన్నది పోండి - చూసుకోండి, నా మాట అబద్ధమైతే'...అని ఆరు నెలనుండి మనసులో కుములుతూ ఉన్న సొదంతా కక్కాడు.

పదుగురు శిష్యులు ఆచార్యులుగారికి చెప్పారు, గుర్రం పోయినందుకు చింత చేయవద్దనీ, వాళ్ళే ఒక గుర్రాన్ని యిస్తామనీ, భృత్యుడు రామప్ప తిరుభావి తిరుగుడులో పడి, దోరకజ్జాయం - రామాంజ పొడితో తినలేక బాధపడుతున్నందున వాడి భోజనం విషయం శిష్యులకే అప్పచెప్పితే బాగుంటుందని సలహా యిచ్చారు. శ్రీ ఆచార్యులుగారికి అనుభవసిద్ధంగా రామప్ప వల్ల కలిగిన నీతితో మళ్ళీ భృత్యుణ్ణి ఎవణ్ణీ అట్లాటి తిరుగుడుభావుల్లో బంధించి శ్రమపెట్టలేదు. ★



ఆర్. కె. ఫిలిమ్స్‌వారి "ప్రేమలేఖలు"లో నర్గీస్.



భరణీవారి "చండీరాణి" లో ఒక ముఖ్య సన్నివేశంలో రామారావు, హేమలత, భానుమతి.

నిర్మాతలు . కృష్ణా పిక్చర్సు.
డైరెక్షన్ : యోగానంద.
పర్యవేక్షణ ప్రసాద్.
కథ, సంభాషణలు . సదాశివబ్రహ్మం.
పాటలు సముద్రాల (జూనియర్)
సంగీతం కే. కే సుబ్బరామన్; విశ్వ సాధన్, రామమూర్తి పార్టీ.
ఫొటోగ్రఫీ బొమ్మన్-డి-ఇరానీ
శబ్దం · రంగాచారి, టి ఎస్. రంగస్వామి
నటులు · లలిత, పద్మిని, ఎన్ టి. రామారావు, రేలంగి బి ఆర్ పంతులు, బాలసుబ్రహ్మణ్యం, డా॥ శివరామ కృష్ణయ్య, అమరనాన్, ఋష్యేంద్రమణి, సురభి కమలాబాయి తదితరులు.

కృష్ణా పిక్చర్సువారి "అమ్మలక్కలు" చిత్రం గడచిన 12 వ తేదీనుండి ఆంధ్ర దేశంలో నడుస్తున్నది. ఆ క్రిందటి రోజునే మినర్వా థియేటరులో ఈ చిత్రం పత్రికా ప్రతినిధులకు చూపించబడింది వినోదపూరితమైన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించగల దనడంలో సందేహంలేదు.

ఉష అనే చదువుకొన్న ఒక యువతి చిన్ననాటినుంచీ తాను ప్రేమించిన ఒక యువకుణ్ణి, తల్లితండ్రులకు యిష్టంలేక పోయినా, స్నేహితుల సహాయంతో వివాహమాడి, అనవసరమైన అపనిందలు సహితం భరించి పెడదారులు పట్టిన ఆడ పడుచు, తోటకోడలు, అత్తగార్ల బుద్ధులను సరిదిద్దుతుంది. కథారంభంనుంచీ అంతందాకా, యిద్దరు అమ్మలక్కలు అక్కడిపుల్లలు యిక్కడ, యిక్కడి పుల్లలు అక్కడ వేసి, అదిగో అన్యోన్యంగావున్న రెండు కుటుంబాలమధ్య పొర పొచ్చాలు పెంచుతూ, యీ యువతి జీవితంలో అన్నిరకాల ఒడిదుడుకులూ తెచ్చిపెట్టటానికి కారణభూతులౌతారు. వీరి తంపులు తెలిసివచ్చినమీదట చివరి సీనులో ఉషతండ్రి ఆ అమ్మలక్కలను తుపాకీతో తరిమి తరిమి కొట్టుతాను

ఈచిత్రంలో పాత్రలన్నీ ఉషఅనే ఆ ఒక్క అమ్మాయిలోని పుణ్యాత్మకాన్ని ప్రకాశింపచేయటానికే ప్రయోగించబడి



హిందీ ఫిలింతార మోహనా ఇటీవల లండను వెళ్లినప్పుడు ఆంథోనీ కిమ్మిన్స్ నిర్మిస్తున్న "పారడైజ్" అనే సినిమా తాలూకు షూటింగ్‌కు హాజరైనది. ఆ సందర్భంలో ఆసినిమాలో నటిస్తున్న తార యెవన్‌డికార్లో ఆమెకు ఆటోగ్రాఫ్ ఇస్తున్నది.

★ 'అమ్మలక్కలు' సమీక్ష ★

కాయి తద్వారా కథారచయిత చెప్పదలుచుకొన్న విషయం - చదువులు చదువుకొని మేధస్సును పెంచుకొన్నప్పటికీ, హృదయాన్ని కోల్పోని వ్యక్తి ఒక్కరువుంటే, అలాంటివారి వునికివల్లనే ఆ వ్యక్తితో సంబంధించినవారి జీవితాలు బాగుపడగల అవకాశం లేకపోలేదని కావచ్చు. ఇదే ఆ కథారచయిత ఆశయమైవుంటే, యీ చిత్రంలో అది చాలామటుకు నెరవేరిందని చెప్పాలి నిజానికి యీమాదిరి కథావస్తువు తీసుకొన్నప్పుడు చిత్రం చాలా గంభీరంగా వుంటుందనిపించవచ్చు కానీ దాన్ని తెరకెక్కించటంలో స్క్రిప్ట్ రచయిత ఎక్కడికక్కడ హాస్యాలకీ, చమత్కారాలకీ అవకాశమిస్తూ, ఏ ఘట్టంలోనూ ప్రేక్షకునికి బరువుగా వున్నట్లు తోచనీయకుండా తయారుచేసుకోగలిగారు పాత్రలపోషణలో సహితం మామూలుగా అప్రధానాంశాలు అనుకొనే వాటిని గూర్చికూడా కొంత శ్రద్ధ తీసుకొన్నట్లు తోస్తోంది.

విశ్రాంతి సమయందాకా ఎక్కడికక్కడ కథను ప్రక్కకు నెట్టి అమ్మలక్కల హాస్యాలు, సైకిలు షికారులు, డాన్సుపాటలు అంతర్నాటకాల వంటి బాక్సాఫీసు అవసరాలనుముందుగా తీర్చేసినట్లు అనిపిస్తుంది ఆ తరువాతనే చిత్రంలో అతిప్రధాన ఘట్టానికి సంబంధించిన యితివృత్తం అరంభమైంది. మొదటి భాగమంతా కత్తిరించి విశ్రాంతి తరువాత చూపబడిన ఆచిత్రాన్నే 'అమ్మలక్కలు' అన్న పేరుతో కాక, మరొక పేరుతో చూపించినా కూడా ఒక చక్కని చిత్రం తయారు అవుతుంది బాక్సాఫీసుమాట మరచిపోయి, మరొక దృష్టితో చూస్తే యీచిత్రం యీ నగానికి కత్తిరించినా ఫరవాలేని విధంగా వుండటం ఒక లోపమే అదీ కాక, యీ కథ ముఖ్యంగా వ్యక్తం కావలసిన సందేశం ఏదో అది కథాగమనంలో యితర వృత్తాంతాలమధ్య చిక్కుపడి పోతూవుండటమూ, మళ్ళీమళ్ళీ దానికోసం వెదికి ముందుకు నడిపించుకుపోతూ వుండటమూ జరిగింది.

సినిమాతారలనీ, పరిశ్రమనీ-ఈచిత్రంలో లాగే - సినిమాల్లో పాత్రలద్వారా పరిహాసలపాలు చేస్తూవుంటే, ప్రేక్షకులు అనం



మరది ప్రాణాలకు తన ప్రాణం అడ్డం వేస్తోంది వదిన

ఎ. వి. ఎమ్. వారి "వదిన" లో నాగేశ్వరరావు, కన్నాంబ

దించవచ్చు. అందువల్ల అట్టిసినిమాలు తీసిన వారికి తాత్కాలికంగా కొంత ప్రయోజనం కలిగినా కలుగవచ్చునేమోకానీ, అది దూర దృష్టితో ఆలోచిస్తే మాత్రం అది అంత ఆరోగ్యకరమైన లక్షణంగా కనుపించదు ఇటీవల వెలువడుతున్న చిత్రాలలో యీ లక్షణం ఒకటి మళ్ళీ తలెత్తుతున్నది.

సంభాషణలలో అక్కడక్కడా పాత్రౌచిత్యానికి తగనంతటి పెద్దపెద్ద పదాలు దొర్లాయి. అంతమటుకు అవి సహజంగా వున్నాయనకతప్పదు పాటలసంఖ్య తగ్గించి వుంటే కథాగమనంలో మరికొంత చురుకుతనం తేవటానికైనా అవకాశం దొరికి వుండేది.

బాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సమకూర్చటంలో పెళ్ళినిగూర్చిన ప్రస్తావన వచ్చినప్పుడు 'పెళ్లి చెసుకొని..' ట్యూను, మిస్టర్ రిమోను పెళ్ళాడమని బతిమాలిన రూప వెళ్ళిపోయేటప్పుడు 'రాదే చెలీ నమ్మరాదే చెలీ, మగవారీ నిలా...' వంటి ట్యూన్ యిలాంటివి వుపయోగించినందువల్ల ఆయా ఘట్టాలకు వ్యంగ్యంతో కూడిన హాస్యం ఆపాదించగలిగారు.

చిన్న పిల్లల ప్రేమను చిత్రించవలసి వచ్చినప్పుడు మన చిత్రనిర్మాతలు పెద్దల ప్రేమాభినయాన్నే చిన్న మోతాదుల్లో చూపిస్తున్నారు ఈ లోపమే యీ చిత్రంలో కూడా వున్నది

డైరెక్టర్ యోగానందంగారికిది ప్రథమ చిత్రమే అయినా చిత్రాన్ని చక్కగా డైరెక్టు చేశారు నటకులందరూ తమ తమ పాత్రలను సమర్థతతో నిర్వహించారు. బొమ్మన్ - డి - ఇరానీగారి ఫోటోగ్రఫీ సాఫీగా వుంది. కొన్నికొన్ని ఘట్టాల్లో అవసరంవున్నా లేకపోయినా పాత్రధారులందరూ ప్రతివాక్యమూ బిగ్గరగా, మాట్లాడటం జరిగింది

మొత్తంమీద ప్రసాద్‌గారి పర్యవేక్షణలో ప్రజాదరణను పొందగల మరొక చిత్రం వెలువడిందని చెప్పవచ్చు. యోగానందగారు రాబోయే తరం డైరెక్టర్లలో ప్రముఖ స్థానం ఆక్రమించటానికి అర్హతలు కల వ్యక్తిగా ఈ చిత్రం నిరూపిస్తోంది ★

ప్రశ్నలు–సమాధానాలు

దేవవరము రాజయ్య—నెల్లూరు.

ప్రతి సంగీత విద్వాంసుడున్నూ సంగీతమును మొదలుపెట్టబోయే ముందు "తరినాము" అంటాడు. "తరినాము" అనేది సంగీతమునకు మొదలా?

—వీణమీద "తానం" అనబడే స్వర ప్రస్తారం వాయించడం చాలాకాలంనుంచీ సంప్రదాయంగా ఉంది. తానం అనేది చాలా మనోహరంగా ఉంటుంది. అది వీణ మీద వాయించుటకు మాత్రమే చాలా యోగ్యంగా ఉంటుంది. తిరువాన్కూరు మహారాజా వంశములోని స్వాతి తిరునాళ్ మహారాజాగారు వారి కులదైవమైన అనంతపద్మనాభస్వామిమీద అనేక కృతులు చెప్పి వారి ఆస్థానంలో సంగీతమును విశేషంగా పోషించారు. వారి ఆస్థానంలో తానం వాయించేటప్పుడు "అనంతానంతా" అని ఉచ్చారణ చేస్తూ అనంతపద్మనాభస్వామి నామస్మరణ చేసేవారు. రాగాలాపనకు కూడా ఆ దక్షిణదేశపు విద్వాంసులు "తనన తాంతాం"అనే అక్షరములనే ఉచ్చరిస్తూ రాగాలాపన చేయడం పరిపాటి అయినదట. అందువల్ల దక్షిణదేశ సంగీత విద్వాంసులకివి స్వరాలాపనకు ఆధారములైన అక్షరాలుగా అలవాటైనాయి అని ఊహింపబడుచున్నది.



అరుణా వారి "గుమాస్తా"లో నృత్య నాటకంలో సతీపతులు, సరోజ, పేకేటి శివరాం.

*   *   *

యాల్లావఝుల సత్యనారాయణమూర్తి—పాలకొల్లు.

సినీమాలో చేరదలచినవారికి కావలసిన అర్హతలు వ్రాస్తారా?

—సినిమా నిర్మాణంలో ఏ శాఖలో చేరదలిస్తే ఆ శాఖకు తగిన అర్హతలుండాలి.

*   *   *

కె. శ్యామలరావు—సాలూర్.

ఒక సాంఘిక చిత్రం తీయదలచుకున్నాను, ఎంత పెట్టుబడి పెట్టాలో తెలియపర్చెదరా మహాశయా?

—తియగలిగితే 50 వేలలోనే తీయవచ్చు; తీయలేకపోతే 50 లక్షలలో కూడా తెములకపోవచ్చు.

*   *   *

కె.యస్.మహబూబ్—సికింద్రాబాదు.

చార్వాకుడు ఏకాలమువాడు? అతడు దేనినిగురించి బోధించెను? ఆయన వ్రాసిన గ్రంథములేవి?

—ఇతడు బృహస్పతి అనే మహర్షికి శిష్యుడట. క్రీస్తు పుట్టకపూర్వము మహాభారత యుద్ధకాలమునకు పూర్వమే, వేదముల భావార్థదీపికలుగా బ్రాహ్మణములు ఉపనిషత్తులు బయలుదేరిన కాలమునాటికే యీ చార్వాక సిద్ధాంతములు ప్రచారములో ఉన్నట్లుగా కన్పిస్తుంది. పంచభూతాత్మకమైన యీ ప్రత్యక్ష జగత్తు తప్ప పరోక్షమైన పరతత్వం ఇంకొకటిలేదని యీ చార్వాకుని సిద్ధాంతము. అనగా జీవాత్మగాని పరమాత్మగాని ఏదీ లేదన్నాడు.

చార్వాక దర్శనములు అనేవి అతడు రచించాడు.

పాప పుణ్యములనగా నేమి?

—దీనికొరకై ఎవ్వరినీ ప్రశ్నించ కూడదు. మీ అంతరాత్మనే అడగండి–మీ అంతరాత్మ మీకు చెప్పినదే మీకు ప్రమాణం. మీకు అన్యాయం అని తోచినది చెయ్యడం పాపం. మీకు న్యాయమని తోచినది చెయ్యడం పుణ్యం.

స్వర్గము నరకము ఉన్నవా? ఉన్నచో వాటిని చూచినవారెవరు?

—ఐహిక సౌఖ్యము ఇంద్రియ సౌఖ్యము ఎక్కువగా అనుభవించినప్పుడు అది స్వర్గానికి తుల్యం. ఐహిక బాధలూ, దేహసంబంధమైన, మనస్సంబంధమైన వేదనలూ ఎక్కువగా అనుభవించినప్పుడు అదే నరకతుల్యం. "తన దుఃఖమె నరకమండ్రు" అని భారతంలో నిరూపించినదే నిజం.

* * *

ఎమ్. శాంతికుమార్—కర్నూలు.

ప్రపంచంలో ఎక్కడ తక్కువ ఖర్చుతో చిత్రాలు తీయుచున్నారండీ?

—తక్కువ ఖర్చుతో చిత్రాలు తీయటం ఒక విశేషం కాదు. తక్కువ ఖర్చుతో మంచి చిత్రాలు తీయటం ప్రశంసార్హమైతే ఇటలీ, జపాను దేశాలను పేర్కొనాలి.

* * *

25-2-53 సంచికలో ఎత్తిపోతల జలపాతం ఫోటో వేశారే అది ఎచట ఉన్నదండి?

—గుంటూరు జిల్లా నాగార్జున కొండ వద్ద.

* * *

మేలిసీమ రామన్న–లత్తవరము (అనంతపురం జిల్లా).

స్త్రీల సంతాన శూన్యతకుగల కారణమేమి?

—స్త్రీల సంతాన శూన్యతకుగల కారణం, స్త్రీయందు ఉండవచ్చు, లేదా పురుషునియందుండవచ్చు, లేదా ఉభయులయందూ ఉండవచ్చు. ఎవరి విషయంలో ఏ లోపమో శోధించడం సాధించడం వైద్యులపని.

"స్త్రీణాం ప్రత్యక్ష రాక్షసాం" అంటారు ఎందుకు?

—పురాణాలు తెరచిచూస్తే రాక్షస జాతిలోకూడా పురుషులూ ఉన్నారు. స్త్రీలూ ఉన్నారు. కనుక పురుష రాక్షసులు ఉంటే, స్త్రీరాక్షసులు కూడా ఉంటారు. కొబట్టి స్త్రీలల్లోమాత్రమే రాక్షసులున్నారని వాదించుటకు వీలులేదు.

* * *

లాడె గంగరాజు—గుణుపురం.

షూట్ చేస్తూ "క్లోజప్స్" తీస్తారా, లేక "క్లోజప్స్" వేరేతీసి, తరువాత "ఎడ్జెస్టు చేస్తారా?

—షూటింగ్ ఎప్పుడూ కథాక్రమంలో జరగదు; పైగా అవిచ్ఛిన్నంగా జరగదు. ఒక్కొక్క షాట్ నే తీసి కథాక్రమంలో కూరుస్తారు. అందుచేత క్లోజప్ గాని, లాంగ్ షాట్ గాని వేరే వేరే తియ్యావలసిందే.



గూటాల రామారావు—హైదరాబాద్.

భాస్కర్ ప్రొడక్షన్‌వారి "బ్రతుకు తెరువు"లో ఆఖరున మీనా దేవి ఆత్మహత్య చేసుకొన్నట్లు చూపించితే కథ యింకొ రక్తి కట్టేదనుకొంటూను. మీరు నా అభిప్రాయముతో ఏకీభవిస్తారా?"

—వినోదంకోరకు ఉద్దేశించబడిన హాస్య చిత్రంలో అపశృతిలాగా ఆత్మహత్య ఎందుకని కథకు లనుకొని ఉండవచ్చు.

* * *

ఓ. వి. నరసింహం—కడప.

"*The Way of all Flesh*" అను ఆంగ్ల నవల విషాదాంతమైనదికదా! దానిని అనుకరించుచు అవతరించియా వారి "నా యిల్లు" సుఖాంతము అగుటకు కారణమేమి?

—గత శతాబ్దపు బ్రిటిష్ రచయిత శామ్యూల్ బట్లర్ రాసిన "*The Way o all Flesh*" నవలలోని కథకూ, అదే పేరుగల హాలీవుడ్ చిత్రంలోని కథకూ సంబంధం ఏమీ లేదు. ఇక అవతరించినవారి 'నా యిల్లు' విషయానికి వస్తే, ఈ చిత్రం "*The Way of all Flesh*" అనే హాలీవుడ్ చిత్రానికి మాత్రమే అనుకరణ అనే విషయం గుర్తించుకోవాలి. ఆ హాలీవుడ్ చిత్రం విషాదాంతమే. కాని 'నా యిల్లు'లో మాత్రం కథను సుఖాంతం చేశారు. పాశ్చాత్యులకు విషాదాంత గాథల సంప్రదాయం గ్రీకులనాటినుంచే వున్నది. మన సంస్కృతిలో ఆ సంప్రదాయం లేదు. అందుచేత సాధారణంగా మన నిర్మాతలు సుఖాంత కథలనే ఎన్నుకోవటం జరుగుతున్నది. అంతమాత్రంచేత విషాదాంత చిత్రాలు తీయకూడదనిగాని, అవి విజయం పొందవనిగాని సిద్ధాంతం చెయ్యలేము.

* * *

ఎన్. సత్తెయ్యనాయుడు—కుప్పం.

"విచిత్రవ్యక్తి" నవలలో (25-2-53 సంచిక) "ఫాదర్ పీటర్ విల్ హెల్మ్‌ను చూచి 'ఓహో భారతదేశ యువరాజుగారా?' అని అంటాడు. విల్ హెల్మ్‌కు భారతదేశానికి సంబంధమేమిటి?

—ఫాదర్ పీటర్‌కు మతి చలించి తనొక సార్వభౌముడినని, తన చుట్టూ వున్నవాళ్ళంతా రాజవంశీకులు, ఉన్నతాధికారులు అనీ భావించుకుంటాడు. ఆ పిచ్చిలో విల్హెల్మ్‌ను భారతదేశపు యువరాజు అని తలుస్తాడు.

* * *

ఎమ్. విశ్వనాథం—గుంటూరు.

ఉత్తమచిత్రాలు తెలుగులో ఎక్కువగా రాకపోయినా సినిమావ్యామోహం ఇంతగా వ్యాపించుటకు కారణమేమంటారండీ.

—మెదడుకు శ్రమకలిగించకుండా, అతి చవుకగా, భారీఎత్తున ప్రజానీకానికి కాలక్షేపం సప్లయిచేయ గల పరిశ్రమ సినిమా పరిశ్రమ ఒక్కటే. అందుకనే అది మన దేశంలో ఇంతత్వరగా వ్యాపించింది. అంతే గాక మన నాటకరంగం అభివృద్ధికాకుండా నిరోధించింది. పాశ్చాత్యదేశాల్లో సినిమా పరిశ్రమ వృద్ధి చెందినా నాటకరంగానికి ఏమీ దెబ్బ తగలనేలేదు.

* * *

పిల్లలమఱ్ఱి చంద్రశేఖరరావు—తెనాలి.

మీ పత్రికలో విజ్ఞాన విషయములను మంచి కథలను మొదలగువాటిని ప్రకటించిన బాగుండునుగాని సినిమా విషయములెందుకండీ? ఈ సినిమాపిచ్చి ప్రతిపత్రికకు ఉండవలసినదేనా? సినిమా విషయములవలన విజ్ఞానమేమన్నా రాగలదంటారా?

—మా పత్రికలో సినిమా ఒక పిచ్చిగా కాక ప్రేక్షకుల మానసిక వికాసానికి ఉపకరించే కళగా పరిగణించబడుతున్నది. మా సమీక్షలను, వ్యాసాలను ఈ దృష్టితో మీరు అర్థం చేసుకోవాలి సినిమా విషయాలను కళాదృక్పథంతో మాస్తే తప్పకుండా విజ్ఞాన దాయకము లవుతాయి. రష్యన్‌దర్శకుడు ఐజన్ స్టీన్ రాసిన పుస్తకాలు చదవండి. సినిమావిషయాలు చెబుతూ ఆయన ప్రపంచసంస్కృతినే మీకు వివరిస్తాడు. మా పత్రికలో సినిమా విషయాలే కాక విజ్ఞాన విషయాలు, కథలు కూడా ప్రచురిస్తున్నామని గుర్తించండి. ★



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సువారి "పెంపుడు కొడుకు" లో శోకమూర్తి పుష్పవల్లి

శ్రీ రాజరాజేశ్వరీ వారు మరొక కొత్త చిత్రం నిర్మిస్తున్నారు. జెమినీ స్టూడియోలో వీరికోసం ప్రత్యేకించబడిన ఒకఫ్లోర్‌లో షూటింగ్ జరుగుతున్నది చిత్రానికింకా పేరుపెట్టలేదు దర్శకుడు కె. వి. నాగభూషణం; అసోసియేట్ దర్శకుడు ఇంటూరి; సంభాషణలు రావూరి సత్యనారాయణ; పాటలు రావూరి, సూరిశెట్టి సాంబశివరావు బాడ్టీ కలిసి వ్రాస్తున్నారు. సంగీతం ఎమ్. డి. పార్థసారథి నటీనటులు శ్రీమతి కన్నాంబ, గిరిజ, ఛాయాదేవి, హేమలతమ్మారావు, శాను శర్మ, కోడూరి అచ్చయ్య చౌదరి, రేలంగి, అమరనాథ్ మున్నగువారు.

* * *

హెచ్. ఎమ్ రెడ్డిగారు తెలుగులో "లాఖా చాగోస్" నిర్మాణం మొదలుపెట్టి కొన్ని సీనులు పూర్తిచేశారు ప్రతిరాత్రీ షూటింగ్ నిరంతరాయంగా జరుపుతున్నారు ముఖ్య పాత్రధారులు ఎన్ టి. రామారావు, జానకి, పేకేటి శివరాం, జమున. సంభాషణలు సదాశివబ్రహ్మం హెచ్. ఎమ్ గారి పర్యవేక్షణక్రింద వై. ఆర్. స్వామిగారి దర్శకత్వం. కెమేరా అన్నయ్య. ఈ చిత్రం రోహిణీవారి ప్రొడక్షన్ నంబర్ 9 వెలరోజుల్లో లక్షరూపాయలు ఖర్చుపెడితేగాని మాటదక్కని దుస్థితిలో పడిన ఇద్దరు యువకులు ఎంత ఖర్చుపెడితే అంతకు నాలుగురెట్లు ధనం దానంతట కదిచేతుల్లో పడటంతో గొప్ప ద్రవ్యోల్బణ ప్రమాదానికి లోనవుతారు మంచి ఫార్సికల్ చిత్రంగా తయారవటానికి వీలున్న ఈ కథావస్తువును తీసుకొని రెడ్డిగారు త్వరత్వరగా నిర్మాణం జరుపుతున్నారని తెలుస్తోంది

• శ్రీ పి. సుబ్బారావుగారి దర్శకత్వాన తయారవుతున్న "వయారిభామ" జానపద చిత్రం ఈ నెలాఖరుకో, వచ్చేనెలలోనో విడుదల కాగలదని తెలుస్తున్నది. ఎస్ వరలక్ష్మి, నాగేశ్వరరావు, సులోచన, సి ఎస్. ఆర్, మున్నగువారు ఇందులో నటించారు.

★ కరణీకం ★

(11-వ పేజీ తరువాయి)

కూతురికి తల్లి గాదూ! "మీ మామగారు పెట్టెలో పెట్టుకు తాళం వేసుకెళ్ళారు - రాగానే యిస్తాను. కావాలంటే పిల్లదాన్ని కొట్టించి కొట్టించి అడిగావుట - మునుపూ ముందూ మేం యెవరికైనా వొక దమ్మిడీ కాణీ కాదూ?" అని యెత్తిపొడిచింది. దొంగకు తేలు కుట్టినట్టు వూరుకున్నాడు కొత్త అల్లుడు. ఈదఫా వచ్చినప్పుడు మామగారిని ఖచ్చితంగా అడిగెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

6

కాలం పడి తిరిగినకొద్దీ నరసయ్యకి నిద్ర పట్టడంలేదు. ఈమధ్య కరణంగారింటికి రావడం తగ్గించేశాడు. పగలూ రాత్రీ ఋణబాధే. మన రైతుల్లో నూటికి తొంభైమంది ఈ బాధతోనే క్షీణిస్తున్నారు. వడ్డీలు వీళ్ళ కొంపల్ని గుల్లచేస్తున్నాయి. రాత్రి రెండు ఝాములు దాటింది. గొడ్లకి గడ్డి వెయ్యడానికి కొట్టంలోకి వెళ్ళాడు. పశువులన్నీ వున్నాయి గానీ తద్దికి యీనిన గేదెపడ్డ కనబడలేదు. పాడిగొడ్డు. ఎక్కడకు పోయిందో అని చీకటిలో లాంతరు పుచ్చుకుని చుట్ట కాల్చుకుంటూ వూరుదగ్గిరే వున్న పొలాలలో వెదకడానికి బయలుదేరాడు. శీతాకాలం వచ్చేసింది. మంచు బాగా కురవడం మొదలైంది. జొన్న మొక్కలు పసరు పరిమళాన్ని గుబాళిస్తున్నాయి. ఇంకా చుక్క పొడవలేదు. రమారమీ రెండు గంటలవుతుంది. పొలం అంతా కలయజూశాడు. గేదె అవుపడలేదు.

దీపంలో చమురు అయిపోయి ఆరిపోయింది. కర్రతో నేలతట్టుతూ గట్టుమీద అడుగువేసుకుంటూ ఇంటికి వస్తున్న నర్సయ్యకి దూరాన అలికిడి వినబడింది. నిలబడి శ్రద్ధగా విన్నాడు. చేరువలోనే ఎవరో నేల తవ్వుతున్నట్లు పసికట్టాడు. కొంతసేపయిన తర్వాత వొకమనిషి ఎదురయ్యాడు, చుట్ట కాల్చుకుంటూ అతనికి.

"ఎవరు? అక్కడ నుంచో." ఎదుట వున్న వ్యక్తికి నర్సయ్య ఆడిన యీ మాటలతో మీది ప్రాణాలు మీదికే యెగిరి పోయాయి. "మంచుకి చుట్ట నెమ్ముకుంది. అగ్గి గాలుద్దుగాని" మళ్ళీ అన్నాడు నర్సయ్య. దీనితో యెదుటవాడు కొంచెం కుదుటబడ్డాడు. కప్పుకున్న దుప్పటి దారపు కొసలు త్రెంపి పెనవేసి యిచ్చాడు నర్సయ్య వాడిచేతికి. వాడు నిప్పు అంటించి యిచ్చాడు. చుట్ట కాల్చుకుంటూ ఆ గ్రుడ్డి వెలుతురులో నూతనవ్యక్తిని చూస్తూ మళ్ళీ ప్రశ్నించాడు నర్సయ్య "ఎవరు మీరు?" "మాది పేటండి. నిన్న రేత్రి నాగమల్లివచ్చి పడుకున్నాం. ప్రొద్దుటికి ఊరు చేరుకోవాలండి" అని మెల్లిగా సాగిపోయాడు. నర్సయ్య ముందుకు వస్తూవుండగా యింకా ఎవరో కొందరు హఠాత్తుగా తొలగిపోతున్నట్లు గుర్తించాడు.

నడుస్తున్న అతని కాళ్ళకి యేవో గుడ్డలు తగిలాయి. వాటినితీసి చుట్ట ముట్టించి ఆ వెలుగులో చుట్టూ కలయజూచాడు. చేనులో వొకగొయ్య కనబడింది. గోతిలో యేవో మడతలుగావున్న తెల్లబట్టలు. వొక్కొక్కబట్టే విప్పి చూడసాగాడు ఆశ్చర్యంతో. నెమ్మదిగా మడతలు విదుపుతున్న అతని చేతులకి యేదో వస్తువు తగిలింది. వొళ్లు ఝల్లుమంది. చుట్టచుట్టుకొని పడుకునివున్న జెఱ్ఱి గొడ్డులా మెదిలింది గుబ్బపు కాసులపేరు అతని వేళ్ళమధ్య! వణకుతున్న దేహంతో కాసులపేరు చేతబట్టుకొని వొక్క వుడాయింపులో ఇల్లు చేరుకున్నాడు. గుండె బహు వేగంగా కొట్టుకొంటూంది. దారిలో మాట్లాడిన వ్యక్తి స్వరాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఆతడు పేరుపడ్డ గజదొంగ గంగినాయుడు. తన యిల్లంతా దోపిడీ చేయించి వుంటాడని కలవ్రొక్కుకున్నాడు. ఇంట్లో అడుగు పెట్టగానే అతనికి మరీ యెక్కువయింది ఆశ్చర్యం. ఎక్కడ సరుకులు అక్కడే వున్నాయి చెక్కుచెదరకుండా. మరి ఇదేమిటి? తన కూతురు కాసులపేరు అక్కడకెలా వచ్చింది? ఇదేదో ఇంద్రజాలంలా వుంది. కిక్కురుమనకుండా మంచంమీద వాలి కొట్టుకుంటున్న గుండెల్ని కుదుటపెట్టుకు పడుకున్నాడు.

వీధిలో పొక్కుతున్న గోలతోనే లేచాడు నర్సయ్య. వూరంతా గోలైపోయింది. వీరిశెట్టిగారింట్లో దొంగతనం జరిగిందని, ఆరువేల జవ్హారీ అపహరింపబడింది. గజదొంగలు కావిడిపెట్టెను కన్నంలోంచి దాటించి పల్లపుచేలో దాన్ని బ్రద్దలుగొట్టి నగలెత్తుకుపోయారు. నర్సయ్యకు ఇందులో కొంత బోధపడింది. కాని అతనిలో మెదిలే అసలు చిక్కు విడిపోలేదు.

తలయారీ ద్వారా బకీడు రాసి పంపేశాడు మునసబు. పదకొండుగంటలకి లారీమీద పోలీసులతో హాజరయ్యాడు సబ్ ఇనస్పెక్టరు అబ్రహాం. పగడ్బందీగా నేరానికి సంబంధించిన స్థలాలు తనిఖీచేశాడు. అడుగుల జాడలు తీసుకున్నాడు. కేసు రికార్డు చేసుకుని వీరిశెట్టిని పెద్దమనుషులతో స్టేషనుకు రమ్మని పేటకు వెళ్లిపోయాడు. తక్షణం గుంపులవాళ్లకు కబురుచేయించి అందర్నీ లాకప్‌లో వుంచాడు.

క్రొత్త ఇన్‌స్పెక్టరంటే అందరికీ హడలు. ఆయన లంచం పుచ్చుకోడని వినికిడి. మూడుగంటలదాకా మక్కెలూ, పక్కలూ విరగ్గొట్టగా నేరం వొప్పుకున్నాడు గంగినాయుడు. సాయంత్రం పెద్దకాపున్నూ మరిముగ్గురు పెద్దలున్నూ వీరిశెట్టిన్నీ హాజరయ్యారు స్టేషనుకి,

ఫిర్యాదీ వాజ్మూలాలుపూర్తి అయ్యాయి.

మర్నాడు కరణానికీ నర్సయ్యకీ సమ్మనులు వచ్చాయి పోలీసుస్టేషనునుంచి. గ్రామస్తులంతా సమ్మన్ల మాట విని విస్తుపోయారు. ఇదీ పెద్దకాపు పన్నాగమే అనుకున్నారు. కరణం సబ్ ఇన్‌స్పెక్టరు ఇద్దరూ కొంతసేపు ముచ్చటించుకున్నారు. బి. ఏ. తరగతిఇద్దరున్నూ ఒకే కాలేజీలో చదువుకున్న మిత్రులు. మర్మం వుంచక కథ అంతా చెప్పాడు కరణం. తనవాజ్మూలంగూడా యిచ్చేశాడు. అతని సమక్షంలోనే నర్సయ్యను పరీక్ష చేస్తున్నాడు ఇనస్పెక్టరు.

"మీకు శెట్టికీ వైరం ఎన్నాళ్ళనుంచి ?"

నర్సయ్య "మాకు వైరమే లేదే"

"మీ మీద శెట్టి దావా చెయ్యలేదూ?"

"అవును బాకీవుంటే చేశాడు. సొమ్ము చెల్లించేశాను"

"పెద్దకాపుగారితో మీ రెప్పుడైనా పోట్లాడారా ?"

"లోగడ వాళ్ళే నా మీద ఛార్జి పెట్టారు. మేజస్ట్రీటు కేసు కొట్టేశారు. అప్పటినుండి ఆయనే నామీద పగబట్టాడు"

"దొంగతనం నాటిరాత్రి మీరు పొలాని కెళ్లలేదూ ?"

"వెళ్ళాను-"

"గంగినాయుడు మీకు పుగచుట్ట అంటించలేదూ"

"నిజమే"

"వాళ్ళుపెట్టె బ్రద్దలు గొడుతూండగా మీరు చూడలేదా ?"

"లేదు-"

"అయితే ఈచోరీగురించి మీ కేమీ తెలీదన్నమాట"

"తెలీదు"

"కరణంగారూ? ఈయన్ని అరెస్టు చేయాల్సివుంది."

అని ముగించాడు ఇనస్పెక్టరు.

కరణం ముఖం యెఱ్ఱబారింది. నర్సయ్యకు ఇందులో పాలుందా అనిభ్రమించాడు. వెంటనే తమాయించుకుని "నెలరోజులు గడవు యిప్పించాలి. నాస్వంత జామీనుపైన ఇతనికిగాను పదెకరాలపల్లం భూమి మీకు సెక్యూరిటీ ఇస్తున్నాను." అన్నాడు. సెక్యూరిటీ పత్రంమీద సంతకం చేయించుకుని కరణం నర్సయ్యలను పంపేశారు.

దారిలో చాలాసేపు మౌనంగావున్నాడు కరణం. "నాకూ వాటావుందనేగా మీ అనుమానం ?" నర్సయ్య ప్రశ్నించాడు.

"కాదు ఇందులో ఏదో చిదంబర రహస్యం ఇమిడి వుండాలి"అన్నాడు కరణం—

కరణంతోబాటు నర్సయ్య గూడా వూళ్లోకి రావడం పెద్దకాపుకీ, శెట్టికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. తాము రెండు వందలు ఆశపెడితే కళ్ళెఱ్ఱజేసిన ఇన్‌స్పెక్టరు కక్కుర్తి ఎలా పడ్డాడా? అనుకున్నారు. కరణమే యేదో యెత్తు యెత్తివుంటాడని నిశ్చయించుకున్నారు.

7

విజయదశమి వెళ్ళాక దీపావళి వెంచేసింది. ఈ ఏడు దీపావళికి కళాకాంతులు లేవు. కడుపులో ఆకలిమంటలతో గడిపారు గ్రామీణులు. 'దిబ్బీ! దిబ్బీ! దీపాలమ్మాస' అంటూ గోగుకఱ్ఱలు కొట్టి గుగ్గిలం చల్లి కాళ్లు గడుక్కుని బెల్లం ముక్క నోట్లో వేసుకుని వూరుకున్నారు నాదారు రైతుబిడ్డలు. డబ్బున్న మహారాజులు టపాకాయలూ, మతాబులూ కాల్చుకున్నారు.

నర్సయ్య అల్లుడు ఈసారి మామగారిని ఖచ్చితంగా అడిగాడు కాసులపేరు. వొళ్లు మండుకొచ్చింది నర్సయ్యకి. పెట్టిలోంచి పేరు దీసి అల్లుడి వొళ్ళో గిరవాటేసి "దొంగల మనుకున్నావేమో! సువ్వూ వూళ్ళోళ్ళవాళ్ళకివలె. ఆడవాళ్ళని అడిగి దఫదఫాలుకొప్పడ్డావుట.!జాగ్రత్తగాపెట్టుకో ఎలాగైతే గడించావు బంగారం! మీ సైజగుణాల్ని పోనిచ్చుకున్నారుగాదు" అని గుమధుమలాడేడు. కాసులపేరు చూడ్డంతోనే అల్లుడు కేమీ ఆశ్చర్యం కలుగలేదు గానీ, గౌరికీ, వెంకయ్యమ్మకీ క్షణంసేపు నోటమాట పెకల్లేదు. ఇదేదో మహేంద్రజాలంలా వుంది. తుదకు వెంకయ్యమ్మకే వొక భ్రాంతి గలిగింది "భర్త కరణంతో చెప్పి ఏదో తనఖా వ్రాయించి వస్తువు తెప్పించివుంటాడు" గుండెలు పీచుపీచుమన్నాయి. ఏమన్నా తెలుసునేమో అని గౌరిని అడిగింది. తన కేమీ తెలీదని గౌరి విస్తుపోయింది.

నాగుల చవితికి తోటి పడుచులతోబాటు గౌరి పుట్టలో పాలు పోసుకురావడానికి బయలుదేరింది. కాసులపేరు మెళ్ళో పెట్టుకుని పట్టుచీరె కట్టుకున్న గౌరి సాక్షాత్తు గౌరిదేవిలా వుంది. పళ్ళెంలో కాల్చిన తేగముక్కలూ, బుఱ్ఱగుంజూ, చలిమిడీ, చిమ్మిలీ, రెండు కోడిగుడ్లూ—పుట్టలో నాగన్నని మేల్కొల్పడానికి టపాకాయలూ పెట్టుకుని వెళ్ళింది. గరువులో పెద్దపుట్టలో కాలనాగేంద్రుడున్నాడని ప్రతీతి. పుట్టలోపాలు, తెచ్చిన ద్రవ్యాలూ పడేసి ప్రార్థించింది నాగన్నని: "పైరు పచ్చలీ, పైలనీ, పాతేరులీ, పాపాయిల్నీ రాత్రనకా పగలనకా మసలే రైతు సోదరుల్నీ చల్లగా కాపాడమని."

మర్నాడు సాయంత్రం వెంకయ్యమ్మ క్రొత్తగా యీనిన గేదె పాలతో జున్ను వండి ఆప్యాయంగా కరణంగారింటి కిచ్చి రమ్మని గౌరితో పంపింది. జున్ను గిన్నె యిచ్చి తలుపుచాటున నుంచున్న గౌరిని ముసిముసి నవ్వులతో పలకరించాడు కరణం. "గౌరీ - మావాడింకా నాలుగురోజులుంటాడుటగా—పున్నమి వెళ్ళాక నిన్ను తీసుకెళ్ళుతాడా?" గౌరికి చటుక్కున కాసుల పేరు ఉదంతం జ్ఞాపకమొచ్చింది. అలా నుంచుని గడగడలాడుతూ ఆ సంగతి చెప్పింది. కరణం ఆశ్చర్యపడ్డాడు. "సిగ్గందుకే - ఇలా కూర్చో మాట్లాడే పనుంది" అని పేదరచదర చూపించాడు. తల వంచుకుని వున్న గౌరిని ప్రశ్నించాడు "కాసుల పేరు మీ నాన్నావాళ్ళేనా? ।ఇంకెవరేనా చూశారా?"

"ఎవరూ చూడలేదండి. నిన్న మాత్రం పుట్టలో పాలోసుకొస్తూంటే, గుమ్మంలో నుంచున్న వీరిశెట్టి తప్ప."

మధ్యలోనే గౌరిని ఆపుతూ "ఆఁ - వీరిశెట్టి-కాసులపేరు చూశాడా?" అన్నాడు. ఆత్రుతతో ఆమాట రాలేదు అతనినోటివెంట.

"ఆయనదగ్గరికి అసలు వెళ్ళకపోదునండి. మేనకోడలు వరుస కాదూ. వొరే గౌరీ! కొంత సలివిఁడీ,చిమ్మిలీ పెట్టిపోవే,అంటే, కాబోసనుకుని పళ్ళెం పట్టుకుని గుమ్మం కాడ నిలుచుని శెట్టికి పసాదం పెడుతున్నానండి. కాని శెట్టి చూపంతా నామెళ్లో కాసులపేరొంకే వుంది. పరధ్యాన్నంలో సలివిఁడిముద్దజారిపోడం చూసుకోలేదు'అత్తోయ పెట్టేరేంటే' అని అడిగాడు. ఔనండి అన్నాను. నా మెళ్ళో కాసులపేరు ఎందుకో ఎగాదిగా తడవడం మొదలెట్టేడు. చేతులు వణికాయి. శెట్టి కేదో మతిపోయినట్లయింది. 'పొద్దుపోతోంది పోవాల'ని యింటికి చేరుకున్నాను" అంటూ ఏదో పని వుందని సాకుతో వెళ్లిపోయింది గౌరి.

కరణానికి నర్సయ్యమీద అనుమానం బలపడింది. వొంటినిండా తేళ్ళూ జెఱ్ఱులూ ప్రాకుతున్నట్లుంది. అనవసరంగా అతన్ని

★ కరిణీకం ★

నమ్మకానికి రొంపిలోకి దిగిపోతున్నట్లుంది. ఉబ్బు పాపిష్టిది అనుకున్నాడు.

చీకటి పడుతుండగానే నర్సయ్యకి కబురొచ్చింది. రెండు అంగల్లో కరణం యింటి ముందు వాలాడు. గ్రుచ్చిగ్రుచ్చి అడిగేడు కరణం నర్సయ్యను. ముందు కొంత వేళాకోళం ఆడినా, చివరికి వొప్పుకోక తప్పింది గాదు నర్సయ్యకి. పూసగ్రుచ్చినట్లు వున్నదంతా విన్నవించాడు.

మరునాడు దయాన సవారీబండి కట్టుకుని పోలీసుస్టేషనుకి హాజరయ్యాడు కరణం నర్సయ్యతో—ఇన్‌స్పెక్టరును కోరి ఫిర్యాదీల వాజ్మూలాలు చూశాడు. "కావిడి పెట్టెలో వుంచిన సామానుల వివరం జలతారు పంచెల చాపు. వెండిగంధపు గిన్నె - నూరురూపాయల నోట్లు ముప్పై - లోకుల వల్ల తాకట్టుపట్టిన బంగారపు వస్తువులు కొన్ని - కరణంగారి వొదినగారి కాసులపేరు వొకటి—నర్సయ్యపైన నేను దావా చేశానని, కరణంగారి మద్దతుతో సదరు నర్సయ్య గంగినాయుడికీ గుంపులాళ్ళకీ ఉసికొల్పి చోరీ చేయించాడు" ఇదీ వీరిశెట్టి స్టేటుమెంటు. ఇంక మిగిలింది పెద్దకాపు యిచ్చినది "నర్సయ్యను నేను పాతికేళ్లకు పైగా ఎఱుగుదును. గ్రామంలో అతనివంటి తుంటరీ, నిర్లక్ష్యంగల మనిషీ మరొకడు లేడు. లోగడ రెండుమూడు కొట్లాటల్లో పాల్గొన్నాడు. శెట్టిమీద కావేషీ గలిగి అతడే యీ నేరం చేయించాడు. ఇతనికి అన్ని విషయాల్లోనూ కరణం మద్దతు వుందనడానికి ఎట్టి సందేహమూ లేదు."

కరణం ఇంకేమీ చూడదలచుకోలేదు. యథార్థమంతా ఇనస్పెక్టరుకు విన్నవించాడు. చేతులు జోడించి ఇన్‌స్పెక్టరుకి నమస్కరించి కాసులపేరు సమర్పించాడు నర్సయ్య.

8

నాగమల్లిలో ఆ బాలగోపాలమూ ఆవేళ రామకోవెలను చుట్టుముట్టారు. పదయ్యేసరికి ఇనస్పెక్టరూ, పోలీసులూ, ముద్దాయిలూ చేరుకున్నారు గ్రామానికి. పెద్దకాపునీ, వీరిశెట్టినీ, మునసబు కరణాల్నీ, నర్సయ్యనీ కబోలు చేయించి విచారణ ప్రారంభించాడు ఇన్‌స్పెక్టరు. స్టేషనులో యేలా యిచ్చారో అలాగే వాజ్మూలాలు ఇచ్చారు వాళ్ళంతా. జాగ్రత్తగా స్టేటుమెంట్లు రికార్డుచేసుకుని వారిచే నిశానిసంతకాలు పెట్టించి తీర్పు చెప్పాడు సబ్ ఇన్‌స్పెక్టరు. "ముద్దాయి గంగినాయుడు చేసిన నేరానికి వాణ్నీ, గుంపునీ మేజస్ట్రేటు వారికి వప్పగిస్తున్నాను. కరణమూ, నర్సయ్యా కేవలం నిర్దోషులు. వీరిశెట్టీ, పెద్దకాపూ కరణం నర్సయ్యలపట్ల తమకు వుండే పాతపగలు పురస్కరించుకొని యీ కేసు వారిపై బనాయించారు. కాబట్టి విచారణ అనంతరం యథాప్రకారం నర్సయ్య కాసులపేరు" అంటూంటే శెట్టి ఖంగారుతో "అయ్యా! అది కరణంగారి వదినె గారి దండీ" అన్నాడు.

"ఔనయ్యా - నేనుమాత్రం కాదంటున్నానా? నర్సయ్య కరణంగార్కి సోదరునివంటివాడే గా - నర్సయ్య భార్య ఆయనకు వదినెగాదూ?" అన్నాడు ఇనస్పెక్టరు. ప్రశ్నార్థకంగా కరణంవంక చూశాడు శెట్టి.

"ఏం అలా తెల్లమొగమేస్తావ్? నర్సయ్య ఎంత పెద్ద మనిషీ! అతని ఘరానా ఏపాటిదీ! నాకు అన్నయ్యకన్న అతనే ఎక్కువ" అని కరణం ఢంకామీద దెబ్బకొట్టినట్లు చాటుతూంటే మారాజురా! నెయ్యన్నందిన్న బాబుకి చెయ్యెత్తిదణ్ణం పెట్టండిరా" అన్నారు. అలగాజనంతో సహా అందరూ. 11 ఈతప్పిదానికి పెద్దకాపునీ శ్రేష్ఠినీ గూడా మన్నిస్తున్నాను. ఇకనుంచి ఈ తగువేగాక వూళ్లో తగువులన్నీ మునసబు కరణాల పరంగా పరిష్కరించుకోండి" అని ముగించాడు ఇన్‌స్పెక్టరు. ఆ యింట్లోంచీ యీ యింట్లోంచీ కిటికీల్లో ముఖాలుపెట్టుకు చూస్తున్న అమ్మలక్కలు వీరిశెట్టినీ పెద్దకాపునీ చూసి ముసి ముసి నవ్వులతో ముఖాలు చాటేసుకున్నారు.

సాయంత్రం ఇన్‌స్పెక్టరుగారిని సాగనంపి ఇళ్ళకుమళ్ళారు కరణం నర్సయ్యలు. తుమ్మల్లో ప్రొద్దుగ్రుంకుతూంది, జొన్నలకుచే కలుపు తీతలకెళ్లిన పల్లెపడుచులు పదాలు పాడుకుంటూ ఇంటికొస్తున్నారు. కరణానికి జొన్నచేను చూపుతూ "ఈచేను చూడండి స్వాతి చల్లగా వుండి విశాఖ విసరకుండా వుంటే ఇలాంటిపది కరవులకి సరిపడే జొన్నపండు తుంది యీయేడు" అన్నాడు నర్సయ్య. కరణానికి యీ సాలుకి పాడ్యలక్ష్మి జొన్న పాలాలనే విహరిస్తుం దనిపించింది.

ఆరాత్రే రాజీ పెట్టేశాడు కరణం మునసబు ముఖంగా - నర్సయ్యబాకీకి గానూ అయిదేళ్ళు అతని రేవడి అస్వాధీనపుతనఖా వ్రాయించుకోవడానికి శెట్టి చేవరతుగా అంగీకరించాడు. కాసులపేరు నర్సయ్యకిచ్చేశారు. సంక్రాంతి లోగా దస్తావేజు వ్రాయించి నర్సయ్యస్వంత ఖర్చులమీదనే రిజిష్ట్రీ చేయించడానికి కరణం గారిదే, పూచీ. ఎటొచ్చీ శెట్టికి గుండె గుభేలుమనిపించినది దస్తావేజులో యేడణాల నాలుగు దమ్మిడీలవడ్డీ వక్కాణించుకున్నా అసలు వడ్డీయే పుచ్చుకోగూడదన్న మునసబుగారి తీర్పు కిమ్మనకుండా వొప్పుకోక తప్పింది కాదు.

"అక్కా తమ్ముళ్లెంత నాటక మాడారూ?" నవ్వుతూ తగవునుండి యింటికి వస్తున్న నర్సయ్య అన్నాడు కరణంతో. "నువ్వుమాత్రం ఏం తక్కువ తిన్నావేఁ? మా మాయనాటకం సుఖాంతంచేశావుగా" అన్నాడు కరణం. చుక్కల్లో చంద్రుడు మంచు నుసి రాలుస్తూ, వేళాకోళాలాడే బావమరదులిని చూసి పకపక నవ్వుతూ, శరత్కాలమేఘ కన్య కొనకొంగులో ముఖం కప్పుకున్నాడు. ★

★ కందకులేని దురద ★

(37-వ పేజీ తరువాయి)

అన్యాయం జరిగిందేమో నా శిష్యుణ్ని తమరే స్వయంగా ప్రశ్నించవచ్చు—"

శ్రీవారు శిష్యుణ్ని అడిగి చూశారు. గోపయ్యగారు తప్పుడు లెక్కలు పంపలేదనీ తను యీ గ్రంథాలవరకూ మాత్రమే అమ్మకలిగాననీ మిగతావి వారే స్వయంగా అమ్మిపెట్టినారనీ సీనయ్య ఒప్పుకున్నాడు.

వెంటనే శ్రీవారికి ఒక చిన్న ఆలోచన నిశిలోని మెరుపులా తట్టింది.

మహారాజు వెంటనే బసవయ్యను పిలిపించి సభికుల ఎదురుగా అతన్ని నిలుచోబెట్టి—"ఇతని విచారణ రేపు జరుగుతుంది. తన పనిలో తాను నిమగ్నుడై వుండక, తనకు ఏమాత్రమూ సంబంధంలేని యితర శాఖలవారి పనులతో చేతులుకలిపి, గురుశిష్యుల మధ్య భేదాభిప్రాయాలను రేకెత్తించి, మహారాజు నిర్ణయానికే అభ్యంతరం కలుగజేసిన యీతని చర్యను రేపటి సభలో ఏవిధంగా ఒక చక్కటి వాక్యంలో చమత్కారంగా చెబుతారో వారికి మూడవ బహుమానం." అని ఆనాటి కొలువు చాలించారు.

దాంతో తిరిగి సభలో కలకలం ప్రారంభమైంది. కొంత సేపటికి ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పెద్దపెద్ద బుర్రలన్నీ చాలా చాలా ఆలోచనలతో బద్ధలైపోయాయి. మెదడులన్నీ సమాధానంకోసం మహాసముద్రంలో యీతరానివ్యక్తికిమల్లేకొట్టుకున్నాయి. రాజుగారు ప్రసాదించబోయే మూడవ బహుమానం తప్పక పొందాలని ఆస్థానకవులకూ, పండితులకూ, తదితర వుద్యోగులకూ చాలా కుతూహలంగా వుంది.

తెల్లవారింది. తిరిగి శ్రీవారు కొలువు తీర్చారు. వచ్చీ రావడంతోనే-

"నేను చెప్పినవిషయాన్ని ఆలోచించుకు వచ్చారా?" అన్నారు సభికులవేపు చూస్తూ.

"చిత్తం, చిత్తం" అని కొన్ని వందల కంఠాలు ఒక్కసారిగా పలికాయి. ఈచిత్తాలతో మహాలంతా మారుమ్రోగిపోయింది.

రాయలవారు ఒక్కొక్కరినీ చెప్పమన్నారు.

ఒకరు శ్లోకంలోనూ, ఒకరు పద్యంలోనూ, వేరొకరు గద్యంలోనూ అనేక రకరకాలుగా చెప్పారు. అయితే-ఒక్కటీ మహారాజుకి నచ్చలేదు.

"ఇక ఎవ్వరూ చెప్పేవారు లేరా?" అని తిరిగి ప్రశ్నించారు ప్రభువులు.

రంగయ్య అనే ద్వారపాలకుడు వణుకుతూ ముందుకువచ్చి శ్రీవారికి వంగి నమస్కారంచేసి, "తమ సెలవైతే నేను చెబుతాను" అన్నాడు.

అంతట రాయలవారు నవ్వుతూ "ఊఁ చెప్పు."

"అయ్యా! మన బసవయ్యగారికి, తమరు సెలవిచ్చినట్లుగా, వారికి అవసరంలేని విషయాలలో జోక్యం కలుగజేసుకునే అలవాటు చాలా వుంది. అన్నింటిలోనూ ఆయన అదే తరహాగా వుంటారు. నా చేతిక్రింది పహారావాళ్ళని ప్రక్కకిపిల్చి నాతో చనువుగా వుండవద్దన్న రోజులు నాకింకా జ్ఞాపకం. ఏలినవారు చెప్పమన్నారు కాబట్టి, నా యీ స్వల్పబుద్ధికి తోచింది ఒక్క ముక్కలో చెబుతాను.....నిజంగానే గనుక గోపయ్యగారు సీనయ్యగారిని అన్యాయంచేస్తే ఆ విషయాన్ని సీనయ్యగారే స్వయంగా తమతో మనవిచేయాల్సి వున్నది కానీ, బసవయ్యగారు కాదు. సీనయ్యగారు యీ విషయంలో మౌనంగానే వున్నారు. పైగా ఆయనవారి గురువుగారు వేసిపంపిన లెక్కలు తప్పుకాదని కూడా ఒప్పుకుంటున్నారు. అంచేత యీవిషయాన్ని ఏవిధంగా పరిశీలించి చూచినా "కందకు లేని దురద బచ్చలికా!" అన్నట్లున్నది అన్నాడు.

"భేష్ - భలేగా చెప్పావు" అన్నారు శ్రీవారు చప్పట్లు చరుస్తూ. దాంతో కవులూ, పండితులూ, అంతా చిత్తరపోయారు; తమ శ్లోకాలూ, పద్యాలూ యీ ద్వారపాలకుని ముందు వృథాఅయిపోయాయని.

గురు శిష్యులకూ, ద్వారపాలకునికీ వరుసగా చక్కటి బహుమతులు లభించాయి.

"నాల్గవ బహుమతి మన కోశాధికారికి యివ్వడానికి నిర్ణయించాం" అంటూ సెలవిచ్చారు నవ్వుతూ రాయలవారు.

తిరిగి సభంతా ఒక్కసారి గొల్లుమంది. అంతా ఆశ్చర్యపోయారు.

కాలక్షేపం

(4-వ పేజీతరువాయి)

వలె ఒక్కమాటమీద అధికారం చలాయించగలడు. ఉక్కు ముక్క వలె అధికారం చెలాయించవలెనంటే అతని రాజ్యంలో ఒక్కటేపార్టీ ఉండాలి. ఉక్కు ముక్కకు చెకుముకిరాయితో సంఘర్షణ అనేది సంభవించకూడదు. అట్టి సంఘర్షణ సంభవిస్తే అగ్ని ప్రజ్వరిల్లి రాజ్యం ఆజ్యం పోసినట్లుగా అంతర్యుద్ధాలతో ఆహుతి అవుతుంది. ప్రభుత్వం అంతా అగ్ని పర్వతం అవుతుంది. హిట్లరు రాజ్యమేలినంత కాలమూ, దేశంలో నాజీ పార్టీ తప్ప మరొక పార్టీ లేదు, గీర్టీ లేదు. ఒకవేళ ఏదైనా మరొక పార్టీ ఉన్నప్పటికీ దానిని కేవలం దృష్టిబొమ్మలాగున ఉండనిచ్చాడు. హిట్లరు అంటే "ఫైరర్" అనగా ఏకైక నాయకుడు. ఆఖరుకు జర్మనీ అంతా అగ్ని జ్వాలలపాలై శల్యాలతో శిథిలాలతో మిగిలింది.

ఆవిధంగా ఈ ఏకైక నాయకుడు దానిని ఉద్ధరించాడు. అందుకనే, ధర్మప్రతిష్ఠాపన జరుగవలెనంటే, "ప్రభుత్వ పక్షం" అనే టటువంటి ఒక్క పక్షమే ఉండకూడదు. ప్రభుత్వాన్ని, ప్రభుత్వాధికార పీఠాన్ని ధిక్కరించగల ప్రతికూల పక్షం కూడా ఉండవలెను. స్టాలిన్ అంటే ఉక్కు మనిషి. ఉక్కు మనిషి వెలసిన చోట ఒక్కటే పార్టీ - ఇంకో పార్టీ నోరెత్తడానికి వీలులేదు. రష్యా రాజ్యం అంతా ఎటువంటిదో చూడనక్కరలేదనిన్నీ స్టాలీఫులా కన్యాయంగా స్టాలిను ఎట్లాంటివాడో

కందకులేని దురద

తప్పుచేసినవాడికి బహుమానం ఏమిటా అని.

సభలోని కలకలం తగ్గిన తర్వాత సభను సమాప్తి చేయబోతున్నామని తెలియచేసి- "నాల్గవ బహుమతి మూడుకొరడాదెబ్బలు" అంటూ రాయలవారు కొలువు చాలించారు.

మాయతేనన్ని కానుకల్ని గురు శిష్యులూ, ద్వారపాలకుడూ తీసుకుపోతూవుంటే - పాపం - బసవయ్య వీపుమీద కొరడాపట్లాలు చిందులు తొక్కాయి. ★

చూస్తే చాలుననిన్నీ కొందరి మతం - అటువంటివారికి వందనశతం - ఎందుకంటారా? స్టాలిన్ మాటమీదనే రష్యా అంతా నడుస్తోంది అన్నట్లయితే, స్టాలిన్ తర్వాత ఎవరిమాటమీద నడుస్తుంది? కాబట్టి స్టాలినువంటి ఉక్కుమనిషియైనా, గాంధీవంటి బక్కమనిషిఅయినా, ఒక్క మనిషిమీద ఆధారపడి ఏదీ ఉండకూడదు. ఎందుచేతనంటే, అటువంటి పీఠం స్థిరంగా చిరకాలం ఉండదు.

ఒక మనుష్యమాత్రునిమీద కాకుండా, ఒక ధర్మసూత్రంమీద ఆధారపడినటువంటి వ్యవహారచక్రం సక్రమంగా తిరుగుతూ ఉంటుంది. సత్యం అనేది నిత్యమైనది. "సత్యం" అనే ధర్మసూత్రంతో మహాత్ముడు తన అహింసాపద్ధతికి ముడివేశాడు. గాంధీతత్వం అనేది గాంధీతో ముడిపెట్టబడినది కాదు. "సత్యమేవ జయతే" ఇదే కాంగ్రెసు పార్టీమూలసిద్ధాంతం అన్నాడు. ఈ సూత్రంతో ముడివేయబడిన కాంగ్రెసుగాలిపటమునకు ఏగాలి ఎటు వీచినా భయంలేదు. ఈ సూత్రానికీ ఆ గాలిపటమునకు సంబంధం తెగినప్పుడు కాంగ్రెసుగాలిపటం ఎటు ఎగిరిపోతుందో చెప్పలేము. అధికారగర్వమనేటటువంటి గాలిచేత చలించుచుండే టటువంటి కనుబొమలుగల ప్రభువుల ముఖారవిందములను "గర్వపవన వ్యానర్తిత భ్రూలసత్తల భూపాస్యము"లను గమనిస్తూ ఉండడమేనా మనకు పని? అని ధిక్కరించుటకు తపస్సంపన్నులు పూనుకోనడం దేశానికి శ్రేయస్కరం కాదు. కీర్తిశేషులైన పొట్టి శ్రీరాములుగారు సాగించుటకు సమకట్టిన నిర్మాణ కార్యక్రమ వ్యవహారములకు ప్రభుత్వాధికారుల సహాయం ఎంత యాచించినా లభించలేదు. ఆంధ్రరాష్ట్రం అనేదికూడా ఎంత యాచించినా లభింలేదు. "పాహి" అన్నాడు. "నహి" అన్నారు ప్రభుత్వ పీఠాధిపతులు. "ఇకదేహి" అనను అని "దేహం" చాలించాడు. దానితో ఆంధ్ర ప్రజాహృదయం దహించుకుపోయింది. అధికారులకు అహంకారం పోయి ఆత్మజ్ఞానం కలిగేటట్లు చేశారు. "సత్యమేవ జయతే" అని నిరూపించడమే వారి కర్తవ్యం. మహాత్ములు చేసే తపస్సు కేవలం ఆత్మనిగ్రహార్థం కాదు. అది లోకసంగ్రహార్థం.

అటువంటి ఆత్మ విజయమే ఆంధ్ర విజయం. ఆ విషయం నిజం కావడమే సత్యం జయించడం. అదే మన విజయసంవత్సరంతో వచ్చే విజయం. ఆంధ్రులు "భ్రాంతస్వాంతులౌ యాచకుల్" కార

పూర్వం ఒక సారా దుకాణంలో వినిపించిన సంభాషణ.

"ఒరేయ్! మరి తాగకురా. అప్పుడే నీమొఖం అదేమిటో మసక మసకగా కనుపించుతోంది!"

* * *

భార్య[భర్తతో.]"ఏమండీ మన బడ్జెటు చూసి మీరెందుకండీ అంత బెంగ పెట్టుకొంటారు. భారత దేశపు బడ్జెటులో ఏటాలోటే వస్తున్నా చింతామణి దేశముఖ్ గారేమైనా చింతిస్తున్నారా?"


నుట నిశ్చయం. ఇది కేవలం మన ఆత్మపంచాంగం కాదు.


ఈ ఆంధ్ర పంచాంగ శ్రవణం ఆంధ్రులకే గాక, భాషారాష్ట్రాభిమానులందరికీ, భారతదేశం అంతటికీ శుభప్రదం.

"శ్రీకల్యాణ గుణావహం
రిపుహరం దుస్స్వప్నదోషాపహం
గంగాస్నాన విశేషపుణ్యఫలదం,
గోదాన తుల్యం నృణాం
ఆయుర్వృద్ధిద ముత్తమం
శుభకరం సంతాన సంపత్ప్రిదం
నానాకర్మ సుసాధనం సముచితం
పంచాంగ మాకర్ణ్యతాం."

తా॥ ఈ ఆంధ్రపంచాంగ శ్రవణం చేయవలెను. అది కల్యాణగుణావహమైనది. మన శత్రువులను నిర్మూలించేది. -మనకు గలచెడు స్వప్నదోషమును పోగొట్టుతుంది. గంగాస్నానం చేసినంత పుణ్యం లభిస్తుంది. గోదానం చేసినంత పుణ్యం కూడా మానవులకు లభిస్తుంది. ఆయుర్వృద్ధి చేస్తుంది. అనేకవిధాల మంచిది. చాలాశుభకరమైనది. ఆంధ్రుల రాజ్యాంగ భవిష్యత్తు చూపించేదే ఆంధ్రుల విజయపంచాంగం. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madra


పంచతంత్రం
మిత్రలాభం
కర్త...
నాటి అర్ధరాత్రివేళ
ఆకాశం యావత్తూ
మేఘావృత్తమైవున్నది
చలిచలిగా వానజల్లు
కొల్లలుగా కురిసింది
చలువ జల్లు, చలువగాలి - సోకినేను
మరచాను. - నరభాషలో బిగ్గరగా -
ఈ విధముగ అనుకొంటిని:
"హాయి, హాయి, సెలిరేయి! - ఈ తుంపురులతో చినుకులు - మేనుసోకి పులకిస్తూ - మృదు శాద్వలములు మేస్తూ - ... తిరుగు భాగ్యమెన్నటికో! - ఎన్నటికో, ఎన్నటికో!!!
సరిగా ఆ సమయానికి - ... రాకుమారుడొక భటుడితో - వెంటబెట్టుకొని వచ్చాడు. - నే పలికిన పలుకులు విని - ... నిలిచాడు.
మర్నాడు
రాకొమరుడు -
జ్యోతిష్కుని
పిలిచి సభకు -
వృత్తాంతం
చెప్పాడు
"ఆడుచకుము నేన్నకాదు! - ..."
... చెప్పినాడు. - ...


మార్చి 14 తేదీ
ఆంధ్రదేశ
మంతటా
విడుదల
అరుణా వారి
గుమాస్తా
నాగయ్య జయమ్మ రామశర్మ
పండరీబాయి మనోహర్
పూర్ణా రిలీజ్
VENDHAN